12-1Pg1exHMNWJQE.qxd:12-1Pg1exHMNWJQE.qxd 01/01/01 8:35 AM Page 1

వాయిస్ గత వారంరోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త


గుంటూరు
fb.com/vaartha

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-1-2025 ఆదివారం సంపుటి: 30 సంచిక: 345 పేజీలు: 12 వెల: 8.00

ఎన్నికల వేళ.. ఆప్‌కు 'కాగ్' షాక్
కార్చిచ్చులో బుగ్గిపాలైన వెయ్యికోట్ల భవనం
9లో

# 10 లక్షల కోట్ల 'గ్రీన్ ఎనర్జీ'



## ● భారీగా రానున్న పెట్టుబడులు ● అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ● సౌర విద్యుదుత్పత్తికి కొత్త ప్రణాళికలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ జనవరి 11 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని సిఎం చంద్రబాబు తెలిపారు. మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కానుందని తెలిపారు. ఈ హైడ్రోజన్‌తో ఎరువులు, రసాయనాలు తయారవుతాయని పేర్కొన్నారు. హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. అల్యూమినియం ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడితే వేడి బాగా తగ్గుతుందని వివరించారు. గ్రీన్‌కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్‌ను టేకోవర్ చేయనుంది. ఇక్కడ గ్రీన్ అమోనియా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఈ ప్లాంట్‌పై రూ.25 వేలకోట్ల పెట్టుబడులు పెడుతున్నారు. రిలయన్స్ కంపెనీ బయో కంప్రెస్ట్ గ్యాస్ తయారీకి 500 కేంద్రాలు పెడుతోంది. ఒక్కో కేంద్రానికి రూ.130 కోట్లు పెట్టుబడి పెడుతున్నారు. బయోగ్యాస్‌కు ఉపయోగపడే గడ్డి ద్వారా ఇది తయారవుతుంది. గడ్డి పెంచడానికి ఎకరాకు రూ.30 వేలు కౌలు రైతులకు రిలయన్స్ చెల్లించనుంది. బెంగుళూరు సంస్థ స్వాపింగ్ బ్యాటరీల మోడల్‌ను కుప్పానికి తెచ్చింది. సూర్యఘర్ అమలులో ఉన్న ఇళ్ల యజమానులకు స్వాపింగ్ బ్యాటరీల ఛార్జింగ్‌కు డబ్బు చెల్లిస్తారు. దీంతో వారికి అదనపు ఆదాయం చేకూరనుంది. సౌర విద్యుత్ ఉత్పత్తిపై కొత్త ఆలోచనలు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం సౌర ఫలకాలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాం అని చంద్రబాబు తెలిపారు.

**ప్రయాణికులకు సంక్రాంతి తగ్గించే దిశలో అవసరమైతే ఆర్టీసీ ప్రైవేటు స్కూల్ బస్సులను వినియోగించాలి**

ప్రయాణికులకు సంక్రాంతికి రవాణా సౌకర్యాలకు ఇబ్బంది ఉండకూడదని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రయాణికులకు సంక్రాంతి తగ్గించే దిశలో అవసరమైతే ఆర్టీసీ ప్రైవేటు స్కూల్ బస్సులను వినియోగించు తీసుకోవాలని ఆదేశించారు. సంక్రాంతికి పెద్దసంఖ్యలో పొరుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రజలు ఎపికి తరలివస్తు >>2



శనివారం కర్నూలు జిల్లా పిన్నాపురం ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న డి.సిఎం పవన్

# గ్రీన్‌కో భూవివాదం పరిష్కరిస్తాం

## ఇంటెగ్రేటెడ్ రెన్యువబుల్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన డిప్యూటీ సిఎం

### వ్యవసాయానికి పనికిరాని భూముల్లోనే పవర్ ప్రాజక్టు: డి.సిఎం పవన్

**కర్నూలు, జనవరి 11, ప్రభాతవార్త :** కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఉన్న గ్రీన్ ప్రాజెక్టుకు సంబంధించిన భూ వివాదం చిన్న సమస్యే అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో చిన్నచిన్న సమస్యలు సహజమన్నారు. వాటిని పరిష్కరించుకోవాలన్నారు. ప్రస్తుతం రెవెన్యూ, అటవీ భూములంటూ వచ్చిన వివాదంపై కేబినెట్‌కు నివేదిక ఇస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. కర్నూలు జిల్లా పిన్నా పురం వద్ద ఏర్పాటైన ప్రపంచంలోనే అతి పెద్దదైన పిన్నాపురం గ్రీన్‌కో సోలార్ పవర్ ప్రాజెక్టు పవర్ హౌస్‌ను డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. ఇక్కడ ఒకే ప్రాంతంలో విండ్ పవర్, సౌర విద్యుత్, హైడల్ పవర్ యూనిట్స్ ఉన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ప్రాజెక్టు విజిట్ చేశామని చెప్పారు. సోలార్, హైడల్, జల విద్యుత్.. పొల్యూషన్‌లేని విద్యుత్ ఇక్కడ తయారవుతుందని అన్నారు. అనిల్ చలంశెట్టి, మహేష్ గ్రీన్‌కో ప్రారంభించారని తెలిపారు. దేశంలో లక్షన్నర కోట్లు పెటుబడి పెట్టారు.

ఎపిలో రూ.30 వేల కోట్లు పెట్టుబడి పెట్టారు.. మరో రూ.20 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నారని పవన్ కల్యాణ్ తెలిపారు. పిన్నపురంలో రూ.10 వేల కోట్లు పెట్టుబడి పెట్టారు, ఇంకా 14 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు డిప్యూటీ సిఎం చెప్పారు. అటవీ నిబంధనలు ఉల్లగించారంటే చూడ్డానికి వచ్చానని పవన్ కల్యాణ్ తెలిపారు. 2800ఎకరాల్లో1700ఎకరాలు కొన్నారు.. రాళ్ల రప్పలు ఉండి వ్యవసాయానికి పనికి >>2



# కోళ్ల చుట్టూ కోట్లు!

## అధికారులు వద్దంటున్నా, నేతల అండదండలు

### వివిధ రాష్ట్రాల నుండి భారీ నగదుతో పందెంరాయుళ్లు

### డెల్టాలో బరుల జోరు, మద్యం, గుండాట, పేకాటదే పైచేయి

### భీమవరం కేంద్రంగా భారీ బరులు

**నరసాపురం,జనవరి 11,ప్రభాతవార్త:** సంక్రాంతి అనేసరికి చట్టం గోదావరి జిల్లాల్లో అటకెక్కుతుంది.కోడి పందాలు, గుండాట,పేకాట,కోతాట,మద్యం విచ్చలవిడితనమంతా ఈ నాలుగు రోజులు కనబడుతుంది. బరులు వేసిన ప్రాంతాల్లో మహిళలు బయటకి రావటానికి భయపడతారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా,కోనసీమ,కృష్ణజిల్లా తీరప్రాంతాలలో సంక్రాంతి నాలుగు రోజులు కోళ్ల చుట్టు పందెం కోళ్ళు ఎగిరినట్లే కోట్లాది రూపాయలు ఎగిరిపోతాయి. భీమవరం, ఉండి, జిత్తుగ, పాలకోడేరు, వీరవాసరం, నరసాపురం, యలమంచిలి, కలగంపూడి, వెంప, ముత్యాలపల్లి, చినగోల్ల పాలెం, పేరుపాలెం, కాజ ప్రాంతాలలో అత్యధికంగా బరులు వేస్తారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో అనధికారికంగా >>2

తొక్కిసలాట ఘటన

# క్షతగాత్రులకు చెక్కులు అందించిన టిటిడి చైర్మన్

**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ద్వార దర్శనాల ఉచిత సర్వదర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లు జారీలో జరిగిన తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి, తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు శనివారం రాత్రి పరిహారం చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, బోర్డు తీర్మానించిన విషయం విదితమే. శనివారం రాత్రి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న తీవ్రక్షతగాత్రులైన బాధితులు అన్నమయ్యజిల్లా రామసముద్రం మండలం నరసాపురంకు చెందిన ఎస్,తిమ్మక్కకు 5లక్షలు రూపాయలు, విశాఖ జిల్లా గోపాలపట్నంకు చెందిన పి.ఈశ్వరమ్మకు 5లక్షల రూపా >>2

# గిరిజనుల కోసం ప్రత్యేక ఆరోగ్య రథాలు

## ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జనవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజన ప్రాంత ప్రజలకు వైద్యసేవల కోసం ప్రత్యేక ఆరోగ్యరథాలు ఏర్పాటు చేసామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, మైనింగ్,ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రమాదాలు అధికంగా జరిగే అరకు, పాడేరు ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలందించడం చాలా సంతోషంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్యాలయం విజయవాడ తాడిగడపలో ఆరోగ్య రథం వాహనాలను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంధ్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ బస్సులు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

2017లో ఎపిఎండిసి ఆధ్వర్యంలో రూ.17 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మైనింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సౌకర్యాలు అందించేందుకు ముఖ్యమంత్రి >>2




# సంక్రాంతి రద్దీపై అధికారులదే బాధ్యత

## - డిజిపి ఆదేశం

**విజయవాడ,జనవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతికి ప్రయాణికుల అవసరాలరీత్యా నిరంతరం బస్సులు నడిపి ప్రయాణికులను సకాలంలో సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ద్వారకా తిరుమల రావు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో ఆర్టీసీ, రవాణా, పోలీసు శాఖ అధికారులతో సంస్థ ఎండీ ద్వారకా తిరుమల రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీపై సమీక్ష నిర్వహించారు. రద్దీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. బస్టాండ్లలో ప్రయాణికులు నిరీక్షించకుండా వెంటనే అవసరమైన బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఇందుకోసం అవసరమైన చోట్ల ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులను తీసుకోవాలని అధికారులను ద్వారకా తిరుమల రావు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు ఈ క్రమంలో ఫిట్‌నెస్, >>2

సంక్రాంతి కానుకగా

# రూ. 6,700 కోట్ల బకాయిల విడుదలకు సిఎం ఓకే

## ఉద్యోగుల జిపిఎఫ్, సరెండర్ లీవ్, సిపిఎస్ బకాయిల విడుదలకు ఆదేశం

**విజయవాడ, జనవరి 11,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి కానుకగా వివిధ వర్గాలకు చెందిన బిల్లుల బకాయిలు రూ.6,700 కోట్ల విడుదలకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. శనివారం ఉండవల్లిలో ఆర్థిక శాఖపై సిఎం చంద్రబాబు నాయుడు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు మరియు పెండింగ్ బిల్లుల విడుదలపై సిఎం చంద్రబాబు దాదాపు 3 గంటల పాటు సమీక్ష నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు విద్యార్థులు, ఉద్యోగులు, పోలీసులు, చిన్న చిన్న కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు, అమరావతి రైతులకు కౌలు బకాయిలు మొత్తము రూ.6,700 కోట్ల విడుదల చెల్లింపునకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు అన్నారు. ఇందులో ఉద్యోగుల జిపిఎఫ్, సరెండర్ లీవ్, సిపిఎస్ బకాయిలు మొత్తము రూ .1300 కోట్లు విడుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు. జిపిఎఫ్ బకాయిలు రూ.519 కోట్లు, పోలీస్ సరెండర్ లీవ్ బకాయిలు రూ.214 కోట్లు, సిపిఎస్ బకాయిలు రూ.300 కోట్లు, టిడిఎస్ బకాయిలు రూ.265 కోట్లు విడుదల చేస్తున్నామన్నారు. 6.50 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు ఎస్సీ ఎస్టీ స్కాలర్షిప్ బకాయిలు రూ.788 కోట్లు, విద్యుత్ శాఖ రాయితీ బకాయలు రూ.500 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ బకాయిలు రూ .400 కోట్లు, డ్రగ్స్ మరియు మెడిసిన్స్ బకాయిలు రూ .100 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

651 ఎమ్మెస్ఎంఇ లకు మరియు మరో 6000 మంది మైక్రోఎంటర్ప్రెన్యూర్లకు లబ్దిచేకూర్చేవిధంగా రూ. 90 కోట్ల పెండింగ్ బకాయిలను విడుదల చేస్తున్నామన్నారు. అదేవిధంగా అమరావతి రాజధానికి, గన్నవరం ఎయిర్పోర్ట్‌కు భూములు ఇచ్చిన రైతుల కౌలు బకాయిలు రూ .241 కోట్ల చెల్లింపుకు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒకవైపు రూ.10 లక్షల కోట్ల బకాయిలు మరియు వాటిపై ప్రతిరోజూ వడ్డీ చెల్లించడంతో పాటు మరోరూ1.30 వేల కోట్ల బకాయిల >>2



శనివారం పెండింగ్ బకాయిల విడుదలపై ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

# బకాయిల విడుదలకు సిఎం ఓకే

>> ఒత్తిడి ప్రభుత్వంపై ఉందన్నారు. వీటికి తోడు గత ప్రభుత్వం 60: 40 వాటాతో అమలు చేయాల్సిన 94 కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి కేంద్ర వాటాను పొంది రాష్ట్ర వాటాను చెల్లించకపోవడం వల్ల ఆ పథకాలన్నీ నిలిచిపోవడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి రూ .6000 కోట్లను కేంద్రానికి జమ చేసి 73 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించడం జరిగిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు మంచి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశం అనంతరం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. భారీ మొత్తాల్లో బకాయిలు చెల్లింపు ఆయన అంగీకరించడం సంతోషదాయకమన్నారు.

**బకాయిలు విడుదలపై ఎన్జీవో సంఘం హర్షం**

ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన జిపిఎఫ్ మరియు పోలీసుల సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపులకు, దిశిళీ బకాయిలు చెల్లింపులకు ప్రభుత్వం కేటాయింపులు చేయటం, సంక్రాంతి పండుగ ముందు ప్రకటించడం హర్షనియమని ఏపీ ఎన్జీజివో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి ప్రధాన కార్యదర్శి ఏ విద్యాసాగర్ తెలిపారు. విబిబివీ సంఘం ముఖ్యమంత్రిని కలిసి ఈ విషయాలన్నిటినీ పూర్తిగా వివరించిందని, ప్రభుత్వం దీనిపై దృష్టి సారించడం సంతోషదాయకమని, ఇంకా బకాయిలు పెద్ద ఎత్తున ఉన్నందున ప్రభుత్వం వాటిపై కూడా దృష్టి సారించాలని, పిఆర్సి కమిటీ నియామకం, దీతి ల విడుదల తదితర అంశాలపై కూడా ప్రభుత్వం నుంచి త్వరలోనే సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నామని విబిబివీ నాయకులు తెలిపారు. తిశిబిలి। బకాయిలను కూడా విడుదల చేయాలని కోరారు.

## కేబినెట్ ర్యాంక్ ఉన్నవారి జీతభత్యాలు
# పెంపునకు ప్రభుత్వ నిర్ణయం
### వచ్చే నెల నుంచి వారికి రూ. 2 లక్షల జీతం

**అలవెన్స్ ఇతర సౌకర్యాల కోసం మరో రూ. 2.50 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం**

**విజయవాడ,జనవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేబినెట్ హోదా కలిగిన వారికి తీపి కబురు చెప్పింది. కేబినెట్ ర్యాంక్ ఉన్నవారి జీతభత్యాలను పెంచాలని నిర్ణయించింది. వచ్చే నెల నుంచి వారికి ప్రభుత్వం నుంచి రూ. 2 లక్షల జీతం అందనుంది. వేతనంతో పాటు ఆఫీస్ ఫర్నీచర్ ఏర్పాటుకు వన్ టైమ్ గ్రాంట్‌ను కూడా విడుదల చేయనుంది. అలాగే వ్యక్తిగత సహాయ సిబ్బందిని నియమించుకునేందుకు అలవెన్స్ ఇతర సౌకర్యాల కోసం మరో రూ. 2.50 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో కేబినెట్ హోదాలో ఉన్నవారికి నెలకు మొత్తం రూ. 4.50లక్షలు అందనున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల కేబినెట్ ర్యాంక్ ఉన్నవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 10 లక్షల కోట్ల 'గ్రీన్' ఎనర్జీ

>> న్నారు. సొంత గ్రామాలకు వస్తున్న లక్షలమంది ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రయాణికుల రద్దీతో విశాఖ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం సహా పలు నగరాల్లోని బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలోనే పండగకు వచ్చే ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ప్రైవేట్, స్కూళ్లు, కాలేజీల బస్సులను తీసుకోవాలని చంద్రబాబు పేర్కొన్నారు. తద్వారా ప్రయాణికులను ప్రధాన పట్టణాల నుంచి పల్లెలకు పంపే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఆయన అందులో వచ్చిన సూచనపై సమీక్షించి వెంటనే ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.

ఫిట్‌నెస్ ఉన్న బస్సులను ఆర్టీసీ ద్వారా నడిపి ప్రజలకు ప్రయాణ కష్టాలు లేకుండా చూడాలని చంద్రబాబు సూచించారు. తీవ్ర రద్దీగా ఉన్న రూట్లతో ఈ తరహా బస్సులతో కొంత మేర ప్రజలకు సౌకర్యం కల్పించాలని సీఎం అభిప్రాయపడ్డారు. తద్వారా ప్రజలను సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు పంపే ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు సూచనలు చేశారు.

## తిరుపతి తొక్కిసలాట మృతుల కుటుంబాలకు
# నేటి నుండి పరిహారం

**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠద్వార దర్శనం కోసం వచ్చి తిరుపతిలో నాలుగురోజుల క్రిందట జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలకు సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించిన పరిహారాన్ని అందించేందుకు టిటిడి చర్యలు చేపట్టింది. దీనిపై శుక్రవారం సాయంత్రం టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు అత్యవసర సమావేశం జరిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మృతులు విశాఖపట్నం తాటిచెట్లపాలెంకు చెందిన లావణ్యస్వాతి(37), కంచర్లపాలెంకు చెందిన శాంతి(35), మద్దెలపాలెంకుచెందిన రజని(47), నరసరావుపేట రామచంద్రాపురంకు చెందిన బాబునాయుడు(51), తమిళనాడు సేలంజిల్లా మేదారి గ్రామంకు చెందిన మల్లిగ(50), పొల్లాచ్చికి చెందిన నిర్మల(45) కుటుంబసభ్యులకుఈ పరిహారం ఆదివారం అందజేయనున్నారు. ఇందుకు ఛైర్మన్ నాయుడు బోర్డు సభ్యులు విశాఖ,నర్సీపట్నంకెళ్లే బృందంలో జ్యోతులనెహ్రూ, జంగా కృష్ణమూర్తి, పనబాక లక్ష్మి, జానకీదేవి, మహేందర్‌రెడ్డి, ఎంఎస్‌రాజు,భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు. తమిళనాడు.కేరళకు వెళ్ళి మృతుల కుటుంబాలకు పరిహారం అందించే కమిటీలో సభ్యులు శ్రీరామ మూర్తి, కృష్ణమూర్తి వైద్యనాదన్, నరేశ్‌కుమార్, శాంతారాం,సుచిత్ర ఎల్లా ఉన్నారు. వీరు ఆయా ప్రాంతాల్లోని మృతుల కుటుంబాలను సందర్శించి, స్థానిక ఎంఎల్‌ఎలతో కలసి ఒక్కొక్కరికి 25లక్షల రూపాయలు చెక్కులను అందిస్తారు. ఈ కమిటీలు టిటిడి విద్యాసంస్థల్లో ఉచిత విద్యను,ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం కల్పించేందుకు కూడా నివేదికలు తయారుచేస్తారు.

# గిరిజనుల కోసం ప్రత్యేక ఆరోగ్య రథాలు

>> నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఆరోగ్య రథాలను తీసుకువచ్చామన్నారు. ఇప్పటికే ఏపిఎండీసీ ద్వారా ఆరోగ్య సేవలు, విద్యాలయాలు, ఇతర వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పుడు కోటి రూపాయల వ్యయంతో పూర్తి సాంకేతికత కలిగిన రెండు వాహనాలను ప్రజల ముందుకు తీసుకొచ్చామన్నారు. వీటి ద్వారా ఆరోగ్య సేవలతో పాటు హెల్త్ చెకప్, కార్డియో, రక్త పరీక్షలు, ఈసీజీ తది తర సేవలు అందించటం జరుగుతుందన్నారు. 201924 మధ్యకాలంలో రాష్ట్రంలో కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ ను నాశనం చేసారన్నారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులను దోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ కనీసం ప్రజల ఆరోగ్యంపై పెట్టిన దాఖలాలు లేకుండా పోయాయన్నారు. భవిష్యత్తులో ఎక్కడ అవసరం ఉన్నా ఈ సేవలను కొనసాగిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. తొలుత ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్ కుమార్ తో కలిసి రెండు ఆరోగ్య రథం వాహనాలను జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. అనంతరం బస్సులో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సేవ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని మరోసారి నిరూపించుకుంది.



శనివారం స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఛైర్మన్ బిఆర్ నాయుడు

# చెక్కులు అందించిన టిటిడి ఛైర్మన్

>> యలు పరిహారం అందించారు. అలాగే గాయాలకు గురై స్విమ్స్‌లో ఉన్న అన్నమయ్యజిల్లా రామసముద్రం మండలంకు చెందిన కె.నరసమ్మ, పి.రఘు, కె.గణేష్, పి.వెంకటేశ్, చిన్నఅప్పయ్య ఉన్నారు. వీరికి 2లక్షల రూపాయలు పరిహారం చెక్కుల రూపంలో అందజేశారు. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు నియమితులైన కమిటీ సభ్యుల రవాణా ఇతర ఖర్చులను స్వయంగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సొంత నిధులు నుండి చెల్లించనున్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు షాజహాన్(మదనపల్లి), పులివర్తినాని(చంద్రగిరి), బొజ్జలసుధీర్‌రెడ్డి(శ్రీకాళహస్తి),గాలిభానుప్రకాశ్(నగరి),జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్ ,బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భూవివాదం పరిష్కరిస్తాం

>> రాని భూముల్లో ప్రాజెక్టు నిర్మిస్తున్నారన్నారు. చంద్రబాబు ఐటీ తరువాత గ్రీన్ ఎనర్జీపై దృష్టి పెట్టారు.. అందులో భాగంగా పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. దేశానికి ప్రతిష్టాత్మకమైనది రెన్యూవల్ ఎనర్జీ ప్రాజెక్టు అని అభిప్రాయపడ్డారు. దేశానికి రెండున్నర లక్షల పెట్టుబడులు తీసుకురాగలిగారు.. 365 ఎకరాలు కేంద్రం నుంచి అటవీ భూమి కొన్నారు, అందుకు కంపెనీ 365 ఎకరాల భూమి నెల్లూరు జిల్లాలో ఇచ్చారని వెల్లడించారు. 40 ఎకరాల భూమి ఫారెస్టు, రెవెన్యూ మధ్య వివాదం ఉంది.. దీన్ని పరిశీలించడానికి వచ్చానని చెప్పారు. ఆఫీసులో కూర్చొని సమీక్షించడానికి, ఫీల్డ్‌కి వెళ్లి సమీక్షించడానికి తేడా ఉందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఇది భారీ ప్రాజెక్టు.. ఇందులో చిన్న చిన్న వయోలేషన్స్ ఉంటే కరెక్షన్ చేయాలని అధికారులకు సూచించారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే క్యాబినెట్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. పర్యాటక ప్రాంతంగా, ఎడ్యుకేషన్ టూర్ ప్లేస్‌గా అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ కింద యువతకు ఉపాధి కల్పించే పనులు, రైతులకు ప్రయోజనాలు కల్పించే పనులు యాజమాన్యం చేయాలని తెలిపారు. 43 లక్షల ఇళ్లకు నెలకు 200 యూనిట్లు ఇవ్వగలిగేంత విద్యుత్ ఇక్కడ ఉత్పత్తి చేయవచ్చని పేర్కొన్నారు. కడప, చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఆక్రమణకు గురవుతున్నాయని.. అటవీశాఖ భూముల ఆక్రమణలపై రెవెన్యూ, అటవీ భూముల వివాదాలపై సమీక్ష చేస్తానని చెప్పారు. కర్నూలు అద్భుతమైన నగరం కావాలని తెలిపారు. అలాగే.. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటిస్తానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఉమ్మడి జిల్లా నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# వైకుంఠద్వార దర్శనంలో సినీనటి నందినిరాయ్

**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** సినీనటి,మోడలిస్ట్ నందినిరాయ్ శనివారం ఉదయం వైకుంఠద్వార దర్శనంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయం వద్ద టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. కాగా ఆమె గురువారంరోజే మోకాళ్లపై నడకమార్గంలో తిరుమలకు చేరుకున్నారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో దేవదేవుడి ఆశీస్సులందుకున్నారు.

# సాగుతున్న తొక్కిసలాట రగడ!

**తిరుపతి, జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు రమ్మని లక్షలాదిమంది భక్తులను పిలిచి తొక్కిసలాట ఘటనకు కారణాలపై విశ్లేషణ మొదలైంది. భారీ సంఖ్యలో 1.20లక్షల వరకు టోకెన్లు ఒకేరోజు 8కేంద్రాల్లో 90కౌంటర్ల ద్వారా జారీచేస్తామని ముందుగానే టిటిడి పెద్ద ఎత్తున ప్రచార ఆర్భాటం చేయడం, 16గంటలు ముందుగానే తిరుపతికి చేరుకున్న తెలుగురాష్ట్రాలు, తమిళనాడు,కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా ప్రాంతాల భక్తులకు అవసరమైన మేరకు కొన్ని కేంద్రాల్లో సరైన ఏర్పాట్లుపై, సౌకర్యాల కల్పనలో టిటిడి,పోలీసు,జిల్లాయంత్రాంగం ఘోరవైఫల్యం చెంది ఆరుగురు ప్రాణాలు బలిః బాధ్యులని తరలివచ్చిన భక్తులు నోటిమాటతో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణం బాధ్యులైన అధికారులను బదిలీ చేయడం సస్పెన్షన్‌కు గురిచేయడం జరిగింది. అయినా ఈ ఘటనపై ప్రజాసంఘాలు,కొందరు నేతలు, వైసిపి నాయకులు పెద్ద రగడ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే తొక్కిసలాట ఘటనపై నారాయణవనం, బాలాయపల్లి తాశీల్దార్లు ఫిర్యాదు మేరకు పోలీసు కేసులు నమోదైన విషయం విదితమే. ఈ కేసులపై సమగ్ర విచారణచేస్తే అందే నివేదికల ఆధారంగా ఎవరిని అరెస్టు చేస్తారనే విమర్శలు వైసిపి,ప్రజాసంఘాల నుండి పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ఢిల్లీకి ఫిర్యాదులు వెళ్లాయి. టిటిడి నిర్లక్ష్యం కారణంగానే తిరుపతిలో ఈ ఘటన జరిగిందని టిటిడి ఛైర్మన్, ఇఒపై జాతీయ మానవ హక్కుల సంఘానికి .కేంద్ర హోంశాఖకు ఫిర్యాదులు వెళ్లాయి. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలతో రాష్ట్రపతికి లేఖరాసినట్లు వంగవీటి నరేంద్ర అనే వ్యక్తి వెల్లడించడం ఇప్పుడు టిటిడి వర్గాల్లో కుదిపేస్తోంది. సిఎం కూడా బాధ్యుడని ఆరోపించడం ఎంతవరకు సమంజనం కానీ ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు వెళ్లడం, హైకోర్టులో పిల్ వేయడం కూడా ఎక్కడకు దారితీస్తుందనేది కాలం నిర్ణయించనుంది. ఈ ఘటనపై ఐదురోజుల్లో న్యాయవిచారణ జరిపించి, తక్షణమే చర్యలు తీసుకోవాలని, 20మందిని ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఈ ఘటనలో జిల్లా ఎస్పీ, టిటిడి జెఇఒ, సివిఎస్ఒలను బదిలీ చేయడం, ఓ డిఎస్పీని, గోశాల డైరెక్టర్‌ను సస్పెన్షన్ చేయడం జరిగింది.

**వీడని అనుమానాలేన్నో!:**

వైకుంఠద్వార దర్శనాలకు తిరుపతిలోని 8ప్రాంతాల్లో సర్వదర్శన టోకెన్లు

## ఆరుగురు మృతిపై వీడని అనుమానాలెన్నో?
### రెండు కేసులు నమోదుతో తదుపరి యాక్షన్ ఏమిటో!?

జారీచేస్తారని టిటిడి పెద్ద ఎత్తున లక్షలాదిరూపాయలు వ్యయంతో ప్రకటనలు చేయడం, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం జరిగింది. ఇందులో తిరుపతిలో శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్,ఇందిరా మైదానం, సత్యనారాయణపురం, ఎంఆర్‌పల్లి, బైరాగిపట్టెడ,రామచంద్రపుష్కరిణిలో 90కేంద్రాలు వరకు ఏర్పాటుచేసింది. జనవరి 9వతేదీ ఉదయం 5గంటలకు టోకెన్లుజారీ ప్రారంభిస్తామని ప్రకటనల్లో టిటిడి స్పష్టంగా పేర్కొంది. అలాంటపుడు ముందుగానే టోకెన్లు జారీచేయాలని టిటిడి అధికారులు ఇచ్చిన ఆదేశాల వెనుక ఏదేని కుట్రకోణం ఉందా అనే అనుమానాలు ఇప్పుడు తిరుపతి వాసుల్లోనే వ్యక్తమవుతున్నాయి. పైగా 2వేలమంది భక్తులకు సరిపడే బైరాగిపట్టెడలోని రామానాయుడు పాఠశాల సమీపంలో 2,500మందిని నిరీక్షింపజేయడం, గేట్లు ఉన్నఫళంగా తెరవడం తొక్కిసలాటకు కారణాలుగా గుర్తించారు. ఇక శ్రీనివాసంలో తొక్కిసలాటకు సరైన క్యూలైన్ల నియంత్రణ లేకపోవడం కూడా భద్రతవైఫల్యాలు స్పష్టంచేశాయి. పైగా కర్నాటక, తమిళనాడు, కేరళ, తెలుగు రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు తిరుపతి ప్రధాన ఆర్టీసి బస్టాండు సమీపంలోని శ్రీనివాసం, రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉండే విష్ణునివాసం, అలిపిరి కేంద్రానికి దగ్గరలో భూదేవికాంప్లెక్స్‌లు ఉన్నాయి. మిగిలిన ఐదు కేంద్రాలు కూడా స్థానికులకు (తిరుపతి,తిరుపతి రూరల్, చంద్రగిరి ప్రాంతాల) అందుబాటులో ఉంటాయి. మరీ ఇతర రాష్ట్రాలనుండి అంతపెద్దసంఖ్యలో భక్తులు అక్కడే గుమికూడటం వెనుక ఏదేని కుట్రకోణం ఉందా అనే కోణంలో ఇప్పుడు తిరుపతివాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పైగా తిరుపతివంటి యాత్రాస్థలం, పుణ్యక్షేత్రం,నిత్యం విఐపిల తాకిడితో రద్దీగాఉండే చోట పోలీసులకు ఎంతో అనుభవం, అవగాహన ఉండాలి. మరీ టిటిడి చరిత్రలోనే ఇలా ఎన్నడూ జరగని విషాద ఘటన ఈఏడాది అదీ బైరాగిపట్టెడ, శ్రీనివాసంప్రాంతాల్లోని కౌంటర్ల వద్ద చోటుచేసుకోవడం మాత్రం అనుమానాలెన్నో లేకపోలేదనేది తిరుపతివాసుల వాదన.

# కోళ్ల చుట్టూ కోట్లు!

>> కోడిపందాలు నడుస్తున్నాయి.జనవరి 10 నుండి జనవరి 18వ తేది వరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రాజోలు,అమలాపురం,రాజమండ్రి వరకు ఎక్కడ వసతి గృహాలు ఖాళీలేవంటే పరిస్థితి ఊహించవచ్చు.మధ్యం వ్యాపారం ఎంత జోరుగా సాగుతుందో కోడి పందాలలో నగదు కూడా అంత జోరుగా చేతులు మారుతుంది.పారిశ్రామిక వేత్తలు,ఐటి నిపుణులు, రియల్‌టర్లు, బడా రాజకీయ ప్రముఖులు బెంగళూరు, హైదరాబాద్, ముంబాయి, పూణె, చెన్నై తదితర ప్రధాన నగరాల నుండి ఇప్పటికే ఈ ప్రాంతానికి చేరుకున్నారు. ఎక్కడ పెద్దపెద్ద బరులు వేస్తున్నారు దాని వెనుకనున్న నాయకులు ఎవరు, ఏ బరిలో ఏ జాతి కోడి ఎక్కువుగా పందెం కొడుతుంది వంటి సమాచారాన్ని వేగుల ద్వారా సేకరిస్తున్నారు. బరుల వరకు నిర్వాహకులు పెద్దాయనను పట్టుకుని శెటిల్‌మెంట్లు చేసుకుని మీకిది మాకిది అనే పద్దతిలో వ్యవహారాన్ని నడుపుతున్నారు. డిపార్టుమెంట్, మీడియా, పెద్దలు అనే పీఠికల క్రింద ఖర్చులను కూడా లక్షల్లో చూపిస్తున్నారు.మరోవైపు కలెక్టర్లు,ఎస్పీలు పందాలు ఇచ్చేంత వరకు కోడి పందాలు ఎక్కడ ఎవరు నిర్వహించిన కటకటాలేనని ప్రచారాన్ని ఊదరగొడుతున్నారు. మరోవైపు పందాలకు సిద్ధమవుతున్నావారు తమ వద్దనున్న కోడి జాతులను యూట్యూబ్ ద్వారా, వాట్సాప్‌ల ద్వారా భారీ ప్రచారానికి దిగుతున్నారు.డెల్టాలలో పుంజులను బాగామేపి పందానికి సిద్దపర్చే వ్యాపారులు దాదాపు రెండువందలు పైగా ఉన్నారు.నెమలి,డేగా,పచ్చ వంటి రకాలను వివరిస్తూ ఫోటోలు పెడుతున్నారు. కొంతమంది కొబ్బరి తోటల్లో మోడల్ బరులు తయారుచేసి పందెం కోళ్లను సిద్దపర్చి ట్రైలర్ వీడియోలనుకూడా విడుదల చేస్తున్నారు. ప్రభుత్వపరంగా నిశబ్ద చట్ట భోగి నుండి కనుమ వరకు కనీసం ఐదు రోజులు మంజూరుచేసేలా చూడాలని పందాలను నిర్వహించేవారితో పాటు ముఖ్య నేతలు కూడా ప్రభుత్వ పెద్దల వద్ద అర్జీపెట్టుకున్నట్లు సమాచారం.గతంలో కోడిపందాలను ఎట్టి పరిస్థితిలోను నిర్వహించనీయకుండా కఠిన చర్యలు తీసుకునేలా రంగం సిద్ధంచేసిన తీరా పండుగ రోజు వచ్చేసరికి కోడే గెలిచింది పందెగాళ్లదే పైచేయి అనే టాక్ కూడా రాకోపోలేదు.అందుకే కోడి పందాలు ఎట్టి పరిస్థితులోను గోదావరి జిల్లాల్లో గన్‌షాట్‌గా జరుగుతాయనే నమ్మకం నిర్వాహకులలో బలంగా నాటుకుపోయింది. అందుకే ముఖ్యమైన బరులు కోటి అరకోటి పైనే పలుకుతున్నాయి.బరి చుట్టూ ముగ్గువేసే ముందే బరిబయట ఎవరెవరిని ముగ్గులోకి తేవాలి.ఎవరిని డబ్బు మబ్బులో పెట్టాలి అనే విషయాలను గ్రూపు మీటింగ్‌లలో చర్చిస్తున్నారు.కూటమి సర్కారు కూడా కోడి కూతకు సై అనక తప్పదని ఇందుకు ఇచ్చుకోవల్సింది పుచ్చుకోవల్సింది తప్ప అడ్డుకోవల్సింది ఏమి లేదనేది జగమెరిగిన సత్యం. డెల్టాలో కోడి పందాలు ఆడేందుకు ఇప్పటికే కోళ్లను బాదం,జీడిపప్పు తదితర డ్రై ఫ్రూట్స్‌తో ఏపుగా మేపి ఉంచారు.అదృష్టం ఉన్నది గూటికి పందెం కొట్టలేనిది పకోడికి వెళ్లక తప్పదు. ఒక్కో పుంజు జాతి రకాన్ని బట్టి లక్ష నుండి రెండు లక్షల వరకు పలుకుతున్నాయి.

అయితే పందెం కొట్టే పుంజులను కొంతమంది ఆయా బరులను బట్టి పందానికి ఇంత అనే పద్దతిలో గంటల మీద అద్దెకు కూడా ఇస్తున్నారు. ఇటీవల గోదావరి జిల్లాలలో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో పందెం కోళ్ల బరులపై రైడ్ చేయడంతో వందలాది కోళ్లు కూడా దొరికిపోవడం అవి కోర్టుకు హాజరపరచడం జరిగింది.అలాగే ముత్యాలపల్లి ప్రాంతంలో వందల సంఖ్యలో కోళ్ళు ఉన్న స్థావరంపై అగ్నికీలాలు వ్యాపించి మాడిపోయాయి.ఇలా పందెం కోళ్ళకు కూడా తీవ్ర డిమాండ్ పెరిగింది. దీంతో వ్యాపారులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.సంక్రాంతి పేరుతో సాంప్రదాయం ముసుగులో జరిగే ఈ కోడిపందాలు వందల కుటుంబాల్లో కన్నీళ్ళు కొన్ని కుటుంబాల్లో కాసులు కురిపిస్తాయి.ఈ క్రీడలో రక్తం చిందించి కన్ను మూసేది,కాలం తీరేది బరిలో వీరోచితంగా పోరాడే కోడి పుంజే!

# రాంబిల్లిలో సోలార్ ప్యానల్స్ తయారీ ప్రాజెక్టు



**విశాఖపట్నం, జనవరి 11, ప్రభాతవార్త:** అనకాపల్లి జిల్లాలో భారీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రముఖ కంపెనీలు క్యు కడుతున్నాయి. ఇప్పటికే నక్కపల్లి, పూడిమడక తదితర ప్రాంతాలలో లక్ష 85 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టులకు ఇటీవల ప్రధాని శంకుస్థాపన చేసిన సంగతి కూడా తెలిసిందే. ఈ క్రమంలోనే మరో భారీ పరిశ్రమ ఎలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధమవుతోంది. రాంబిల్లిలో సోలార్ పవర్ ప్యానల్స్, బ్యాటరీల తయారీ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి రిలయన్స్ కంపెనీ ఆసక్తి చూపింది. సుమారు 1500 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. వినేపద్యంలో రిలయన్స్ అధినేత అనిల్ అంబానీ శనివారం రాంబిల్లి ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అని లంబానికి ఘనంగా స్వాగతం పలికి పరిశ్రమ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. చానల్స్ తయారీ తర్వాత వాటిని వివిధ ప్రాంతాలకు తరలించడానికి అవసరమైన రవాణా సౌకర్యాలు, నీటి లభ్యత తదితర అంశాల గురించి అనిల్ అంబానీ సుదర్శన్ విజయ్ కుమార్ ని అడిగి తెలుసుకున్నారు.



శనివారం తిరుపతిలో సప్తగిరుల ప్రదక్షిణ చేపట్టిన జస్టిస్ కృష్ణమోహన్, డా.గజల్ శ్రీనివాస్, నేపాల్ స్వామీజి రామకృష్ణ స్వామి తదితరులు

# సప్తగిరుల ప్రదక్షిణ గొప్పస్ఫూర్తిదాయకం
### ఒక చరిత్రాత్మక ఆధ్యాత్మిక కార్యక్రమం: జస్టిస్ కృష్ణమోహన్

**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలసప్తగిరుల ప్రదక్షిణ గొప్ప భక్తిస్ఫూర్తిదాయక కార్యక్రమమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అభిప్రాయపడ్డారు. గోవింద భక్తుల ఆధ్వర్యంలో తిరుపతి చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తలపెట్టిన 216 కిలోమీటర్ల వ్యాప్తి కలిగినదివ్యమైన 'తిరుమల సప్తగిరిప్రదక్షిణ' వాహనయాత్రను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ మోహన్ శనివారం తిరుపతిలో ప్రారంభించారు. తిరుమల వైభవం, సనాతన ధర్మవికాసం కోసం జనవరి11న శనివారం ఉదయం 6.30గంటలకు అలిపిరి సమీపంలోని భారతీయ విద్యాభవన్ ప్రాంగణం ఈ ప్రదక్షిణ యాత్ర ప్రారంభమైంది. ఈ యాత్ర శ్రీనివాసమంగాపురం, భాకరాపేట, నెమలిగుండ్ల, దేవరకొండ, నందునితండా, కొల్లాపూర్, తాళ్ళపాక, ఊటుకూరు, కపిలేశ్వరస్వామి ఆలయం అలిపిరి మీదుగా భారతీయ విద్యాభవన్ ప్రాంగణానికి సాయంత్రం 6గంటలకు చేరుకుంది. సప్తగిరుల హారతితో ముగిసింది. 'సేవ్‌టెంపుల్స్' భారత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్‌శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యక్షేత్రాలకు నీరాజనం, శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ నిర్వహణ ఉంటాయన్నారు. యాత్రలో భక్తులకు భోజన సదుపాయం, మంచినీటి సదుపాయాలు ఏర్పాటుచేసినట్లు సింహయాజస్వామి తెలిపారు. ఈ సప్తగిరుల ప్రదక్షణ ద్వారా ఆధ్యాత్మికశక్తి పెరుగుతుందని నేపాల్‌నుండి వచ్చిన జగద్గురువు రామకృష్ణస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, జర్ఖండ్, రాజస్థాన్, ఢిల్లీల నుండి వచ్చిన వందలాదిమంది ఆధ్యాత్మిక వేత్తలు,భక్తులు పాల్గొన్నారు.

# బాధ్యత

>> మంచి కండిషన్ ఉన్న బస్సులనే ఇందుకు వినియోగించాలని ద్వారకా తిరుమల రావు ఆదేశించారు. ఆర్టీసీలో ఉన్న అన్ని బస్సులను రోడ్డెక్కించి సిబ్బంది సహకారంతో నిరంతరం బస్సులు నడపాలన్నారు. మరోవైపు రోడ్లు, కూడళ్ల వద్ద ట్రాపిక్ కు అంతరాయం కలగకుండా ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ జాం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీలకు ద్వారకా తిరుమల రావు సూచించారు.

## వారం - వర్జ్యం

తేది : 12-01-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, శుక్లపక్షం,
త్రయోదశి ఉ.6.34, చతుర్దశి తె.5.03
మృగశిర ఉ.11.24
వర్జ్యం : రా.7.31-9.04
దు.ఉ.సా.4.25-5.10
శుభసమయం: ఉ.7.00-8.00,
సా.6.00-6.40
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం** : మానవతా దృక్పథంతో శక్తికి మించి ఒకరికి సహాయం చేస్తారు. కుటుంబసభ్యుల సహాయం అందుతుంది.

**వృషభం** : జీవితం మూసపోసినా విధంగా సాగుతోందని భావిస్తారు. ఋణవత్తిడుల నుండి బయటపడతారు.

**మిథునం:** భూవివాదంలో కుటుంబ సమస్యలు పరిష్కారం కాగలవు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

**కర్కాటకం** : సన్నిహితులు, సోదరులతో ఏర్పడిన విభేదాలు పరిష్కార మవుతాయి. విలువైన వస్తువులు సేకరణ.

**సింహం:** దూరపు బంధువుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వాహనాల విషయంలో మెలకువ అవసరం.

**కన్య** : కుటుంబ, ఆరోగ్య సమస్యలు కొంత ఉపశమిస్తాయి. ఆలోచనలు కార్యరూపం ఇస్తారు.

**తుల** : ముఖ్యమైన పనులు సన్నిహితుల సహకారంతో పూర్తి చేస్తారు. నూతన కార్యక్రమాలు చేపడతారు.

**వృశ్చికం:** గృహం, వాహనాల కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. సోదరుల నుండి ధనలాభం.

**ధనుస్సు:** నూతన ఒప్పందాలు చేసుకోగలుగుతారు. సంతృప్తికరమైన ఫలితాలను సాధించలేకపోతారు.

**మకరం:** ఎదుటివారు మీరు చెప్పేది ఆసాంతం వినకుండా మీ మీద నిందలు వేయడం అసహనానికి గురిచేస్తుంది.

**కుంభం:** ఊహించని సమస్యలు తప్పకపోవచ్చు. కీలక నిర్ణయాలలో ముఖ్యులు సలహాలు పాటిస్తారు.

**మీనం** : వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

## రాష్ట్ర మంతటా వడ్డె ఓబన్న జయంతి: సీఎం చంద్రబాబు

**విజయవాడ, జనవరి11,ప్రభాతవార్త ప్రతినిధి:** సచివాలయంలో శనివారం వడ్డే ఓబన్న జయంతి ఘనంగా నిర్వహించారు. ఓబన్న చిత్రప టానికి చంద్రబాబు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి వడ్డే ఓబన్న సన్నిహిత తుడుగా ఉన్నారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తు న్నామని తెలిపారు. రేనాటి వీరుడు ఓబన్న చరిత్ర నేటితరాలకు తెలపాలని అన్నారు. బ్రిటీష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలుగువారి ఆత్మగౌరవం నిలపడం కోసం వీరో చితంగా ఓబన్న పోరాడారని సీఎం చంద్రబాబు పేర్కొ న్నారు. నల్లమల కేంద్రంగా గెరిల్లా పద్ధతుల్లో బ్రిటీష్ వారిపై ఆయన పోరాటం చేశారు. కర్నూ లు శివారులోని జగన్నాథ కొండపై పట్టుబడి 39 ఏళ్లకే వడ్డె ఓబన్న అమరత్వం పొందారు.

# పై స్థాయిల్లో ఉన్నవారు మంచిని పాటిస్తే మిగిలిన వారికి అది ప్రేరణ

### నేడు పీ4 కాన్సెప్ట్ పేపర్ విడుదల: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి11,ప్రభాతవార్తప్రతినిధి:** సమాజంలో పై స్థాయిలో ఉన్నవారు మంచిని పాటిస్తే, మిగిలిన వారికి అది ప్రేరణగా ఉం టుందని సీఎం చంద్రబాబు అన్నారు. సం క్రాంతి ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు కోరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మీడియాతో ఇష్టా గోష్టి నిర్వహించారు. తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఊరు వెళ్లి నలుగురితో కలవటం అలవాటు చేసుకోవాలని అన్నారు. తాను అందుకే మా ఊరికి ప్రతీ సంక్రాంతికి వెళ్తున్నా అని చెప్పారు. తాను మా ఊరు వెళ్లే సంప్రదాయానికి తన భార్య భువనేశ్వరినే కారణమని గుర్తుచేశారు. పాతికేళ్ల క్రితం ఆమె పట్టుబట్టి మొదలు పెట్టిన ఈ సంప్రదాయాన్ని క్రమ ం తప్పకుండా పాటిస్తున్నామని చెప్పారు. మానవ సంబంధాలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో ఒకచోట అంతా కలవటం, మాట్లాడు కోవడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ విధానం ప్రోత్సహించటానికే పీ4 కాన్సెప్ట్ పేపర్‌ను ఆదివారం విడుదల చేస్తామని అన్నారు. దీనిపై అన్నిస్థాయిల్లో చర్చ జరిగాక అమల్లోకి తెస్తామన్నారు. పీ4 విధానం బాగా చేసిన వారికి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తామని తెలిపారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి సంక్రాంతి రద్దీ ఎక్కువగా ఉందన్నారు.ప్రభుత్వ పరంగానూ హ్యాపీ సండే లాంటి కార్యక్రమాలు ఈ సారి గ్రామ స్థాయిల్లోనూ ప్రోత్సహిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ప్రజలను ఇబ్బంది పెట్టేలా మోడీ పాలన

### పిసిసి అధ్యక్షురాలు షర్మిల

**విజయవాడ,జనవరి11.ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం ప్రజలు, దళితులు, రాజ్యాంగాన్ని అవమానం, నాశనం చేసేలా రకరకాలుగా ప్రయత్నాలు చేస్తోందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు.



ఆమె ప్రధాని మోదీ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ ప్రజలను ఇబ్బంది పెట్టేలా పాలన సాగిస్తుం దన్నారు. ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బీజేపీకే సపోర్టు చేస్తుందన్నారు షర్మిల. బీజేపీ పార్టీ చంద్రబాబు, జగన్ పవన్ చేతుల్లో ఉంద న్నారు. బీజేపీ ఇంత రాక్షస పాలన చేస్తున్నా ఈ మూడు పార్టీలు వారికే మద్దతు ఇవ్వడాన్ని మండి పడ్డారు. విజయవాడలో ఏపీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనికి టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీ తప్పితేమిగతా పార్టీల నేతలంతా హాజర య్యారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి షర్మిల మాట్లాడారు. జై బాపూజీ, జై భీమ్.. జై సంవిధాన్ పేరిట కాంగ్రెస్ పార్టీ కొత్త క్యాంపెయిన్ మొదలుపెట్టిందన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ అందరి మద్దతు కూడగట్టి ప్రెసి డెంట్‌కు తీర్మానం పంపాలని నిర్ణయిం చిందన్నారు. బీజేపీ కచ్చితంగా క్షమాపణలు చెప్పే విధంగా ఒక రిజెల్యూషన్ తీసుకురావాలని నిర్ణయించిందన్నారు.

# రేనాటి యుద్ధవీరుడు ఓబన్న

### ఘనంగా నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

### ఆర్టీసీ హౌస్‌లో ఓబన్న జయంతి

**సచివాలయం, జనవరి 11 ప్రభాతవార్త:** ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలోని ఆర్టీసీ హౌస్‌లో రేనాటి యుద్ధ వీరుడు వడ్డే ఓబన్న 218వ జయంతిని సంస్థ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం మాట్లాడుతూ రేనాటి యుద్ధ వీరుడు శ్రీ ఓబన్న గొప్పతనం అందరూ తెలుసుకో వాలన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా బ్రిటీషు వారి పాలనకు ఎదురు తిరిగి శ్రీ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ముఖ్య అనుచరుడుగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. యుద్ధ వీరుని చరిత్ర ఈ సందర్భంగా గుర్తు చేసుకొని నివాళులు అర్పించడం మన స్వాతంత్ర్య వీరులకు మనమిచ్చే గౌరవంగా భావించాలన్నారు. డిప్యూటీ సిపిఎం (హెచ్‌ఆర్‌డి) కుమారి సాంబ్రాజ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ ఆఫీసర్ మధు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ మధు, పిఒ (హెచ్‌ఆర్‌డి) మాణిక్యం, ఆర్టీసీఉన్నతాధికారులు, హెచ్‌ఓడిలు, సూపర్ వైజర్లు,వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొని ఓబన్న చిత్ర పటానికిపూలమాలలువేసి నివాళులు అర్పించారు.

# పల్లెల్లో కానరాని సంక్రాంతి సంబరాలు

### కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలు

### వ్యసాయపనుల్లో రైతులు



**శ్రీకాళహస్తి, జనవరి 11 ప్రభాతవార్త:** తెలుగువారి పెద్దపండుగ సంక్రాంతి శోభ కనుమరుగవు తోంది. ఈ యేడాది సమృద్ధిగా వర్షాలు కురిసినా రెండు నెలలు ముసురుతో రైతులకు వ్యధలే మిగిల్చాయి. వ్యవసాయానికి పెట్టుబడుల సమ యంలో ఆదు కునే బ్యాంకులు పాత బకాయిలు చెల్లించలేదని కొత్త అప్పుకు నో అంటున్నారు. పట్టణాల్లో వడ్డీ వ్యాపారస్తుల వద్ద ఏదైనా తాకట్టు పెడదామన్నా ఏమి లేకపోవటంతో పెట్టు బడుల కోసం తల్లడిల్లుతున్నారు. దాంతో సంక్రాంతి సంబరాలు మొక్కుబడిగా మారాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీలు ఎప్పటి కప్పుడు ప్రజల అవసరాల్ని తీర్చటంలో సత్ఫలితాలనిస్తున్నాయి.

**సంప్రదాయాలు కాపాడటానికి ప్రభుత్వం కృషి:** సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలన్న తలంపుతో ఎప్పటి కప్పుడు పాలకులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. పండుగ నాటికి ఇంటినిండా ధాన్యం, కొత్త అల్లుళ్ల సందళ్లు, భోగిపళ్ల చిన్నారుల హడావిడ ఇది ఒక నాటి సందడి. కానీ నేడు పెట్టుబడుల కోసం వెంపర్లాట,ఆర్థిక సంక్షోభం, అప్పులు మది నిండా వెతలతో పండగ సందళ్లు కనుమరుగవు తున్నాయి. ఒకప్పుడు ధాన్యాన్ని ఇంటికి తీసు కువచ్చే ఆనవాయితీ ఉండగా, నేడు దిగుబడులు తగ్గి ఉన్న ధాన్యాన్ని రైతులు కల్లాలో అయిన కాడికి అమ్ముకుంటున్నారు. ఒకనాడు రైతుల గాదెల నిండా ధాన్యం, కళ్లలో ఆనందం ఉండేది. కానీ నేడు ఇవేమీ లేవు. తాము వేసిన పంటలు చేతికి ఎప్పుడు వస్తాయో అని ఎదురుచూస్తు న్నారు. ఇక సంప్రదాయాల సంగతంటారా ఊరంతా సంక్రాంతి..కాబట్టి తాము కూడా చేస్తు న్నామని మాత్రమే చెబుతున్నారు. పిండి వం టల తయారీకి సైతం అధికశాతం మహిళలు మొగ్గు చూపడం లేదు.

**కానరాని డూ డూ బసవన్నలు:** డూడూ బసవన్నల గంగిరెద్దుల గజ్జెలసవ్వడులు, హరిదాసులు హరి నామస్మరణ, ఆశీర్వచనాలు కనుమరుగ య్యాయి. గంగిరెద్దు మేళం నేటి యువతకు అపు రూప దృశ్యంగా మారింది. సంక్రాంతి పట్టిన నేల నుంచి ఇళ్ల ముంగిట ఉండే ముగ్గుల హడావిడి నేడు ముగ్గులపోటీలకు పరి మితమై పోయింది. దీనికి తోడు చాలామంది ఇళ్లముందు కనీసం కొద్దిపాటి ఖాళీస్థలాలు కూడా లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో ముగ్గులు వేసే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఒకప్పుడు గ్రామాల్లో యువకుల సందడి అంతా ఇంతా కాదు. పోటీ ప్రపం చంలో గ్రామీణ యువకులు సైతం అధిక సంఖ్యలో ఉద్యోగాల పేరిట ఇతర ప్రాంతాల్లో ఉండడంతో వారు పండక్కి ఇంటికి రావ డమే ఓపెద్ద పండుగగా భావించే పరిస్థితులొచ్చాయి. సంక్రాంతి సంబరాలంటూ స్వచ్ఛంద సంస్థలు పోటీలు పెట్టడం తప్ప గ్రామాల్లో ఎవరికి వారే యమునాతీరే అన్నచందంగా మారిపో యారు. అయితే ఏడాది ప్రారంభం కాబట్టి తొలి పండుగ రోజుల్లో పట్టణాల్లో ఉద్యోగాలు చేసేవారు పండుగ రోజు తమ స్వంత గ్రామాలకు వచ్చి సంబరాలు చేసుకునే వారు. ఇది మాత్రం ఇప్పటికీ కొనసాగడం సంతోషించదగ్గ విషయం అని చెప్పవచ్చును.

**కోడి పందేల సందడి ఒకప్పటి మాట:** ఒకప్పుడు కోడి పందేలు కేవలం పండుగ మూడు రోజులు మాత్రమే రెండు, మూడు గ్రామాలకు కలిపి ఒకచోట సంప్రదాయబద్ధంగా ఉండేవి. క్రమంగా కోడిపందేలతో పాటు పేకాట కూడా తోడవడంతో ఇవి వ్యసనంగా మారి ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులేర్పడ్డాయి. ప్రస్తుతం వ్యసన పరులు కోడిపందేల నిర్వహణ బరిలో పనిలేకుండా ఎక్కడ అవకాశముంటే అక్కడ నిర్వహిస్తూ తమ పని తాము తాఫీగా చేసుకుంటున్నారు. ఈనే పధ్యంలో సంక్రాంతి పండుగ గత వైభవాన్ని క్రమేపీ కోల్పోతున్నట్లు పలువురు పేర్కొం టున్నారు.

# 13నుంచి మరో విశాఖ వందేభారత్‌కు 16బోగీలు

### సిట్టింగ్ సామర్థ్యం 1,128కి పెంపు

**గుంతకల్లురైల్వే, జనవరి 11,ప్రభాతవార్త:** భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికుల నుంచి లభిస్తున్న ఆదరణ,డిమాండ్‌లను దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నం- సికింద్రాబాద్- విశాఖపట్నంల మధ్య తిరిగే మరో నెంబర్ 20707/08వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులకు ఈ నెల 12నుంచి అదనంగా మరో ఏడు చైర్ కార్ బోగీలతో పాటు మరొక ఎగ్జిక్యూటివ్ క్లాస్ బోగీలతో కలిపి మొత్తం 16బోగీలతో నడుపనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈ రైలు సర్వీసులను ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2024మార్చి 12న విశాఖపట్నం- సికింద్రాబాద్- విశాఖపట్నం మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఈరైలు 7చైర్ కార్ బోగీలతో పాటు మరొక ఎగ్జిక్యూటివ్ క్లాస్ బోగీలను కలిపి మొత్తం 8బోగీలలో 530మంది ప్రయాణికుల సామర్థ్యంతో నడుస్తున్న ఈ రైలు కెపాసిటీని మరో ఎనిమిది బోగీలతో పెంచి 1,128మంది ప్రయాణికులకు అందుబాటులో రానున్నాయి. ఈ రైళ్లకు ఈ నెల 13నుంచి 16బోగీలతో మొత్తం 1,128మంది ప్రయాణికులు రెట్టింపు సామర్థ్యంతో సేవలు అందుబాటులో రానున్నాయి.

# ప్రయాణికులతో కిటకిటలాడుతున్న రైళ్లు, స్టేషన్లు..



**గుంతకల్లు రైల్వే,జనవరి 11,ప్రభాతవార్త:** ప్రస్తుత సంక్రాంతి పండుగ సీజన్‌లో రైల్వేస్టేషన్లు,రైళ్లు ప్రయాణీకుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. అదనపు రద్దీని నియంత్రించడానికి దక్షిణ మధ్య రైల్వే అనేక చర్యలు చేపట్టింది. జనవరి నెలలో 366సంక్రాంతి ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్లలో ఎక్కువ భారం ఫీక్ హాలిడే సీజన్‌లో నడపబడు తున్నాయి. ఈ రైళ్లు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మాత్రమే కాకుండ ఇతర ప్రసిద్ధ గమ్యస్థానాలకు కూడా నడపబడతాయి. ఈ రైలు సర్వీసులలో ఇందులో రిజర్వ్‌డ్ బోగీలు, అన్‌రిజర్వ్‌డ్ వివిధ కోచ్‌ల మిశ్రమ కూర్పుతో అన్ని విభాగాల ప్రయాణికుల సేవలు అందిస్తాయి. నర్సాపూర్, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకా కుళం, మచిలీపట్నం,తిరుపతి, బెర్హంపూర్, జైపూర్, గోరఖ్‌పూర్, కటక్,మదురై,అ రిసికెర మొదలైన ప్రసిద్ధ గమ్యస్థానాలకు ఈ ప్రత్యేక రైళ్లు నడపబడుతున్నాయి. అదనంగా మరికొన్ని ప్రత్యేక రైళ్లు నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, వరంగల్‌కు నడుపబడుతున్నాయి. ఇతర జోనల్ ప్రదేశాలైన షాలిమార్,సంబల్ పూర్, బరోని, విశాఖపట్నం మీదుగా ప్రయాణి స్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ నగరంలోని చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారం భోత్సవాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ స్టేషన్ నుండి నర్సా పూర్, కాకినాడ, శ్రీకాకుళం స్టేషన్ల వైపు 59ప్రత్యేక రైళ్లు నడపబడుతున్నాయి. ఇందులో 16 జనసాధారణ రైళ్లు చర్లపల్లి నుండి విశాఖపట్నం తిరిగి చర్లపల్లి వరకు సాధారణ కోచ్‌లతో ప్రత్యేకంగా నడపబడుతున్నాయి. పండుగ సీజన్‌లో చేపట్టిన ప్రత్యేక చర్యలు టిక్కెట్ల పంపిణీని బలోపేతం చేయడానికి,05 ప్రధాన స్టేషన్లలో అదనపు కౌంటరుల ఏర్పాటు చేయబడ్డాయి. అదనంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉండే అన్ని ప్రధాన స్టేషన్లలో ఎటివిఎం ఫెసిలిటేటర్లను అందుబాటులోకి తీసుకురా వడమైనది. స్టేషన్లలో రద్దీని నిరంతరం పర్యవేక్షించడం కోసం డివిజనల్ కమర్షియల్ కంట్రోల్లో మానిటరింగ్ సెల్లు 24గంటలు పని చేస్తున్నాయి. ముఖ్యంగా రద్దీగా ఉండే రైళ్లు బయలుదేరే సమయాల్లో/రైళ్లు నడిచే సమయాల్లో రద్దీని సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రధాన స్థేషన్లలో అధికారులను నియమించడం జరిగింది. జనరల్ కోచ్‌లలోకి ప్రయాణికులు సజావుగా ప్రవేశిం చడాన్ని నియంత్రించడానికి మరియు రిజర్వ్ చేయబడిన కోచ్‌లలోకి అనధికార ప్రయాణికుల ప్రవేశాన్ని నియంత్రించడానికి అధిక రద్దీ ఉండే రైళ్ల దగ్గర సెక్షన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్/టిక్కెట్ చెకింగ్ సిబ్బంది,ఆర్‌పిఎఫ్ సిబ్బందితో అందుబాటులో ఉంటారు. స్టేషన్లలో ఇతర డిస్‌ప్లే బోర్డులతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు తరచుగా ప్రకటనలు చేయబడుతున్నాయి. నడపబడుతున్న ప్రత్యేక రైళ్ల గురించి ప్రయాణికులకు మార్గనిర్దేశం చేసేందుకు సంబంధిత గమ్యస్థా నాలకు అందుబాటులో ఉన్న రైళ్లకు సంబంధించి ప్రయాణికులకు మార్గనిర్దేశం చేసేందుకు ప్రధాన స్టేషన్లలో ఎంక్వైరీ కమ్ ఫెసిలిటేషన్ కౌంటర్లు నిర్వహించబడుతున్నాయి. రైళ్ల ప్లాట్ ఫారం కేటాయిం పునకు(నామినేషన్‌కు) సంబంధించి ఆపరేటింగ్ విభాగంతో జన సమూహ నిర్వహణ కోసం భద్రతా విభాగంతో సన్నిహిత సమన్వయం నిర్వహించబడుతోంది.

## మనిషిని మేల్కొల్పేదే అసలైన కవిత్వం: సినీగేయ రచయిత రసరాజు

**విజయవాడ,జనవరి11,ప్రభాతవార్తప్రతినిధి:**మనిషిని మేల్కొల్పేదే అసలైన కవినిని సినీ గేయ రచయిత రసరాజు అన్నారు. శనివారం సాయంత్రం విజయవాడ పుస్తకం మహోత్సవం చెరుకూరు రామోజీరావు సాహిత్య వేదికపై నవ మల్లె తీగ మాసపత్రిక నిర్వహణలో సరికొండ నంసింహారాజు రచించిన తల్లడిల్లే తల్లి వేరు పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రసరాజు పుస్తకాన్ని ఆవిష్కరించిన తర్వాత మాట్లాడుతూ కవి ఒక వాక్యానికి జన్మనిచ్చేందుచేందుకు పునర్జన్మనెత్తుతాడన్నారు. పుస్తకాన్ని సమీక్షిస్తూ డాక్టర్ గుమ్మా సాంబశివరావు నరసింహారాజు తన కవిత్వంలో తెలుగు భాషలో కొన్ని కొత్త పద బంధాలను కని పెట్టాడన్నారు. సభాధ్యక్షులు ఘంటా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక కవిత్వంలో సరికొండ ఒక కొత్త వాక్యం అన్నారు. విరసం బాధ్యులు అరసవల్లి కృష్ణ మాట్లా డుతూ నరసింహారాజు తన కవిత్వంతో సమాజంలో ఒక అరుణ పతాకం ఎగరేసారన్నారు. కార్యక్రమంలో పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు,రిటైర్డ్ తహసిల్దార్ కూరపాటి కోటంరాజు, మల్లెతీగ కలిమిశ్రీ పాల్గొన్నారు. సరికొండ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుమల సమాచారం



## వైకుంఠద్వాదశిన శాస్త్రోక్తంగా చక్రస్నానం

### పుణ్యస్నానాలాచరించిన భక్తులు

**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** ధనుర్మాసంలో అత్యంత పవిత్రమైన వైకుంఠద్వాదశి పర్వదినాన శనివారం ఉదయం తిరుమలలో పుష్కరిణిలో చక్రధారుడి చక్రస్నాన మహోత్సవం నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. శ్రీభూవరాహస్వామి ఆలయం ముఖమండపంలో శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపనతిరుమంజనం చేశారు. అనంతరం వివిధ పాశురాలను చిన్న జియ్యర్‌స్వామి పఠించారు.

చక్రస్నాన సమయంలో అర్చకులు కర్పూరహారతులిచ్చారు. శేషాచలంలోని 66కోట్ల తీర్థాలలో స్వామివారి పుష్కరిణి అత్యంత పవిత్రమైనది.ఈ కార్యక్రమంలో చిన్నజీయర్ స్వామి, టిటిడి ఇఒ శ్యామలరావు, బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, ఆల య డిప్యూటీ ఇఒ లోకనాథం,ఆలయ పేష్కార్ రామకృష్ణ ,అర్చకులు పాల్గొన్నారు.

## రెండవరోజూ వైకుంఠద్వాదశిన పరిమితంగానే విఐపిలకు వైకుంఠద్వార దర్శనం

**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాల్లో రెండవరోజు ద్వాదశిన శనివారం ఉదయం పరిమితంగానే ప్రముఖులకు బ్రేక్ దర్శనాలు కల్పించారు. ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా రావడంతో వారితోబాటు మరో ఐదుమందికి వైకుంఠద్వార దర్శనాలు చేయించారు. శనివారం ఉదయం ఏపి హైకోర్టు జడ్జి జస్టీస్ వి.గోపాలకృష్ణారావు, తెలంగాణా హైకోర్టు జడ్జి జస్టీస్ నంద, బిజెపి మాజీ ఎంపి లక్ష్మణ్, ఎంఎల్‌ఎ కన్నబాబు, విశాఖ డిఐజి గోపీనాథ్‌జెట్టీ, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్, విశాఖ జిల్లా ఎస్పీ మురళీకృష్ణ తదితరులు వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కాగా వైకుంఠ ఏకాదశిన తొలిరోజు అర్ధరాత్రివరకు 60,094మంది భక్తులకు దర్శనం చేయించారు. హుండీ ఆదాయం 2.45కోట్లు చేకూరింది. ఇదిలా ఉండగా వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ఆన్‌లైన్‌లో దర్శన టోకెన్లు, ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ టిక్కెట్లు జారీచేయడంతో రోజుకు 70వేలమంది భక్తులు దర్శనం చేసుకునే వెసలుబాటు కలిగింది.



ఇక ఆయా రోజుల్లో దర్శన టిక్కెట్లు, టోకన్లు కలిగిన భక్తులు సమయానికి తిరుమలకు చేరుకుని దర్శనం చేసుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.



## ఆకట్టుకున్న శోభారాజ్ అన్నమయ్య సంకీర్తనలు

**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండపై శనివారం వైకుంఠ ద్వాదశి పర్వదినాన నాదనీరాజనం వేదికపై శ్రీవేం కటేశ్వర స్వామికి ప్రముఖ గాయని డాక్టర్ శోభారాజ్ అన్నమయ్యకీర్తనలు ఆలపించారు. వేలాది మంది భక్తులు ఎంతో భక్తిభావంతో, ఆధ్యా త్మికతతో ఈ కీర్తనలు ఆలకించారు. డాక్టర్ శోభారాజ్ తన శిష్యులతో కలసి ద్వాదశిన రెండు అన్నమయ్య కీర్తనలు స్వామివారి సహస్రదీపాలంకార సేవలో ఆలపించారు.

## ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల, జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతిదేవస్థానమ్ నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లలో ఎస్వీవేదపరిరక్షణ ట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయుల విరాళాల చెక్ అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన సాయి రాఘవేంద్ర నిర్మాణసంస్థ ఛైర్మన్ ఎం.జనార్ధన్ ఈ 10లక్షల రూపాయల చెక్కును టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు.

## తిరుపతి జూపార్కు రోడ్డులో టిటిడి ఉద్యోగిపై చిరుత దాడి

### బాధితుడికి స్విమ్స్‌లో చికిత్స

**తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి-తిరుమలలో విస్తరించిన శేషాచలం అటవీ ప్రాంతంలో చిరుతల సంచారం జోరుగా సాగుతుండటం, తరచూ జనంపై దాడిచేసి తీవ్రంగా గాయపరచడం ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. శనివారం మధ్యాహ్నం టిటిడి ఉద్యోగి మునికుమార్ ద్విచక్రవాహనంపై మధ్యాహ్నం ప్రాంతంలో జూపార్కురోడ్డులో వస్తుండగా ఉన్నట్లుండి చిరుతపులి దాడిచేసింది. అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కాగా బాదితుడు టిటిడి తిరుమలలోని అశ్వనీ ఆస్పత్రిలో సిబ్బంది కావడంతో మెరుగైన వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. చిరుత దాడి ఘటనపై అటవీశాఖ అదికారులు అప్రమత్తమై ఆ పరిసరాల్లో జనానికి హెచ్చరికలు చేశారు. గత కొంతకాలంగా చిరుతపులి తిరుపతి ఎస్వీయూని వర్సిటీ, వేదిక్ వర్సిటీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు.



# మిల్లర్ల చేతిలో నలుగుతున్న 'బియ్యం'!

భాగ్యనగర్ భాస్కర్‌కుమార్

'జాలరి వలలో చేపవునీవే గానుగమరలో చెరుకువు నీవే" శ్రీశ్రీ అన్నట్లు రైసుమిల్లర్ల మరలో ఉభయతెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, మిల్లర్ల ద్వారా వినియోగదారులు నలిగి పోతున్నారు. రైసుమిల్లర్లు "తోకే కుక్కను ఆడించినట్లు" మన పాలకులను ఆడిస్తున్నారు. అన్నపూర్ణ వంటి తెలుగుగడ్డపై ఆకాశాన్ని అంటేలా బియ్యం ధరలు పెరుగుతున్నాయి. ఉభయ తెలుగురాష్ట్రాలలో ధాన్యం దిగుబడి ఏటామూడుకోట్ల మెట్రిక్ టన్నులకుపైగా పెరిగిన బియ్యం ధరలు మార్కెట్‌లో కిలోకు రూ.60కిపైగానే చేరుకొని సామాన్యుడు నోట్లోకి ఐదు వేళ్ల వెళ్లని దుస్థితి నెలకొంది. మిల్లర్లు, నల్లబజారు వ్యాపారులు చేతులు కలిపి ఓవైపు బ్లాక్‌దందాతో బియ్యం కొరత సృష్టిస్తున్నారు. స్థానిక ప్రజల అవసరాలు తీర్చకుండా ప్రభుత్వాలు కూడా బియ్యం ఎగుమతికి అనుమతులు ఇవ్వడంతో అక్రమంగా సక్రమంగా సరిహద్దులు దాటుంటే స్థానిక మార్కెట్‌లో బియ్యంధరలు పెరుగుతున్నాయి. బియ్యం అక్రమరవాణా అడ్డుకొంటున్నామని అడపదడపా బిల్డప్ ఇవ్వడానికి "అరహో సాంబా..! సీజ్ ద షిప్"అంటూ ప్రజలకు వినిపించేలా గట్టిగా అరుస్తారు. ఆ వెనువెంటనే మనోళ్లదే వదిలేండని అంటూ బుల్లిపెట్టతో అధికారుల చెవుల్లోకి చేరవేస్తారు. బ్యాంకు గ్యారెంటీ, బాండు పేపర్లు అంటూ ధాన్యం కేటాయింపుకు ఏవేవో నిబంధనలు పెడుతూ ప్రచార హంగామాచేసి పారదర్శకత ప్రమాణాలు పాటిస్తున్నామనే విన్యాసాలు చేస్తారు. మిల్లర్ల భరతం పడుతున్నారని ఉభయరాష్ట్రాల పాలకులు మభ్యపెడుతారు. మిల్లర్లనుంచి బకాయి ఉన్న ఒక్క గింజా వసూలు చేయకుండానే తోక ముడుస్తారు. కాకినాడ పోర్టులో బియ్యం కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ మంత్రి, ఆయన సతీమణిపై కేసులు నమోదు చేశారు. బియ్యం అక్రమరవాణాపై ఉక్కుపాదం మోపుతారనే సంతోషం ఎక్కువ కాలం నిలువకుండా స్టెల్లా ఎల్-1 పనమానౌకలో గుర్తించిన పిడిఎస్‌బియ్యం అధికారపార్టీ నేతలదే అని తేలడంతో మౌనంగా విశాఖ పోర్టునుంచి వెనక్కి మళ్లారు. ఆంధ్రప్రదేశ్ కాకినాడ పోర్టునుంచి విదేశాలకు అక్రమబియ్యం రవాణా అడ్డుకోవడంలో ప్రభుత్వాలు ఎన్నిమారినా అడ్డుపడటంలేదు. మిల్లర్లను గాడిపెడుదామని భావించిన పాలకులు చివరకు మిల్లర్లదారిలోకి మళ్లుతున్నారు. తెలంగా ణలో మిల్లర్ల అక్రమాలను కట్టడి చేయడానికి పదిశాతం బ్యాంకు గ్యారెంటీ బాండుపేపర్లు అంటూ ఏదోఏదో నిబంధనలు పెట్టారు చివరకు రాజకీయాలు ఇతరత్రా కారణాలతో కేవలం బాండు పేపర్‌తీసుకొనిమిల్లులకు ధాన్యం కేటా యించారు. తెలంగాణ వ్యాప్తంగా రైసుమిల్లు యజమానులు ధాన్యంతో నిర్లజ్జగా సర్కారుధాన్యంతో దందా చేస్తున్నారు. తెలంగాణ పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్



కుమార్‌రెడ్డి కస్టమ్‌మిల్లింగ్ అక్రమాలను అరికట్టడానికి ఎన్ని విధాలుగా ప్రయత్నించినా క్షేత్రస్థాయి అధికారులు, రైసుమిల్లర్లు పాల కులను బురిడి కొట్టిస్తున్నారు. నల్లబజారులోకి వచ్చి ప్రభుత్వం మాపై చర్యలుతీసుకొనే దమ్ముఉందా అనే చులకన భావంతో రైసుమిల్లర్లు రెచ్చిపోతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మిరాసిపల్లి గుట్టల్లో ధాన్యం అక్రమంగా నిల్వచేసిన డంపు సంఘటన మరవక ముందే నిజామాబాద్ జిల్లాలో హరిత ఆగ్రోస్ మిల్లుకు కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టించిన వైనం వెలుగులోకి వచ్చింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిజామాబాద్ నగరంలోని నాగారంలోని హరిత అగ్రోస్‌మిల్లును తనిఖీ చేసి సిఎంఆర్ నిల్వలు పరిశీలించగా సుమారు ఒకకోటి 85లక్ష విలువగల ధాన్యం గిడ్డంగిలో లేకపోవడంతో డిఎం సివిల్‌సప్లయ్ కార్పొరేషన్‌కు కేసు నమోదు చేయాలని డిఎస్‌వో అర్వింద్‌రెడ్డి సిఫార్సు చేశారు. నిజామాబాద్ జిల్లాలో రేషన్‌బియ్యం రీసైక్లింగ్ చేసివ్యాపారులు అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదుల చేయడంతో నాగారంలోని హరిత అగ్రోస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. 2023-24 యాసంగి వడ్లు ఈ మిల్లుకు కేటాయించినా అక్కడ అవిలేవు. ఈనెల 25తారీఖులోగా సిఎంఆర్ బియ్యం డిఫాల్టు మిల్లులు ఇవ్వాల్సి ఉంది. గత నెల బోధన్‌లో కూడా న్యూభారత్ రైస్‌మిల్లు కూడా దాడులుచేసి ధాన్యంలేకపోవడంతో డిఎస్‌వో అర్వింద్‌రెడ్డి కేసులు పెట్టారు. రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపుకు బ్యాంకు గ్యారెంటీలు, మిల్లుసామర్థ్యాలు వంటి ప్రమాణాలు త్రోసిరాజని కాసుల కక్కుర్తితో ధాన్యం మిల్లులకు కేటాయించడంతో దర్జాగా మిల్లర్లు నల్లబజారుకు తరలిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలలో ఒక మిల్లుపేరుపై ధాన్యం తీసుకొని మరో మిల్లుకు తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వానాకాలం వడ్లు కేటాయించని మిల్లులకు డబుల్‌షిఫ్టింగ్ పేరిటవడ్లు దొడ్డిదారిన కేటాయింపులు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఐకెపి కొనుగోలు కేంద్రాలలో రైతుల నుంచి సేకరించిన ధాన్యం మిల్లులకు కేటాయిస్తుంది. మిల్లుకు కేటాయించి ధాన్యం మిల్లుల సమీపంలో గోదాముల్లో భద్ర పరుచుకోవాలి. కోట్లరూపాయల విలువ కలిగిన ధాన్యం కేటాయించిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ కూడా అధికారులు తనిఖీలు నిర్వహించడంలేదు. మిల్లర్లకు ధాన్యం పక్కదారి పట్టించేందుకు ఈఅవకాశం మిల్లర్లు వినియోగించుకొంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం మిరాసిపల్లిలో గుట్టమధ్య నిల్వచేసిన సిఎంఆర్ ధాన్యండంపును సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం డిసెంబరు 21న పట్టుకొని నలబజారుకు తరలించే కుట్రను భగ్నంచేశారు. అక్రమంగా దాచిన ధాన్యం డంపు విలువ రూ.20కోట్లపైనే ఉంటుందని అధికారులు అంచనావేశారు. 2022-23 ఖరీఫ్, రబీ సీజన్‌ల ధాన్యం మిరాసిపల్లిలోని ఇషాన్ ట్రేడర్స్ మిల్లుకు పౌరసరఫ రాలశాఖ 4.72లక్షలబస్తాల ధాన్యంకేటాయించింది. మిల్లు యాజమాన్యం కొంతమేరకు ధాన్యం మర ఆడించి పౌరసర ఫరాలశాఖ అప్పగించింది. ఇంకా 2,52,162బస్తాల ధాన్యం మరఆడించి ఇవ్వాల్సి ఉండగా వాటిని గట్టలమధ్య రహస్య ప్రాంతాలకు తరలించి ధాన్యండంపును భద్రపరిచారు. మిల్లుయజమాని మధుసూధన్‌రెడ్డి నల్లబజారుకు ధాన్యం తరలిస్తున్నారనేపక్కా సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. మిల్లులో సిఎంఆర్‌కు చెందిన ధాన్యం బస్తాలు 1837 మాత్రమే ఉన్నా యని మహబూబ్‌నగర్ అదనపు రెవెన్యూకలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలనలో వెల్లడైంది. రాష్ట్రంలో మొత్తం 3368 రైసు మిల్లులుండగా అందులో 1177 మిల్లులు ఒకటి నుంచి నాలుగైదు సీజన్లు బియ్యం బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు కన్నంకొట్టాయి. బకాయిలు చెల్లించడానికి జనవరి 20తుదిగడువు పెట్టింది. రాష్ట్ర వాప్తంగా 2018ధాన్యం బకాయిల అత్యంత వివాదాస్పదంగా మారింది. 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి రెండు సీజన్‌లకు చెందిన సిఎంఆర్ కోటా ఇప్పటికీ రైసుమిల్లర్లు చెల్లించలేదు. 2024 ధాన్యం కేటాయింపులో రాష్ట్రప్రభుత్వం మిల్లర్లనుంచి బ్యాంకుగ్యారెంటీ తీసుకొనేందుకు షర్తు విధించింది. ప్రభుత్వ జరిమానా 25శాతంతో పాటు, మిల్లు సామర్థ్యంపై 25శాతం బ్యాంకు పూచీకత్తు ఇవ్వాల్సిన మిల్లులు రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో ఇప్పటికి ఇవ్వలేదు. బ్యాంకులో ప్రాసెస్‌లో ఉందని చెబు తూ ప్రభుత్వంను మభ్యపెడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి మొదలుకొని గద్వాలజిల్లావరకు డబ్బులు ఇస్తేనే మిల్లులకు ధాన్యం కేటాయింపులు జరుగుతున్నాయని ఆరోపణలు గుప్పమంటున్నాయి. కరీంనగర్ జిల్లాలో డిఫాల్టర్ మిల్లర్లకు ప్రయోజనం కలిగించడానికి డబుల్‌షిఫ్టింగ్ ప్రయోగం చేసున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మిల్లుకు లక్షన్నర చొప్పన వసూలు చేసి డబుల్ షిఫ్టింగ్ పేరుతో ధాన్యం కేటాయింపులు చేస్తున్నట్లు తెలిసింది. గతంలో కరీంనగర్‌లోనే లీజుల పేరుతో మిల్లర్లు టోకరావేసిన సంఘటనలు కూడాఉన్నాయి. ప్రస్తుతం డబుల్‌షిఫ్టింగ్ తెరపైకి తెచ్చారు. డబుల్‌షిఫ్టింగ్‌అంటే ఒక రైస్ మిల్లు నుంచి మరో రైసుమిల్లుకు అదీకూడా బకాయిలు ఉండి బ్యాంకు గ్యారెంటీలు తదితర ఫార్మాల్టిలు పాటించని డిఫాల్టర్లకు ధాన్యం బదలాయించడంకు ఈ పేరుతో ధాన్యం ఇస్తున్నారని తెలిసింది. దీనిని అధికారులు ధృవీకరించి కొత్తధాన్యం ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తంచేశారని తెలుస్తోంది. •

ప్రభుత్వం మిల్లర్లులు చెట్టాపట్టాలేసుకొని తిరుగుతుండటంతో ఉభయ తెలుగు రాష్ట్రాలలోని సివిలసప్లయ్ కార్పొరేషన్‌లకు అప్పులు గుదిబండలాగా మారాయి. తెలంగాణ పౌరసరఫరాలశాఖకు రూ.45లక్షల కోట్లు ప్రస్తుతం ఉంది. ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు రూ.36వేల కోట్లు అప్పుఉంది. భారత ఫుడ్‌కార్పొరేషన్ సంస్థ సిఎంఆర్ గడువు జనవరి మూడోవారం వరకు మళ్ళీ పెంచారు. కేంద్రప్రభుత్వం ఇప్పటికే పలు మార్లు సిఎంఆర్ బియ్యం తిరిగి ఇవ్వడానికి పలుమార్లు అవకాశంఇచ్చింది. ఈ దఫా తిరిగి బియ్యం ఇవ్వకపోతే సుమారు ఆరువేల కోట్ల భారం తెలంగాణపై పడుతుంది. అంటే మన సివిల్‌సప్లయ్ అప్పుభారం రూ.51వేల కోట్లకు చేరబోతుంది. 2023-24 వానాకాలం సం



బంధించి 17లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా మిల్లర్లవద్ద బకాయి ఉంది. 2023-24 లో 48లక్షల మె.ట ధాన్యం మిల్లర్లకు మర ఆడించాలని ఇచ్చారు. వాస్తవానికిధాన్యం కేటాయించిన 15రోజుల్లోనే మిల్లర్లు మర ఆడించి ఇవ్వాలికానీ జి.వోలో మూడు నెలలు అదనపు అవకాశం ఇవ్వడంతో దానిని అలుసుగా తీసుకొని ఏళ్లకుఏళ్ల సిఎంఆర్ బియ్యం ఇవ్వకుండా తప్పించుకొని దర్జాగా తిరుగుతున్నారు. ప్రభుత్వం కూడా సిఎంఆర్ బియ్యంపై శ్రద్ధ చూపకుండా టెండర్ ఏజెన్సీలకుధాన్యం అప్పగించేందుకు ఒత్తిడి చేస్తున్నది. ప్రభుత్వ ధాన్యం వేలంలో కొన్న ఏజన్సీలకు ధాన్యం అప్పగించని రైసుమిల్లర్లపై ఆర్‌ఆర్‌యాక్టు, క్రిమినల్‌కేసులు నమోదు చేస్తున్నారు.

# సమర సన్నాహం!

ఏ.వి.వి ప్రసాద్

ఢిల్లీ

మరో మహాసమరానికి తలుపులు తెరుచుకున్నాయి. గతవారం ఎన్నికల సంఘం షెడ్యూలును ప్రకటించడంతో ఢిల్లీ గద్దె అధిష్టించడానికి ఎవరి వ్యూహాలు వారు రూపొందించుకొనడంలో పూర్తిగా మునిగిపోయారు. వీరిలో అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీపార్టీ ఒక అడుగు ముందుకు వేస్తుండగా, దానిని ఏవిధంగానైనా దాటడానికి బిజెపి వడివడిగా కదులుతోంది. ఆ రెండింటితోను పోటీపడడానికి కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నిస్తోంది. బిజెపి, ఆప్‌లతో పోల్చితే కాంగ్రెస్‌కు గల విజయావకాశాలు తక్కువే అని చెప్పవచ్చు. గత సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకత్వంలోని 'ఇండియా' కూటమికి దాదాపు అన్ని పార్టీలు మద్దలు ఇచ్చి పోటీచేయడంతో కూటమి అధికారంలోకి రాలేకపోయినా అందలం సమీపం వరకైనా రాగలిగింది. కానీ తర్వాత జరిగిన పరిణామాలలో కాంగ్రెస్ దాదాపు ఒంటరిగా మారింది. ఆప్ మొదటినుంచి కాంగ్రెస్‌తో అంటీముట్టనట్లుగానే ఉన్నా సమాజ్‌వాది వంటి పార్టీలు గట్టి మద్దతునిస్తూ వచ్చాయి. కాంగ్రెస్‌తో తగినంత ఉపయోగం లేదని తెలిసినా తమిళనాడులో సిఎం స్టాలిన్‌కూడా కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా కొనసాగిస్తూనే వచ్చారు. అయితే ఎన్నికల షెడ్యూలును గత మంగళవారం (7, జనవరి) సిఇసి రాజీవ్ కుమార్ ప్రకటించగానే ఢిల్లీలో కాంగ్రెస్ వ్యతిరేకస్వరాలు మరింత అధికంగా వినిపించాయి. ఇప్పటికే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్న మమతాబెనర్జీ నాయకత్వంలోనిటిఎంసి, అఖిలేష్ నాయకత్వంలోని ఎస్పీ రెండూ కూడా ఆప్‌కే మద్దతునిస్తున్నట్లు ప్రకటించాయి. ఇది ఇండియా కూటమికీ నష్టమే, కాంగ్రెస్‌కునష్టమే. ఒకప్పుడు ఢిల్లీ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. కేంద్రప్రభుత్వంలో ఏ పార్టీఉంటే ఢిల్లీలో కూడా అదేపార్టీ అధికారంలోకి రావడం రివాజుగా ఉండేది. కానీ ఆ ట్రాక్‌ను మార్చుతూ బిజెపి, తర్వాత ఆప్‌ఢిల్లీ సింహాసనాన్ని ఆక్రమిస్తూండడంతో 2013తర్వాత కాంగ్రెస్‌మళ్లీ ఆ ఛాయలకు కూడా వెళ్లలేకపోయింది. గతపదేళ్లలో ఆప్ రెండుసార్లువరుసగా విజయంసాధించగా, అంతకు ముందు బిజెపి ముందువరుసలోకి వచ్చింది. గతంలో షీలాదీక్షిత్ మూడు పర్యాయాలుముఖ్యమంత్రిగా ఢిల్లీలో కాంగ్రెస్‌ప్రతిష్టను ఇనుమడింపచేశారుగానీ తర్వాత వర్గపోరు పెరిగిపోయిచాలా బలహీనపడింది. చివరికి ఒక్కసీటు కూడాసాధించలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా 2015, 20ఎన్నికలలో తిరిగికోలుకో లేని దెబ్బతింది. దేశరాజధాని అయిన న్యూఢిల్లీలో ఒక పార్టీ, రాష్ట్రఅసెంబ్లీగా ఢిల్లీలో మరోపార్టీ అధికారంలో ఉంటే అభివృద్ధి కుంటు పడుతుందనే ప్రచారంతో బిజెపి గతంలో అధికారంలోకి వచ్చినా, ఆప్ దానిని వమ్ముచేస్తూ గత రెండు పర్యాయాలుగా అధికారంలో కొనసాగుతోంది. కానీ కేజ్రీవాల్ లిక్కర్‌స్కామ్‌లో చిక్కుకోవడం, అలాగే ఆయన కేబినెట్‌లోని సిసోడియా, మరికొందరు మంత్రులు కూడాతీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొనడంతో ఆప్‌ప్రతిష్ట చాలావరకు మసక బారింది. కానీ పేదప్రజలలో ఆప్‌కు ఇంకాఆదరణ ఉన్నదనే పరిశీలకులు భావిస్తున్నారు. అయితే ఢిల్లీ మహానగరంలో పేదలశాతం, అక్షరాస్యత లేనివారిశాతం అతితక్కువ గనుక ఆప్‌కువచ్చిన చెడ్డపేరును అడ్డంపెట్టుకొని తిరిగి అధికారంలోకి రావడానికి బిజెపి చాలాగట్టి ప్రయత్నమే చేస్తోంది. ప్రధాని మోడీస్వయంగా వీధివీధి తిరుగుతూ చేస్తున్న ప్రచారమే అందుకు ఉదాహరణ. దాదాపు 26 సంవత్సరాలుగా ఢిల్లీ అసెంబ్లీని కోల్పోయిన బిజెపి కూడా ఈఎన్నికలను చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని సర్వశక్తులను కూడగడుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ 53.6శాతం ఓట్లతో 62 సీట్లను సాధించింది. ఆఎన్నికల్లో బిజెపికి 8సీట్లుమాత్రమేలభించాయి. ఓట్లశాతం 38.5వరకుఉంది. అంటే సీట్లలోను, ఓట్లశాతంలో కూడా ఆప్‌అటు బిజెపికి గాని, కాంగ్రెస్‌కుగాని అందనంత దూరంలో ఉన్నదనే చెప్పాలి. అప్పట్లో కాంగ్రెస్‌కు వచ్చినవి4.3శాతం ఓట్లు మాత్రమే. అసెంబ్లీలోకి అడుగుపెట్టే అవకాశం కూడాకోల్పోయింది. దానికి ముందు2015లో జరిగినఎన్నికల్లో 54.6శాతం ఓట్లతో ఆప్ 67 సీట్లు సాధించింది. అంటే బిజెపి మూడు సీట్లను మాత్రమే సాధించగలిగింది. ఆపార్టీకి వచ్చినఓట్లు 32.8శాతం. అదే సమయంలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాకపోయినా 9.7శాతం ఓట్లు మాత్రం వచ్చాయి. దీనిని బట్టిచూస్తే 20 కంటె 25లో ఆప్ ఓట్లశాతం కొంతకోల్పోగా కాంగ్రెస్‌మరికొంత ఓట్ల శాతాన్ని కోల్పోయింది. ఆ మేరకు బిజెపి ఓట్లశాతాన్ని పెంచుకోగలిగింది. కానీ సీట్ల మెజారిటీ మార్కును దాటకపోవడంతో అధికారానికి దూరంగా ఉండిపోవలసి వచ్చింది. కానీ ఇప్పుడు పరిస్థితిలో చాలామార్పు కనిపిస్తోంది. శాంతిభద్రతలు క్షీణించడం, వాతావరణ కాలుష్యం పెరిగిపోవడం, పౌరసౌకర్యాలు సంతృప్తికరంగా లేకపోవడం, దానికితోడు అవినీతి ఆరోపణలు ఎక్కువ కావడం ఆప్‌కు మైనస్‌గా మారుతున్నాయనీ, వాటిని తనకు అనుకూలంగా ఉపయోగించుకొనడానికి బిజెపి యత్నిస్తున్నదనీ అంటున్నారు. ఈ పోటీలో కాంగ్రెస్ తనకు అనుకూలంగా ఒక్క అంశాన్ని కూడా ప్రస్తావించలేకపోవడంతో ఈసారి కూడా ఆపార్టీ 'జీరో' స్థాయి దాటబోదనే అభిప్రాయమే వినిపిస్తోంది. కేంద్రం లో బిజెపి రాష్ట్రంలో ఆప్‌అధికారంలో ఉండడంతో 'ఉచిత' హామీలు యధేచ్ఛగా ప్రకటిస్తున్నారు. ప్రచారం విషయంలోకూడా కాంగ్రెస్‌కొంత వెనుకబడినట్లుగానే కనిపిస్తోంది. అన్ని పార్టీలకంటె ముందుగా, షెడ్యూలు రాకముందే ఆప్ తన అభ్యర్థులందరిని మూడు విడతలుగాప్రకటిం చింది. తర్వాత బిజెపి అభ్యర్థుల ప్రకటనదాదాపు పూర్తయింది. కానీ కాంగ్రెస్ ఇంకా మూడు వంతుల మంది అభ్యర్థులను ప్రకటించవలసిఉంది. ఇలా ఏవిధంగా చూసినాపోరు ప్రధానంగా బిజెపి, ఆప్‌మధ్యనే కనిపిస్తోంది. ఫిబ్రవరి 5న పోలింగ్ ముగిసిన తర్వాత 8వ తేదీన ఫలితాలు వెలువడతాయి. బిజెపి అధికారంలోకి వస్తే ఆప్ మరిన్ని గడ్డు పరిస్థితులను ఎదుర్కొనే సూచనలున్నాయి. •



ఓటింగ్ యంత్రం

# నియంతకే పగ్గాలు

గన్ని మోహన్

వెనిజులా

ప్రతిపక్షాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నా అమెరికా, బ్రిటన్, యూరోప్ వంటి దేశాల ఎన్నికలు చెల్లనేరవని, తాము అధ్యక్ష ఎన్నికను గుర్తించడంలేదని ప్రకటించినా దక్షిణ అమెరికా దేశాల్లో కీలక దేశమైన వెనిజులాకు అధ్యక్షుడుగా నికోలస్ మదురో మూడోసారి ప్రమాణం చేసారు. ప్రమాణ స్వీకారానికి నికరాగ్వా అధ్యక్షుడు డేనియల్‌ఒర్టెగా, క్యూబా మిగ్యూఎల్ డియాజ్ కేనెల్‌లతోపాటు చైనా, రష్యాల ప్రతినిధులు ఈ ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. గత ఏడాదిజులైలో జరిగిన ఎన్నికల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని ప్రతిపక్ష నేత ఎడ్మండో గోంజాలెజ్ విజయం తనను వరించినా నికోలస్ ఏకపక్షంగా నియంతృత్వంతో తనకుతానుగా గెలిచినట్లు ప్రకటించుకుని ప్రమాణ స్వీకారంచేసారన్న అభియోగాలు వెంటాడుతున్నప్పటికీ మదురో ఈ వారంలో వెనిజులాకు యునైటెడ్ సోషలిస్టుపార్టీ నేతగా, అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసి అగ్రరాజ్యాలకు కంట్లో నలుసుగా మారారు. వెనువెంటనే అమెరికా, యూరోప్ దేశాలు తనపై ఆంక్షలు విధించడాన్ని కూడా తీవ్రగా వ్యతిరేకించారు. ప్రపంచంలో ఏశక్తికూడా వెనిజులాను లొంగదీసుకోలేదని ప్రకటించి అగ్రరాజ్యాలకు సవాల్ విసిరారు. వాస్తవవానికి ప్రతిపక్ష నేత గొంజాలెజ్‌కు ఈ ఎన్నికల్లో 67శాతం ఓట్లు వచ్చినట్లు ఆధారాలు చూపించారు. అలాగే మదురోకు 30శాతం మాత్రమే ఓట్లువచ్చినట్లు కూడా ఆయన తనవద్ద ఉన్న రుజువులు చూపించారు. వీటన్నింటితోనూ ఏకీభవించిన అగ్రరాజ్యాలు మదురో ఎన్నికను తాము గుర్తించడంలేదని ప్రకటించాయి. బైడెన్ సర్కారు అయితే మదురో ఆయన సన్నిహితుడు విధేయుడు కాబెల్లోను అరెస్టు చేసేందుకు అమెరికా సిద్ధం అయింది. ఆధారాలుచూపిస్తే ఏకంగా 10 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో 215కోట్లరూపాయలు రివార్డును కూడా ప్రకటించడం విశేషం. అంతేకాకుండా మదురోను వ్యతిరేకించి అమెరికాకు వలసవచ్చిన ఆరులక్షలమంది వెనిజులా వాసులకు తాత్కాలిక రక్షిత హోదా ఇచ్చింది అంటే వారివీసా గడువును పొడిగించింది. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోపై అమెరికాలో ఇప్పటికే పలుకేసులు నమోదయ్యాయి. నార్కో ఉగ్రవాదం, అంతర్జాతీయ కొకైన్ అక్రమరవాణా కుట్రలో మదురో నిందితుడు. ప్రమాణ స్వీకారంచేసిన కొద్దినిమిషాలకే అమెరికా ఆర్థికశాఖ ఎనిమిది మంది వెనిజులాఅధికారులపై పలుఆంక్షలు ప్రకటించింది. మదురోతోపాటు ఆయన విధేయులుగా ఉన్నవారందరికీ వీసా ఆంక్షలు కఠినం చేసింది. దీనికంతటికీ కారణం వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో మదురో తీవ్ర అవకతవకలకు పాల్పడ్డారన్న అభియోగాలే. అమెరికా బాటలోనే బ్రిటన్‌కూడా మదురోతోపాటు ఆయన విధేయులు 15మందిపై ఆంక్షలు ప్రక టించింది. వెనిజులా సాయుధ దళాలఅధికారులు, సుప్రీం జస్టిస్ ట్రిబ్యునల్‌కు చెందిన ఉన్నతస్థాయి వ్యక్తుల పైనా ఈ ఆంక్షలు విధించింది. యూరోపియన్ యూనియన్‌కూడామదురోతోపాటు 15మందిపై ఆంక్షలు ప్రకటించింది. ఎన్నికల్లో అవకతవకలే వీటికి కారణాలుగా ఈ దేశాలు చూపించాయి. వెనిజులాలో మానవ హక్కులు హరించి వేస్తున్నారన్న ఆరోప ణలతో ఆంక్షలు విధించిన దేశాల్లో కెనడాకూడా చేరింది. మదురోతోపాటు 14మంది సీనియర్ అధికారుల పైనా ఆంక్షలు ప్రకటించింది. జి7దేశాల కూటమి వెనిజులా అధ్యక్షుడుగా మదురో ప్రమాణ స్వీకారాన్ని వ్యతిరేకించింది. ప్రజాస్వామ్య విధానంలోపించిందని మదురోను అధ్యక్షుడుగాతాము గుర్తించడంలేదని ప్రకటించాయి. ప్రతి పక్షాల ఆధ్వర్యంలో భారీఎత్తున ర్యాలీలునడిచినా మదురోవాటన్నింటినీ అణిచివేస్తూ అధ్యక్షుడుగా ప్రమాణం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని చెపుతూ ఆ ఎన్నికలను గుర్తించడంలేదని, అధ్యక్షుడుగా మదురోనుకూడా గుర్తించలేమని ప్రకటించాయి. అయినా కూడా మదురో తనదైనశైలిలో ప్రభుత్వాన్ని నడిపిస్తామంటూ ప్రమాణం చేసారు. కలిసివచ్చే శక్తులు, ఇరుగుపొరుగు మిత్రదేశాలు సహకరిస్తున్నాయని, తన ప్రజలే తనకు మూలం అంటూ పెద్దపెట్టున నినాదాలుచేస్తూ వెనిజులాను ఏశక్తికూడా లొంగదీసుకోలేదంటూ అగ్రరాజ్యాలకుసవాళ్లువిసిరారు. ఒకవిధంగా చెప్పాలంటే అంతర్జాతీయంగా కూడా ప్రపంచదేశాలు ఈఎన్నికను అంగీకరించడంలేదు. 2019లో తిరుగుబాటుతో వచ్చిన ఆనాటి నాయకుడు జువాన్ గ్వైయిడో అధ్యక్షుడుగా వచ్చారు. అతడి ఎన్నికను అమెరికాతో పాటు 50దేశాలు గుర్తించాయి. ప్రతిపక్షనేత గోంజాలెజ్‌తోపాటు మరో ప్రతిపక్షనేతమూరియా కోరినా మచాడో కూడా భారీఎత్తున మద్దతుసమీకరించుకున్నా మదురో తనకుతాను అధ్యక్షుడుగా ప్రకటించుకుని ప్రమాణస్వీకారంచేసారు. దక్షిణ అమెరికా దేశాల్లో కేవలం 3.05కోట్ల జనాభా ఉన్న దేశంలో ఈ రాజకీయ అనిశ్చితి ఇప్పుడు ఆర్థికవృద్ధిని క్షీణింపచేస్తుందన్న వాదనలున్నాయి. 92.2 బిలియన్‌డాలర్ల జిడిపి ఉన్న దేశంలో సహజవనరులు కూడా పుష్కలంగానే ఉన్నాయి. కొలంబియా, గుయానా, బ్రెజిల్‌దేశాలు సరిహద్దులుగాఉన్న ఈదేశంలో డ్రగ్స్‌విచ్చలవిడిగా వ్యాపారం జరుగుతుందని, నార్కొటిక్స్‌కు వెనిజులా మద్దతిస్తోందన్న అగ్రరాజ్యాలు ఇప్పటికే కేసులు నమోదుచేసాయి. ఈపరిస్థితుల్లో వెనిజులా అధ్యక్షుడుగా మూడో సారిపగ్గాలు చేపట్టిన నికోలస్ మదురోఅగ్రరాజ్యాల ఆంక్షలను ఏవిధంగా అధిగమిస్తారన్నది ప్రపంచ దేశాలకు ఉత్కంఠగా మారింది. ప్రతిపక్షాలను నిర్దాక్షిణ్యంగా అణిచివేసిన మదురో పూర్తికాలం కొనసాగుతారా లేక నిరసనలకు తలొగ్గి విపక్షనేత గొంజాలెజ్‌కుపాలన అప్పగిస్తారా అన్నది అంతుబట్టకుండా ఉంది. అయితే ఆయన మద్దతుదారుల అంతరంగాన్ని పరికిస్తే ఒకసారి బాధ్యతలంటూ చేపట్టాకా ఎవ్వరు వ్యతిరేకించినా ఈ యుఎస్‌పినేత మదురో తనపదవిని సుతరాము వదులుకోరని బలంగా వినవస్తోంది ఈక్రమంలో అగ్రరాజ్యాలు వెనిజులాపై ఏ విధంగా వ్యవహరిస్తాయన్నదే ప్రపంచదేశాలకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా నలుగుతోంది. •



నికొలస్ మదురో

# భారతజాతి హృదయ సంపద 'యువతరం'



సుంకవల్లి సత్తిరాజు

గాడాంధకారంలో వెలుతురు కోసం అన్వేషించడం కంటే, చీకట్లు కమ్ముకోకముందే, రాబోయే విపత్కర పరిణామాలను సునిశితంగా పరిశీలించి, అవరోధాలకు అడ్డుకట్టవేయడం శ్రేయస్కరం. సచ్ఛీలత, నిజాయితీ, మానవీయత మనిషి వ్యక్తిత్వాన్ని శిఖర స్థాయిలో నిలబెడుతుంది. బ్రతుకు దెరువు కోసమో, ఇతర స్వార్థ ప్రయోజనాల కోసమో వ్యక్తిత్వాన్ని మసకబార్చు కోవడం దురదృష్టకరం. ఇదొక రకమైన భావదారిద్రం. పరుల అడుగులకు మడుగులొత్తే సంస్కృతిమారాలి. ఆత్మాభిమానం ప్రాణం కంటే విలువైనదనే సత్యాన్ని నేటి యువతరం గ్రహించాలి. వర్షం వెలసిన తర్వాత గొడుగును అవతలికి విసిరికొట్టడం, రుచిని ఆస్వాదించిన తర్వాత కూరలో కరివేపాకును తీసిపారేయడం, అవసరానికో రంగు మార్చడం, అవసరానికి అక్కరకు చేరి, అవసరం తీరిన తర్వాత అధః పాతాళానికి తొక్కడం విలువల పతనానికి పరాకాష్ఠ. ఇలాంటి భావాలు మారాలి. ముఖ్యంగా యువతను ఇలాంటి పెడధోరణుల నుంచి కాపాడాలి. యువజనం నిస్వార్థంతో, ఆత్మాభిమానంతో విలువల ఆధారంగా శ్రమశక్తిని, నైపుణ్యాన్ని ఆయుధంగా చేసుకుని జీవించాలి. ప్రతిభకు మించిన ఆయుధం, వ్యక్తిత్వానికి మించిన ఆభరణం మరొకటి లేదనే సత్యం గ్రహించాలి. నిజమైన ప్రతిభ మరుగునపడిపోతే, అది సమాజానికి శాపం. దురదృష్టవశాత్తూ వర్తమాన పరిస్థితులు మేథస్సుకు, శ్రమకు గుర్తింపునిచ్చే విధంగా లేవు. అందుకే ప్రతిభకు గుర్తింపును దూరం చేయకూడదు. ప్రతిభ ఏ రూపంలో ఉన్నా గౌరవించే సాంప్రదాయం నెలకొనాలి. ప్రతిభను, గౌరవాన్ని, గుర్తింపును అడ్డదారిలో అణగద్రొక్కితే చరిత్రలో స్థానాన్ని కనుమరుగు చేస్తే భవిష్యత్తరాలు విలువైన సంపద కోల్పోయినట్టే. ఈ నిజాన్ని గ్రహించాలి. పూర్వకాలంలో ఇలాంటి పరిస్థితులున్నప్పటికీ జనం ఈ పోకడలను ఖండించేవారు. గొప్పవ్యక్తులను ఆరాధించేవారు. అందుకే నాటి మహనీయులు ఈనాటికీ జన హృదయాల్లో సజీవంగా మిగిలే ఉన్నారు. ఈ కోవలోకి చెందిన మహావ్యక్తి 'స్వామి వివేకానంద'. వివేకానందుని మార్గ నిర్దేశనం తరతరాలకు స్ఫూర్తిదాయకం. భారతదేశంలో నిరంతరం స్మరించుకునే మహనీయులెంతోమంది ఉన్నారు. వారిలో స్వామివివేకానందకు అగ్రతాంబూలం ఇవ్వాలి. ఇనుక కండరాలు, ఉక్కునరాలు, వజ్రసంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరమని వివేకానంద ప్రబోధించాడు. ఆత్మసాక్షికి మించిన దైవం గురువు మరొకటి లేదనే ఆ మహనీయుని సందేశం ప్రశంసనీయం. వివేకానందుని ప్రవచనాలు నేటి ప్రపంచానికి ఆదర్శప్రాయం. విద్య ద్వారా యువత చైతన్యమవుతుందని, విద్యద్వారా జాతికి జవసత్వాలు సిద్ధిస్తాయని విద్యప్రాధాన్యత చాటిచెప్పిన మహా యోగి, యువతకు స్ఫూర్తి, ఆధ్యాత్మిక ప్రపంచానికి ఆరాధ్యుడు "స్వామి వివేకానంద". భారతీయ ఔన్నత్యాన్ని శిఖరాగ్ర పథంలో నిలబెట్టిన వివేకానందుని ఖ్యాతి అజరామరం. వివేకానంద జీవితంలో మలుపు తీసుకువచ్చిన 1893 సెప్టెంబర్ 11, చికాగో సర్వమత సమ్మేళనం చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోతుంది. "చికాగో" సర్వమత సమ్మేళనంలో మహామహులైన విద్యావంతులు, మత ప్రబోధకులుహాజరైనారు. వయసులోను, విద్యలోను ఉద్దండులైన వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్న నాటి సభలో వివేకానంద పాల్గొనడం భారతదేశానికి అఖండ ఖ్యాతిని తీసుకువచ్చింది. "మైడియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా"అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన వెంటనే చికాగో సమ్మేళనం కరతాళ ధ్వనులతో మార్మోగిపోయింది. అప్పటి వరకు ప్రపంచానికి అంతగా పరిచయంలేని వివేకానందుని కీర్తి ఖండాంతరాలకు వ్యాపించింది. వివేకానందుని చికాగో ప్రసంగం ఆద్యంతం స్ఫూర్తి దాయకంగా, ఉత్కంఠ భరితంగా, ఉత్తేజభరితంగా కొనసాగింది. అలాంటి ప్రసంగం వినడం జన్మజన్మాల పుణ్యఫలంగా సభికులంతా ముక్తకంఠంతో నినదించారు. సామాజిక, తత్వ, సాహిత్యాంశాల్లో వివేకానందుని జ్ఞానాన్ని చూసి అంతా ఆశ్చర్యచకితులై, వివేకానంద ప్రతిభను వేనోళ్ళ కొనియాడారు. అమెరికాలోని పలు విశ్వవిద్యా లయాల ఆచార్యులు వివేకానందుని ప్రసంగానికి ఆక ర్షితులైనారు. పలు దేశాలు వివేకానందునికోసం ఆహ్వానాలు పంపాయి. వివేకానందుని అమెరికా ప్రయాణానికి ఆర్థిక ఇబ్బందుల ఎదురైనా, ఎంతోమంది దాతలు విరాళాలు ప్రకటించి వివేకానందుని అమెరికా పయనానికి వెన్నుదన్నుగా నిలిచారు. ఎంతోమంది రాజులు వివేకానందుని ఆధ్యాత్మిక ప్రవచనాలకు, దేశభక్తికి ఉత్తేజితులై, అమెరికా ప్రయాణానికి ద్రవ్యాన్ని సమకూర్చి పెట్టారు. అయినా అతను తనప్రయాణానికి అవసరమైనదే తీసుకుని, చికాగో సర్వమత సమ్మేళనానికి అమెరికా బయలుదేరాడు. సభలో ముందుగామాట్లాడకుండా చివర మాట్లాడతానని ప్రకటించి, అనర్గళంగా ప్రసంగించి, తన దివ్యమైన రూపంతో, ప్రసంగపటిమతో, తన హృదయాంతరంగాన్ని అత్యున్నతంగా సభావేదికపై ఆవిష్కరించాడు. తరతరాలకు తరగని ఖ్యాతిని భారతీయులకు వారసత్వ సంపదగా అందించిన కారణజన్ముడువివేకానంద. మహాత్మాగాంధీ, బోస్ లాంటి భిన్న ధృవాలు వివేకానంద బోధనలకు ప్రభావితం కావడం విశేషం. కోల్‌కతాలో జన్మించిన నరేంద్రనాథ్ దత్తా యోగ, తత్వశాస్త్రాల్లో ప్రతిభ గడించి, ప్రపంచంలో వీటికి విశేషమైన ప్రాచుర్యాన్ని తీసుకువచ్చాడు. వివేకానంద రామకృష్ణ పరమహంస ప్రియ శిష్యుడు. వివేకానందుడు విగ్రహారాధ నను ఖండించాడు. తండ్రిని కోల్పోయిన తర్వాత కుటుంబ బాధ్యత మీద నరేంద్రునిపై పడింది. పేదరికం పీడించింది. సాధు సాంగత్యంలో, ఆధ్యాత్మిక చింతనలో పడి సర్వసంగ పరిత్యాగిగా మారిన నరేంద్రనాథ్ దత్తా వివేకానందుడిగా విశ్వవ్యాప్తపై వెలుగొందాడు. కాలినడక పయనం, సత్రాలు, గుడిసెలు విడిది. కటికనేలపై నిద్ర, జ్ఞాన సముపార్జన, జ్ఞాన బోధ ఇవే వివేకానంద నిత్య కృత్యాలు. "మానవ సేవే మాధవ సేవ అని నమ్మిన వివేకానందుడు" యువతపై తనదైన ముద్ర వేశాడు. రామకృష్ణ పరమహంస శిష్యుడిగా, రామకృష్ణ మఠం వ్యవస్థాపకుడిగా వివేకానంద సేవలు మరపురానివి. వివేకానంద దేశభక్తి, జాతీయవాదం జాతీయ యోద్యమానికి ప్రేరణ, వన్నె తెచ్చాయి. రామకృష్ణ పరమహంస మరణం తర్వాత వివేకానంద భారత ఉపఖండంలో పర్యటించాడు. ప్రపంచంలోని పలు దేశాల్లో పర్యటించి, భారతీయఖ్యాతిని ఇనుమడింప చేసాడు. తాను 40 సంవత్సరాలకు మించి తాను జీవించబోనని వివేకానంద ముందుగానే తన శిష్యులకు చెప్పడం జరిగింది. కేవలం 39సంవత్సరాల వయస్సులోనే తనువు చాలించి, భువి నుంచి దివి కేగాడు. ఆరోగ్యం క్షీణించినా తన శిష్యులకు జ్ఞాన ప్రబోధ చేస్తూ, దీర్ఘశ్వాస వదిలాడు. వివేకానందుడు సకల సద్గుణ సంపన్నుడు. మానవతావాది, జాతీయవాది. వివేకం, వినమ్రత కలగలిసిన మహావక్త. గుణాలలోను, ప్రసం గాలలోను, వ్యక్తిత్వంలోను వివేకానందునికి సరిసమానమైన వారు ఈ భూప్రపంచంలో ఎవరూ లేరనేది నిర్వివాదాంశం. మనిషిని మనిషిగా ప్రేమించి, మంచిని పంచి, మానవత్వంతో, సద్గుణాలతో, నిండైన వ్యక్తిత్వంతో జీవిస్తే, అలాంటి మనుషులే దేవుళ్ల వుతారు. ఆచంద్రతారార్కమై ప్రపంచం చేత కీర్తింపబడి, ప్రజల హృదయాల్లో సజీవంగా నిలబడిచరిత్రకు శోభను సమకూర్చగలరు. సద్గుణాలే సకల సంపద. కుబేరుడైనా, కుచేలుడైనా గుణం గడ్డికరిస్తే అధః పాతాళానికే. పుడుతూ తెచ్చే ధనంలేదు. పోతూ పట్టుకుపోయేదేమీలేదు. ఎంత విత్తమార్జించినా బంగారము మ్రింగి బ్రతకలేడన్నది జీవిత సత్యం. దేహమున్నంత వరకు మోహసాగరంలో మునిగి తేలుతూ, శరీరం ముడతలు పడి, జవసత్వాలుడిగి, అస్థిపం జరంలా మారి, జీవశ్ఛవంలా బ్రతుకీడ్చిననాడు జ్ఞానభిక్ష కోసం ప్రాకులాడడం, ముక్తి కోసం ఆరాటపడడంలో స్వార్థమే తప్ప పరమార్థంలేదు. కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. ఉన్నాపోయినా మంచితనాన్ని, జ్ఞానాన్ని దొంగలు దొంగిలింపజాలరు. ఈ భువిపై జీవించి ఉన్నప్పుడే సక్రమమైన నడవడికతో, వ్యక్తిత్వ వికాసంతో మెలగాలి. జీవిత చరమాంకంలో పశ్చాత్తాప పడినాఫలం శూన్యంవర్తమానంలో స్వార్థం పరాకాష్ఠకు చేరింది. మానవత్వ విలువలు మంటగలిసాయి. ధనార్జనకే గాని, విలువలకు పనికిరాని వ్యక్తుల వలనజాతికి ఒరిగేది శూన్యం. పరులనుహింసించి, జీవించే నాగరికత ప్రబలింది. యువతరం వెర్రివ్యామోహాల్లో తలమునకలై, సకల వ్యసనాలతో జాతికి పెనుభారంగా మారుతున్న నేపథ్యంలో భారతీయ యువకెరటం, వివేకానికి నిలువెత్తు నిదర్శనమైన స్వామి వివేకానంద చికాగో చారిత్రక ప్రసంగ స్ఫూర్తిని జ్వలింప చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. •



నేడు స్వామి వివేకానంద జయంతి

## రాష్ట్ర యువత క్రీడలలో రాణించి దేశానికి మంచిపేరు తేవాలి : ప్రత్తిపాటి

**నాదెండ్ల,జనవరి11,ప్రభాతవార్త**



క్రీడాకారులకు కూటమి ప్రభుత్వ సహాయసహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని మాజీమంత్రి, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం మండలంలోని చందవరం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా లేని కోలాహలం, సంబరాలు మొదలవుతాయని అన్నారు. యువత క్రీడలపై మక్కువ పెంచుకొని అంచె లంచెలుగా ఉన్నత స్దానాలకు ఎదగాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు. గ్రామాలలో జరిగే క్రికెట్ మ్యాచ్‌లలో ప్రతిభ కనపరిచిన వారిని రాష్ట్రస్ధాయికి సిఫారసు చేస్తానని ప్రత్తిపాటి తెలిపారు. క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు ప్రత్తిపాటి కొద్దిసేపు క్రికెట్ ఆడారు. గ్రామ యువతకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, సిద్దారెడ్డి, బుల్లియ్య, చినపుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర టిడిపి కార్యవర్గ కార్యదర్శి షేక్ కరిముల్లా పుట్టినరోజు వేడుకలు

**చిలకలూరిపేట,జనవరి11,ప్రభాతవార్త:**



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యవర్గ కార్యదర్శి షేక్ కరిముల్లా పుట్టినరోజు వేడుకలు ప్రత్తిపాటి నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన కేక్‌ను ప్రత్తిపాటి కట్‌చేసి కరిముల్లాకు తినిపించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకుడు కరిముల్లా అని, ఏ పని చెప్పినా అది ఎంత కష్టమైనా, ఎంత ఇబ్బందైనా చిరునవ్వుతో ఆ పనిని చేసే వ్యక్తి కరిముల్లా అని ప్రత్తిపాటి తెలిపారు. తెలుగుదేశం పార్టీలో పనిచేసే వారికి ఎంత విలువను ఇస్తుందో అందరికి తెలిసిందేనని, రానున్న రోజులలో కరిముల్లాకు మంచిపదవి వరిస్తుందని ఆశిస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలను ప్రత్తిపాటి కరిముల్లాకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన నియోజకవర్గ తోట రాజారమేష్ తదితరులు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు.

## సూర్యలంక సముద్రతీరం వద్ద ఆత్మహత్యకు యత్నించిన మహిళ

**- మహిళ ప్రాణాలు కాపాడిన సూర్యలంక అవుట్ పోస్టు మెరైన్‌పోలీసులు..అభినందించిన ఎస్పీ**

**బాపట్ల,జనవరి11,ప్రభాతవార్త:**



బాపట్ల మండల పరిదిలోని సూర్యలంక సముద్రతీరం వద్ద ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను సూర్యలంక అవుట్‌పోస్టు,మెరైన్ పోలీసులు శనివారం కాపాడారు. మహిళ ప్రాణాలు కాపాడి సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్‌దూడి ప్రత్యేంగా అభినందించారు. వివరాల్లోకి వెలితే బాపట్ల పట్టణానికి చెందిన సుమారు 26 సంవత్సరాల వయస్సు కల్గిన మహిళ వ్యక్తిగత కారణాలతో చనిపోవాలనే ఉద్దేశ్యంతో తీరం వద్ద ఆత్మహత్యకు ప్రయత్నించింది గస్తీ విదులలో ఉన్న సూర్యలంక ఆవుట్ పోస్టు,మెరైన్ పోలీస్ సిబ్బంది వెంటనే స్పందించి అప్రమత్తంగా వ్యవహరించి అమె ప్రాణాలను కాపాడారు. అనంతరం అమెకు కౌన్సిలింగ్ నిర్వహించి వారి బందువులను పిలిపించి వారికి అప్పగించారు. సిబ్బంది త్వరిత గతిన స్పందించి అప్రమత్తంగా వ్యవహరించడం వలన ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను ప్రాణాలతో చూడగలుతున్నామని సిబ్బంది తీరు ప్రశంసనీయమన్నారు. యాత్రికుల రక్షణకు జిల్లా ఎస్పీ తీసుకున్న రక్షణ పరమైన చర్యలు అభినందనీయమని యాత్రికులు కొనియాడారు. సమర్ధవంతంగా విదులు నిర్వహిస్తూఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళ ప్రాణాలను కాపాడిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్‌దూడి ప్రత్యేకంగా అభినందించారు.

## గ్రామాలలో మౌళిక సదుపాలయకల్పనే ప్రభుత్వ ధ్యేయం: నరేంద్రవర్మ

**బాపట్ల,జనవరి09,ప్రభాతవార్త:**



గ్రామాలలో మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండల పరిదిలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించి పలు సీసి రోడ్లను శనివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ నాయకులతో కలసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు అభివృద్దికి కూటమి ప్రభుత్వ కట్టుపడి ఉందన్నారు. మండల పరిదిలోని స్టువార్టుపురం,వెదుళ్ళపల్లి, నరసాయపాలెం,కంకటపాలెం,ముత్తాయపాలెం,వల్లువారిపాలెం,కర్లపాలెం మండలంలో పేరలి, గోకులషేడ్, పెద్దగొల్లపాలెం గ్రామాల్లో సిసి రోడ్లను ఆయన ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిపి మానం విజేత,జనసేన సమన్వయకర్త నామనవెంకట శివన్నారాయణ,కావూరి శ్రీనివాసరావు,మండల పార్టీ అద్యక్షులు ముక్కామల శివ,మండల ప్రదాన కార్యదర్వి గుడిపల్లి సాంబశివరావు,ఎంపిడివోకె. బాబురావు,పంచాయితిసెక్రటరీ సుధాకర్,చుక్కపాల్‌రాజ్,గాజుల కేశవగాంధీ,సచివాల సిబ్బంది,నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేస్తున్నాం : ఎమ్మెల్యే నసీర్

**- రూ.80 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే నసీర్**


**గుంటూరు కార్పోరేషన్, జనవరి 11 ప్రభాతవార్త**



గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులకు బాటలు వేస్తున్నామని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ తెలిపారు. శనివారం గుంటూరు 8వ డివిజన్‌లో రూ.34. 50 లక్షలతో, 3వ డివిజన్ రూ.36.50 లక్షలతో, 4వ డివిజన్ 17 లక్షలతో సి.సి.డ్రైన్లు, సి.సి.రోడ్లు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని, వైకాపా నేతలు కక్ష్యసాధింపులతో టిడిపి ఆర్పోరేటర్లు గెలిచిన చోట్ల అభివృద్ధి పనులు చేయలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అన్ని డివిజన్‌లను సమ దృష్టితోనే చూస్తున్నామన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, త్వరలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామన్నారు. అదే విధంగా కూటమి ప్రభుత్వంలో సంక్షేమ, అభివృద్ధి ఏకదాటిపై నడుస్తున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని మోడ్రన్ నియోజకవర్గంగా మారుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ ఎల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాస్, జ్యోతులు జస్వంత్, జడ సురేష్, రబ్బాని, అల్లం బాజీ, కోట పిచ్చిరెడ్డి, మహంకాళి నరసింహారావు, వంగర ఏడుకొండలు, మహమ్మద్ గౌస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళిత ఉద్యోగులు...బాధ్యత మరవకూడదు : ఎమ్మెల్యే నక్కా

**గుంటూరు కల్చరల్,జనవరి 11,ప్రభాతవార్త**



గుంటూరు నగరంలోని వేమూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ ఏపి మేడ్ 2025 సంవత్సరం క్యాలెండర్‌ను నగర మేడ్ అధ్యక్షులు రావెల నల్లయ్య సారధ్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ ద్వారా ఉద్యోగాలు పొంది,"పే బ్యాక్ టు సొసైటీ" అనే నినాదాన్ని మరచి ఎవరి స్వార్ధం కొరకు వారు బ్రతకకుండా ప్రతి ఒక్క దళిత ఉద్యోగి బాధ్యతగా ఉండాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర మేడ్ అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ మేడ్ స్ధాపించిన దగ్గర నుండి దళిత ఉద్యోగులు,విద్యార్థుల సంక్షేమం కొరకు కృషిచేయడమే కాకుండా అనేక సందర్భాల్లో సమాజ సేవ కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. నక్కా ఆనంద్‌బాబును ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చేత మేడ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పేరకలపూడి రమేష్, కట్టెపోగు పున్నారావు, కందుకూరు మరియదాసు, పెరికే లేవి, కందుకూరి మరియానందం, కేశనపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నాగరాజుకు మదర్‌థెరిస్సా మెమోరియల్ అవార్డు

**నరసరావుపేట టౌన్, జనవరి 11 ప్రభాతవార్త**

పట్టణానికి చెందిన మా ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు స్వర్ణ నాగరాజుకు మదర్‌థెరిస్సా మెమోరియల్ అవార్డు లభించింది. పట్టణంలోని వృద్ధులకు, యాచకులకు ప్రతి రోజూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాగరాజును హైదరాబాద్‌లోని హోలీస్పిరిట్ క్రిష్టియన్ యూనివర్శిటీ గుర్తించి అభినందించింది. ఆయనకు యూనివర్శిటీ భవనంలో అవార్డును ప్రధానం చేశారు. సమాజంలో యువతకు నాగరాజు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. అవార్డు గ్రహీత నాగరాజు మాట్లాడుతూ తమ సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ అనీల్, దీపక్, యూనివర్శిటీ డైరెక్టర్ ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త



## వడ్డే ఒబన్నకు నివాళులర్పించిన ఎస్పీ

**నరసరావుపేట క్రైం, జనవరి 11 ప్రభాతవార్త**



జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం వడ్డే ఒబన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఒబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేనాటి ప్రాంతంలో వడ్డె ఒబన్న జన్మించారన్నారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో ఆయనకు సైన్యాధ్యక్షునిగా వడ్డే ఒబన్న విరోచితపాత్ర పోషించారన్నారు. బ్రిటీష్ సైన్యంపై గొప్ప పోరాటం చేసిన ఆయన యువతకు ఆదర్శమని ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఎస్పీ సత్తిబాబు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

**50సంవత్సరాల కాలంలో**

# గ్రామీణాభివృద్ధికి అసిస్ట్ సంస్థ చేసిన సేవలు ఎనలేనివి









**- రాష్ట్ర సాంఘీకశాఖ మంత్రి డోలా బాలా వీరాంజనేయస్వామి**

**- సేవా సంస్థలు సమాజసేవతో పాటు రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకోవాలి : మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి**

**చిలకలూరిపేట,జనవరి11,ప్రభాతవార్త**

అసిస్ట్ స్వచ్ఛంద సేవాసంస్ధ గత 50 సంవత్సరాల కాలపరిమితిలో గ్రామీణాభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. అసిస్ట్ స్వర్ణోత్సవాల వేడుకలో శుక్రవారం జరిగిన కార్యక్రమాలలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి కృష్ణ జిల్లాలలో అసిస్ట్ సంస్ధ వందలాది గ్రామాలలో గృహవసతి, మహిళలకు ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేక కార్యక్రమాలు ముఖ్యంగా మార్కాపురం పలకల ఫ్యాక్టరీలో బాల కార్మికుల విముక్తి, వారికి ఉచిత విద్య కల్పించడంలో అసిస్ట్ చేసిన సేవలు నిరుపమానమని తెలిపారు. మాజీమంత్రి, చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ సేవాసంస్థలు సమాజసేవతోపాటు రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సేవాసంస్ధలను, సేవాభావం కలిగిన వ్యక్తులను ఎప్పుడు ప్రోత్సహిస్తుంటారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. సేవాతత్పరతతో ముందుకు సాగుతున్న అసిస్ట్ లాంటి సంస్ధ చిలకలూరిపేటలో ఉండటం చుట్టుపక్కల నియోజకవర్గాలకు గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జాష్టి రంగారావు దంపతులను ప్రత్తిపాటి సత్కరించారు. 73వేల మంది బాల కార్మికులకు విద్యనందించడం, 92వేల బోర్లద్వారా 17వేల ఎకరాలకు సాగునీరు కల్పించడం లాంటి ఎంతో గొప్ప పనులను ఆసిస్ట్ సంస్ధ చేపట్టిందన్నారు. పేదల హృదయాలలో అసిస్టసంస్ధ సుస్థిరస్ధానం సంపాదించుకుందని, ఈ సేవలను గుర్తించి అమెరికన్ సంస్ధ ఇటీవల రంగారావుకు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందని వివరించారు. కోవిడ్ సమయంలో కూడా అసిస్ట్ సంస్ధ ప్రజలకు అందించిన సేవా కార్యక్రమాల గురించి ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ నరేంద్రకుమార్, పర్చూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు, అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్, అసిస్ట్ సంస్ధ అధ్యక్షులు డాక్టర్ వడ్లమాని రవి,నరసరావుపేట డిఎస్‌పి కె నాగేశ్వరరావు, పట్టణ సిఐ పి రమేష్, కోశాధికారి ముత్తినేని వెంకటేశ్వర్లు, ఎపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎపి లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యారావులు పాల్గొని అసిస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న రోటరి 3150 జిల్లా గవర్నర్ డాక్టర్ కె శరత్ చౌదరి, డిజిఈ ఎస్ రాంప్రసాద్, డిజిఎన్ ఉదయ్‌పిలాని, 3150రోటరి జిల్లా మాజీ గవర్నర్‌లు అన్నె రత్నప్రభాకర్, వడ్లమాని రాజ్యలక్ష్మీ, తాళ్ల రాజశేఖరరెడ్డి, చిలకలూరిపేట రోటరిక్లబ్, పండరీపురం రోటరిక్లబ్, నరసరావుపేట రోటరిక్లబ్, పర్చూరు రోటరిక్లబ్, మార్టూరు రోటరిక్లబ్, వేటపాలెం రోటరిక్లబ్, గుంటూరు రోటరిక్లబ్, వినుకొండ రోటరిక్లబ్, చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్‌కు చెందిన సభ్యులు అదేవిధంగా గౌరవ డాక్టరేట్ పొందిన డైరక్టర్ జాష్టి రంగారావును వారందరూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారందరికి అసిస్ట్ అసోసియేట్ డైరక్టర్లు జాష్టి కృష్ణ హరీష్, జాష్టి విష్ణుప్రియలు జ్ఞాపికలు అందచేశారు.

## గ్రామాల అభివృద్ధి తోడ్పాటు కే ఈ పల్లె పండుగ లక్ష్యం..

**- రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమంశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**


**కంచికచర్ల, జనవరి 11, ప్రభాతవార్త**




పరిటాల గ్రామ సచివాలయ ప్రాంగణంలో శనివారం జిల్లా స్థాయి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను, పశువులు, మేకలు గొర్రెల షెడ్ల ప్రారంభత్సోవాన్ని మంత్రి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమంశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాలు సుభిక్షంగా ఉంటే దేశం సురక్షితంగా ఉంటుందన్నారు. పార్లమెంట్ సభ్యులు ప్రభుత్వం మీద ఆధారపడకుండా కేసినేని ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారన్నారు. సిఎస్ఆర్ ట్రస్టు ద్వారా జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆదర్శమైన పార్లమెంటుగా తీర్చిదిద్దడంలో కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంక్రాంతి పండుగను రెండు రోజులు ముందుగానే తీసుకొచ్చారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో పల్లె పండుగ ద్వారా పల్లెల్లో పండుగ వాతావరణం రెడు రోజులు ముందుగానే తీసుకొచ్చిన ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి వర్యులకు దన్యవాదాలు తెలిపారు. రెండు లక్షల 30 వేల రూపాయలు విలువైన కాటిల్ షెడ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో 23 వేల రూపాయలు మాత్రమే చెల్లించి జీవితాల్లో వెలుగులు నింపడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచే కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నారన్నారు. మూడు నెలల కాలంలో అన్ని గ్రామాలలో సిమెంట్ రోడ్లు, పరిటాల గ్రామంలోని ఐదు రోడ్లు 20 లక్షల వ్యయంతో నిర్మించుకున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జాతీయ ఉపాధిహామీ పథకంలో 4500 కోట్లు మొదటి విడతగా మంజూరు చేయడం జరిగిందన్నారు. సిమెంట్ రోడ్లతో పాటు స్మశానాల నిర్మాణం వాటికి కాంపౌండ్ వాల్స్, ప్రతి సందులోనూ వీధిలైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అదరి జీవితాల్లో వెలుగులు నింపాలని శుభాకాంక్షలు తెలిపారు. గత ఐదు సంవత్సరాల్లో ఎన్నో అరాచకాలు అక్రమ పాలన సాగింది అన్నారు. ప్రస్తుత తమ ప్రభుత్వం ప్రజల ఆశలు ఆకాంక్షలను అనుగుణంగా పాలన సాగిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర ప్రభుత్వానికి రెండు లక్షల కోట్లరూపాయలు నిధులను కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేంద్రప్రభుత్వ సహకారంతో తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు ప్రారంభించామని ఉచిత ఇసుక అందుబాటులో ఉంచామని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఏరియా ఆసుపత్రిలోని 50 పడకల నుండి 100 పడకలు ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వ విప్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మిశ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో రెండు లక్షల జాబ్ కార్డ్స్ హోల్డర్స్ ఉన్నారని అన్నారు. 80 లక్షల లేబర్ బడ్జెట్ మాన్ డేస్ దాటి పనిచేశామన్నారు. 136 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ చేశామని 200 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. పని దినాలు పెరిగితే మెటీరియల్ కాంపోనెంట్ పెరుగుతుందని ఆ దిశగా ఉపాధి హామీ పథక అధికారులు చర్యలు తీసుకుంటున్నారని జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు. పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టు 23 న అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించడం జరిగిందన్నారు. సంక్రాంతి ముందు రోజు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. కేంద్రప్రభుత్వ సహకారంతో త్వరలో పరిటాలలో రైల్వే స్టేషన్ రాబోతుందని అదేవిధంగా అతిపెద్ద లాజిస్టిక్ హబ్ కాబోతుందని అన్నారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి 8 లైన్లుగాను కొన్ని చోట్ల ఆరు లైన్లుగాను విస్తరించనున్నామన్నారు. నందిగామ నియోజకవర్గంలో ఎన్టీఆర్ ఎత్తిపోతల వేదాద్రి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలు స్వయం ఉపాధి పథకాలలో నూ స్వయం సహాయక గ్రూపులలోను చేరి చురుకుగా కార్యకలాపాలు నిర్వహించుకోవాలన్నారు. మహిళల కోసం త్వరలో 15 గ్రామాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు జనసేన బిజెపి ఎన్డీఏ కూటమి నాయకులు తో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## గోకుల షెడ్డులను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**రొంపిచర్ల, జనవరి 11 ప్రభాతవార్త**



మండల కేంద్రమైన రొంపిచర్లతో పాటు ఆరేపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోకుల షెడ్డులను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న రైతులకు అండగా నిలిచేందుకు సిఎం చంద్రబాబు ముందుచూపుతో గోకుల షెడ్డులను ఏర్పాటు చేశారన్నారు. నామమాత్రపు రైతు పెట్టుబడితో ప్రభుత్వం పూర్తి గ్రాంట్ అందిస్తూ గోకుల షెడ్డులను నిర్మిస్తుందన్నారు. వ్యవసాయానికి తోడుగా పాడిపరిశ్రమ అవసరమన్నారు. రైతులు గోకుల షెడ్డులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గోకులాలతో పాడి పరిశ్రమకు మరింత ప్రోత్సాహం

**- బాపట్ల జిల్లాలోనే రూ.14,76 కోట్లతో683 గోకులాల నిర్మాణం - మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**బాపట్ల, జనవరి 11, ప్రభాతవార్త:**




గోకులాల నిర్మాణాలతో పాడి పరిశ్రమకు మరింత ప్రోత్సాహం లబిస్తుందని, ఆంధ్రప్రదేశ్‌లో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని ,రైతులకు ఆర్థిక చేమూత లబిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని గోవాడ గ్రామంలో పర్యటించి నిర్మాణం పూర్తి చేసుకున్న పలు గోకులాలను శనివారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన తరువాత పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే 12,500 గోకులాలను నిర్మించటం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వ ఐదేళ్ళ పాలనలో కేవలం 260 గోకులాలను మాత్రమే నిర్మించిదన్నారు. ఇటువంటి చర్యలతో పాడి పరిశ్రమ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. నిదులు దుర్వినియోగం తప్ప పాడి పరిశ్రమ అభివృద్ధికి గత వైసిపి ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. అనంతరం గో కులాలతో పాటు జిల్లాలో సిసీ రోడ్లు,డ్రైన్‌లు వంటి పలు అభివృద్ధి పనులు ప్రారంబించారు. స్ధానికులు తెల్పిన పలు సమస్యలను ఆయన స్వయంగా విని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను అదేశించారు. కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాణ ఉంటుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం గ్రామ స్వరాజ్యానికి బాటలు వేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్,నేతలు,కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట - మంత్రి నాదెండ్ల మనోహర్

**తెనాలి, జనవరి 11 (ప్రభాతవార్త) :**



ప్రజలు కోరుకున్న విధంగా గ్రామాలను అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రకటించిన పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాల ద్వారా గ్రామాల్లో సిసి రోడ్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మండలంలోని కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శనివారం మంత్రి నాదెండ్ల మనోహర్ శంఖుస్ధాపన చేశారు. తొలుత నందివెలుగు గ్రామంలోని రావి అమ్మయ్య కాలనీలో 20లక్షల రూపాయలతో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు మంత్రి మనోహర్ శంఖుస్ధాపన చేశారు. అనంతరం కొలకలూరు గ్రామంలో 11లక్షల రూపాయలతో నిర్మించనున్న స్మశాన వాటిక అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్ధాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ ప్రజలు కోరుకున్న విధంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోను నిధులు సమకూర్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గత ఎన్నికల సమయంలో ప్రజలు కోరుకున్న విధంగా కొలకలూరు గ్రామంలో స్మశాన వాటిక రోడ్డు, నందివెలుగు కాలనీ అంతర్గత రోడ్లు ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో మంచినీటి సరఫరా, శానిటేషన్, అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ వెంట పంచాయితీరాజ్ శాఖ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, చొప్పర ప్రీతి, దూళిపాళ్ళ పవన్ కుమార్, పార్టీ గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

**ఒరిజినల్ దస్తావేజులు పోయినవి**

గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం తెలగపాలెం డోర్‌నెం. 25-1-59 కాపురస్తుడు కొండపల్లి సుబ్బారావు గారి కుమారుడు వెంకట సత్యనారాయణ గారికి రిజిస్టర్ కాబడిన ద.నెం.742/2010 రూగా పొన్నూరు మండలం ఆరెమండ గ్రామ డి.నెం. 222-2, 222-3, 223-1, 223-2 ర్లు దాఖలా య.2-40 3/4 సెంట్లు భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఐలాండ్ సెంటర్‌లో ఫోటో స్టాట్ తీసుకొని వస్తుండగా పోయినవి దొరికిన వారు ఈ నెం. సంప్ర:9030242490.

**పొన్నూరు పురపాలక సంఘం**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు**

ఆర్.సి.నెం.528/2020/ఇ1 తేది: 11-01-2025

పొన్నూరు పురపాలకసంఘ పరిధిలో 15వ ఆర్ధిఖ సంఘ నిధుల నుండిఅభివృద్ధి పనులను రూ.104.55లక్షల అంచనాలతో 28 పనులు నిర్వహించుటకు గాను అర్హత గల సివిల్ కాంట్రాక్టర్ల నుండి పనులు చేయుటకు ఇ- ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు దాఖలుకు ఆహ్వానించడమైనది.

1.బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది. 11-01-2025 సమయము సా॥ 4.00 ని॥ ల నుండి.

2.బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడింగ్‌నకు చివరి సమయం 27-01-2025 సమయము సా॥4.00 ని॥ల వరకు. మరియు

3.టెండర్లు ఓపెనింగ్ తేది. 27-01-2025, సమయం సా॥4.30లకు.

మిగతా వివరములకు www.tender.eprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

కమీషనరు, పొన్నూరు పురపాలకసంఘం.

## విజ్ఞాన్స్ లారా విద్యార్థినికి అమెజాన్‌లో రూ.40లక్షల ఉద్యోగం

పొన్నూరు, జనవరి 11,ప్రభాతవార్త



చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్ఈ విద్యార్థిని బయ్యన రేణు అక్షయకు అమెజాన్ కంపెనీలో రూ.40లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగం వచ్చిందని విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని బయ్యన రేణు అక్షయ తల్లిదండ్రులైన డాక్టర్ బి.రాజీవ్,పద్మలను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లావు రత్తయ్య మాట్లాడుతూ సాధారణ విద్యార్థినిగా విజ్ఞాన్స్ లారాలో అడ్మిషన్ సాధించి నేడు అమెజాన్‌లో రూ.40లక్షల వార్షిక వేతనంతో కూడి ఉద్యోగానికి ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎందుకంటే ఐటీ రంగంలో మాంద్యం ముంచుకొస్తున్న తరుణంలో ప్రస్తుతం ఐటీ కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేపట్టే పరిస్థితులు లేవన్నారు. అటువంటి పరిస్థితుల్లో కూడా తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రాంగణ ఎంపకిల్లో సత్తాచాటారని పేర్కొన్నారు. తమ విద్యార్థులకు కోర్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించే విధంగా శిక్షణ ఇవ్వడం వలనే సాధ్యమయిందన్నారు. తమ కళాశాలలో చదివే విద్యార్థులకు డిగ్రీ పట్టాతో పాటు, కళాశాలలో ఉన్నప్పుడే ఉద్యోగం వచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం వల్లే విద్యార్థులు వివిధ బహుళజాతి సంస్థలకు ఎంపికై సత్తాచాటుతున్నారన్నారు. తమ కళాశాలలో మొదటి సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ విద్యతోపాటు ప్రత్యేక తరగతులు, మేము అవలంభించే కౌన్సిలింగ్ సిస్టం విధానం, ప్రత్యేక ట్రైనింగ్ క్లాస్‌లే కారణమన్నారు.ప్రతి కంపెనీకి కావలసిన నైపుణ్యాలను దృష్టిలో ఉంచుకొని....వాటికి అనుగుణంగా విద్యార్థులకు శిఓణ ఇస్తామన్నారు. అమెజాన్‌లో ఉద్యోగం పొందిన బయ్యన రేణు అక్షయను కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధి కల్పనాధికారులు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొని అభినందించారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి - ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు, జనవరి 11,ప్రభాతవార్త:




పొన్నూరు పట్టణాన్ని స్వచ్ఛ స్వర్ణపురిగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పొన్నూరులో కూడా వ్యాపించి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. రాబోయే రోజుల్లో సమాజాభ్యుదయానికి, సమాజాభివృద్ధికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేయాలని కోరారు. మునిసిపల్ కార్మికులు పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. వారి కృషిని గుర్తించి ఇంటి యజమానులు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా తడి, పొడి చెత్తలను వేర్వేరుగా మునిసిపల్ ట్రాక్టర్లకు, పుష్‌కార్ట్సకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు నన్నపనేని బాలకృష్ణ, షేక్ యాసిన్‌బాబా, నన్నపనేని రవీంద్రనాథ్, బందారుపల్లి శ్రీనివాసరావు, లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళా అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, శబలాదేవి తదితరులున్నారు.

## విజ్ఞాన్‌లో పల్లెవించిన సంక్రాంతి

**- సంక్రాంతి అంటే రైతుల పండుగ - విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య**

పొన్నూరు, జనవరి 11,ప్రభాతవార్త:



సంక్రాంతి విశిష్టతను తెలిపే రంగు రంగుల రంగవల్లులు, హరిదాసు సంకీర్తనలు, కోలాటాలతో తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య విద్యార్థులతో మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే రైతుల పండుగని తెలిపారు. మన పండుగల్లోని విశిష్టతను, శాస్త్రీయతను విద్యార్థులు గుర్తించాలని సూచించారు. ఈ సమయంలో రైతు లోకం పంట చేతికొచ్చిన ఆనందంలో ఉంటుందని చెప్పారు. సంక్రాంతి పర్వదినాల్లో పల్లెటూళ్ళు ఎంతో అందంగా, ఆహ్లాదంగా ఉంటాయని చెప్పారు. రకరకాల జానపద వినోద కళాకారులు, పగటివేషధారులు ఈ పండుగ సమయంలో పల్లెల్లో వినోదాన్ని




పంచుతారని తెలిపారు. ఎడ్ల పందేలు, కోడి పందేలు, రంగవల్లులు, గొబ్బెమ్మలు....ఇలా సంక్రాంతి అంటేనే సరదాల పండుగ అని చెప్పారు. తమ విద్యా సంస్థల్లో ఏటా అన్ని పండుగలను వైభవంగా నిర్వహిస్తామని ఆనవాయితీగా వస్తోందన్నారు. పిల్లలకు సంస్కృతి సంప్రదాయాలపై గౌరవం పెంపొందించే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పాత పద్ధతులను గుడ్డిగా అనుసరించకుండా సొంత దారులు వెతకాలని విద్యార్థులకు సూచించారు.

**కళకళలాడిన యూనివర్సిటీ ప్రాంగణం:**

సంక్రాంతి సంబరాలతో విశ్వవిద్యాలయ ప్రాంగణం కొత్త కళను సంతరించుకుంది. విద్యార్థులు గోమాతను పూజించారు. పొంగళ్లు పొంగించారు. చిన్నారులు భోగి పళ్ళు పోశారు. చెరుకుగడలు అల్లారు. రంగురంగుల ముగ్గులు వేశారు. భోగి మంటలు వేశారు. సంక్రాంతి పాటలు పాడారు. సంక్రాంతి విశిష్టతను తెలిపేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమ నృత్యాలు ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. హరిదాసు సంకీర్తనలు వినిపించారు. పిండి వంటలు వండారు. డోలు, సన్నాయిలతో వినోద బృందం కనువిందు చేసింది. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రథం ముగ్గులు ఆకర్షించాయి. గాలిపటాలు, బెలూన్లు ఎగురవేశారు. ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ ఛాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒడిస్సా గవర్నర్‌ను కలిసిన బిజెపి నాయకులు

పొన్నూరు, జనవరి 11,ప్రభాతవార్త:



ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు నిడుబ్రోలు వచ్చారు. స్వర్గీయ పామలపాటి అంకినీడుప్రసాదరావు భార్య శివప్రసాదదేవి ఇటీవల మృతి చెందారు. శనివారం శివప్రసాదదేవి పెద్ద ఖర్మ సందర్భంగా ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గవర్నర్ కంభంపాటి దంపతులు శివప్రసాదదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కంభంపాటి నిడుబ్రోలు వచ్చిన వార్త తెలుసుకొన్న బిజెపి నాయకులు నిడుబ్రోలు వెళ్ళి కంభంపాటిని కలిశారు. శివప్రదాతానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంభంపాటిను కలిసేందుకు వచ్చిన జమ్ముల శ్యాంకిషోర్, ఎడ్లపాటి రఘునాథబాబు, స్వరూపారాణి, ఆర్ లక్ష్మీపతిని స్థానిక నాయకులు కలిశారు. అతిథులను కలిసినవారిలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు వరాకరం రంగవల్లి, జిల్లా కార్యదర్శి కటుపాల శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గోవాద వలపతిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెరుకూరి తిరుపతిరావు, గోవాద వెంకటకృష్ణారావు, గోగినేని వెంకయ్య, దాసరి వెంకయ్య,ఆరే వెంకట్రావు,భట్టిప్రోలు రామకృష్ణ, గురుబాలు,తస్సీరు శివరామకృష్ణ ఎస్ సురేష్‌లున్నారు.

## బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాల్సిందే

**- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొందుగల జయరాజు**

పొన్నూరు, జనవరి 11,ప్రభాతవార్త:



న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై దాడి చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొందుగల జయరాజు అన్నారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరుగుతున్న రిలే దీక్షలు శనివారానికి ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే న్యాయవాదులపై తిరగబడి దాడులు చేయడం సరైన విధానం కాదన్నారు. గాయాలపాలై వైద్యశాలకు వచ్చిన బాధితులకు చికిత్స చేయాల్సిన డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఆయనపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయాలని న్యాయవాదులు దీక్షలు చేస్తుంటే ప్రభుత్వానికి కుట్టినట్లు కూడా లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా సిఐ, ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్ళపై సస్పెన్షన్ వేటు వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. న్యాయవాదిని ఒక రౌడీలాగ, సంఘ విద్రోహ శక్తిలాగ ట్రీట్ చేయడం సరైన విధానం కాదన్నారు. దీనిపై ప్రభుత్వం సరైన విధంగా ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఐదవ రోజు న్యాయవాదులు విన్నకోట సదా నందరావు వలపర్ల రాంబాబు దీక్ష చేశారు. వీరి మద్దతు తెలిపినవారిలో న్యాయవాదులు జీవన్ రాయెల్,బొనిగల రాజారావు, షేక్ బాజీసాహెబ్,దమ్ము కోటేశ్వరరావు,బొనిగల అంకమ్మరావులున్నారు.

## ఐగ్రో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు - హాజరైన ఎం.పి., ఎమ్మెల్యే

నరసరావుపేట, జనవరి 11, ప్రభాతవార్త



ఐగ్రీ అంతర్జాతీయ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ పల్లబోతుల వెంకట్, వైస్ ఛైర్మన్ మురళీబాబు ప్రత్యేక వేడుకలను పర్యవేక్షించారు. ఎం.పి.లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పాఠశాల విద్యా వ్యవస్థలో నూతన మార్పులను తెచ్చిందన్నారు. చదువుతో పాటు ఆటపాటలు ఎంత ముఖ్యమో వివరించారు. సాంస్కృతిక పోటీలలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. విశాలమైన ఆట స్థలం ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని అభినందించారు. ఛైర్మన్ పల్లబోతుల వెంకట్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా తమ పాఠశాల అభివృద్ధికి చేయూతనిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ శేషసాయి, వైస్ ప్రిన్సిపాల్ చంద్రబాబు, సాయిబాబా, విశ్వనాథ్, సాయి, కోఆర్డినేటర్ మాధవి, పట్టణ ప్రముఖులు వేల్పుల సింహాద్రియాదవ్, ఎస్.కె.జిలానీమాలిక్ పాల్గొన్నారు.

## మైనార్టీ ఐటిఐ బాలికల హాస్టల్స్‌ను పరిశీలించిన టిడిపి నాయకులు

నరసరావుపేట టౌన్, జనవరి 11 ప్రభాతవార్త



మండలంలోని ములకలూరు గ్రామం వద్ద ఉన్న మైనార్టీ బాలుర ఐటిఐ కళాశాల, బాలికల హాస్టల్స్‌ను శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అహమ్మద్ షరీఫ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. టిడిపి హయాంలో పూర్తి గ్రాంట్‌లతో మైనార్టీ యువత విద్యలో, ఉద్యోగాలలో రాణించాలని రాష్ట్ర వ్యాప్తంగా పదహారు ప్రాంతాల్లో ఐటిఐ,పాలిటెక్నిక్ కళాశాలలు, బాలికల కోసం ప్రత్యేకంగా హాస్టల్స్ నిర్మించడం జరిగిందన్నారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశంపార్టీతోనే సాధ్యమన్నారు. ఇప్పటికే ఐటిఐ కళాశాలకు ప్రిన్సిపాల్ నియామకం జరిగిందన్నారు. వచ్చే ఏడాది విద్యా సంవత్సరం నాటికి అధ్యాపకులను నియమించి తరగతులను ప్రారంభించడం జరుగుతుందని అహమ్మద్ షరీఫ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

రొంపిచర్ల, జనవరి 11 ప్రభాతవార్త



మండలంలోని నల్లగార్లపాడు గ్రామంలో శనివారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మృతిచెందడంతో సమాచారం తెలుసుకున్న గోపిరెడ్డి ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నల్లగార్లపాడు గ్రామ అభివృద్ధికి వారు చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. పార్టీ పటిష్టతకు సహాయం చేశారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

నరసరావుపేట మండలంలో... మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో మృతిచెందిన వైకాపా నాయకులు బూసి వెంకటకోటయ్య మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసాను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి వెంట పార్టీ నాయకులు యన్నం రాధాకృష్ణారెడ్డి, వెంకటప్పారెడ్డి, జెడ్పీటీసీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరూ మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోండి

పొన్నూరు, జనవరి 11, ప్రభాతవార్త



అర్హులందరూ మినీ గోకులాలను సద్వినియోగం చేసుకొనేవిధంగా ఆలోచన చేయాలని ఎంపిడిఓ కొప్పాక లలిత సూచించారు. పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా చేబ్రోలు మండల పరిధిలోని వేజండ్ల, సుద్దపల్లి, శేకూరు గ్రామాల్లో నిర్మాణం చేసిన మినీ గోకులాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ ఈ షెడ్ల నిర్మాణంతో రైతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పశుపోషకులకు న్యాయం చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. షెడ్డు యొక్క పూర్తి యూనిట్ విలువ రూ.2.30లక్షలు కాగా దీనిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.2.03లక్షలు లభిస్తుందన్నారు. ఇక పోతే లబ్దిదారుని వాటాగా రూ.23వేలు, వేజ్ రూ.4వేలు అన్నారు. రైతులు కేవలం పదిశాతం వాటాతో రైతులు షెడ్లు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. పశుపోషకులు, పాడి రైతులకు ప్రభుత్వం ఇచ్చే మంచి అవకాశమన్నారు. వేజండ్ల గ్రామంలో గవిని రవీంద్ర, గైరుబోయిన బసవయ్య, సుద్దపల్లి గ్రామంలో కంకణాల నాంచారయ్య, శేకూరు గ్రామంలో బొల్లావుల వెంకటేశ్వర్లు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఎపిఓ కె.ఆనందమోహన్, సిబ్బంది, పశువైద్యాధికారి ఉష, మండల పార్టీ అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు చందు శ్రీరాములు, రాష్ట్ర బీసీసే అధికార ప్రతినిధి వీరంకి రంగారావు,సర్పంచులు పంచాయితీ కార్యదర్శులు, ఎంపిటీసిలు, కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టైనీటాట్స్ పాఠశాలలో ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట, జనవరి 11 ప్రభాతవార్త :



టైనీటాట్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతూరి శ్రీనివాసరావు - కోటమ్మల ఆధ్వర్యంలో పాఠశాల నిర్వహణ అద్భుతంగా ఉందన్నారు. భవిష్యత్తు యువతను తీర్చిదిద్దేందుకు క్రమశిక్షణతో కూడిన విద్యను వారు అందిస్తున్నారని తెలియజేశారు. సంక్రాంతి వంటి అతి పెద్ద పండుగ విశిష్టతను, తెలుగువారి ఆచార సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేసేందుకు పాఠశాలలో ఏర్పాటు చేసిన గొబ్బెమ్మలు, గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలియజేశారు. ఆటల పోటీలలో విజేతలకు ఈ సందర్భంగా బహుమతులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కపలవాయి విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాచర్లలో ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

మాచర్ల, జనవరి 11 ప్రభాతవార్త:

పట్టణంలోని చిన్నకాన్వెంట్ స్కూల్ వద్ద వడ్డె ఓబన్న జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డె నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతీకగా పేర్కొన్నారు.వడ్డెఓబన్న వీరత్వాన్ని కొనియాడారు.ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాచర్ల పట్టణ తెదేపా అధ్యక్షులు కొమెర దుర్గారావు, మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, తెదేపా సీనియర్ నాయకులు యెనుముల కేశవ రెడ్డి,విగ్రహకమిటీ అధ్యక్షులు కొమెర అనంతరాములు,తదితర బీసీ నాయకులు,కులస్తులు పాల్గొన్నారు.

## మాచర్లలో నేడు స్వామి వివేకానంద 163వ జయంత్యుత్సవాలు

మాచర్ల, జనవరి 11 ప్రభాతవార్త:

స్వామి వివేకానంద 163వ జయంత్యుత్సవాలు (నేషనల్ యూత్ డే) శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. మాచర్ల మండలంలోని కంభంపాడు, గన్నవరం, తుమృకోట గ్రామాలతోపాటు మాచర్ల పట్టణంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా ఎదురుగా ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గోవిందరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ వేడుకల్లో గురజాల డీఎస్పీ జగదీష్ హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువత, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఇస్సపాలెం అమ్మవారి ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట, జనవరి 11 ప్రభాతవార్త

మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన రెడ్డి సత్యనారాయణ రూ.2.50 లక్షలను విరాళంగా అందించారు. శనివారం ఆలయ ఈవో మాధవిదేవి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న దాతలకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. రవి స్వీట్స్ సంస్థ యాజమాన్యంకు ఈవో మాధవిదేవి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దాతలకు ఆదాయపుపన్ను మినహాయింపు ఉంటుందన్నారు.

## మాచర్లలో వంటగ్యాస్ లీకై ఎగసిపడిన మంటలు

**- మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది - దగ్ధమైన ఇంటి సామగ్రి**

మాచర్ల, జనవరి 11 ప్రభాతవార్త:



గృహావసరాలకు వినియోగించే గ్యాస్ లీకై మంటలు ఎగసిపడి ఇంటి సామగ్రి దగ్ధమైన ఘటన మాచర్ల పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది కథనం ప్రకారం పట్టణంలోని 16 వార్డు సైసా కిరాణాషాపు బజార్లోని ఓ ఇంటిలో రెవెన్యూ కార్యాలయ ఉద్యోగి ఖాసింసైదా నివాసం ఉంటున్నారు. ఆయన భార్య వంట చేసేందుకు ఇంట్లోని స్టవ్ వెలిగించింది. ప్రమాదవశాత్తు గ్యాస్ రెగ్యులేటర్ దగ్గర లీకేజీ అవుతుండటంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిశాయి. దీంతో ఆమె ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీసింది. ఇంట్లో మంటలు వ్యాపించి ఫ్రిజ్, కరెంటు బోర్డులు, నిత్యావసర వస్తువులు దగ్ధమయ్యాయి. స్థానికులు గమనించి గోనెపట్టలను తడిపి సిలిండర్‌పై వేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అగ్ని మాపక అధికారి లక్ష్మయ్య మాట్లాడుతూ మంటలు వ్యాపించిన గ్యాస్ సిలిండర్‌ను చాకచక్యంగా మంటలు అదుపులోకి తేవడంతో పెద్దప్రమాదం తప్పిందన్నారు. సిలిండర్‌లో నల్లవాషర్ సమస్య వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని వివరించారు. గ్యాస్ సిలిండర్ తెచ్చిన వ్యక్తితోనే లీకేజీ ఉందా లేదా అని పరిశీలన చేసుకుంటే ఇలాంటి ప్రమాదాలు జరగవని పేర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది ఎ.వెంకటేశ్వర్లు, వీఎస్ ప్రసాద్, వీరాంజనేయులు తదితరులు మంటలను అదుపులోకి తెచ్చారు.

## పల్నాడు జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

మాచర్ల, జనవరి 11 ప్రభాతవార్త:



పట్టణంలోని పల్నాడు జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు వేడుకలు జరిపినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో నృత్యాలతో అలరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంక్రాంతిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కళాశాల సెక్రటరీ పఠాన్ నాగూర్ వలి ఆకాంక్షించారు. అనంతరం జరిగిన భోగి మంటల కార్యక్రమంలో ప్రిన్సిపల్ శివభాస్కర్, కళాశాల ఛైర్మన్ మారేపల్లి లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు మర్రి వెంకటనారాయణ, ఇరువంటి ఆంజనేయశాస్త్రి, మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు రాధ, రబ్బానీ, కాశీ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రిటీష్ వారిని గడగడలాడించిన వీరుడు ఓబన్న: కూటమి నేతలు

పిడుగురాళ్ల, జనవరి 11 ప్రభాతవార్త:



బ్రిటీష్ వారిని గడగడలాండించిన వీరుడు వడ్డే ఓబన్న అని కూటమి నేతలు కొనియాడారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఓబన్న జయంతిని కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 40 లక్షలకు పైగా ఓట్లు ఉన్న వడ్డెరలను ఆర్థికంగా, సామాజికంగా గుర్తించి కార్పోరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా పల్లె పండుగ మినీ గోకులాల ప్రారంభోత్సవాలు

కారంపూడి, జనవరి 11 ప్రభాతవార్త:



కారంపూడి మండలంలో పల్లె పండుగ మినీ గోకులాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని పెద్దకొదమగుండ్ల, గాదెవారిపల్లె, వేపకంపల్లి గ్రామ పంచాయతీల్లో పలు గోకుల షెడ్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో తెదేపా సీనియర్ నాయకులు పంగులూరు అంజయ్య, మాజీ మండల అధ్యక్షులు బోల్నేడి శ్రీనివాసరావు, చప్పిడి రాము, యూత్ నాయకులు జీఎన్ఆర్, కారంపూడి టౌన్ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, యూత్ అధ్యక్షుడు బోల్నేడి కోటి, నరమాలపాడు తెదేపా నాయకుడు మునోగటి సత్యం, అసిస్టెంట్ వైద్యాధికారి బ్రహ్మం, పట్టణ మండల పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సోలార్ ప్లాంటేషన్‌కు అవరోధంగా సైబర్ ప్రకటనలు

కారంపూడి, జనవరి 11 ప్రభాతవార్త:



ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందిస్తున్న సోలార్ ప్లాంటేషన్ విషయంలో ప్రజలతోపాటు విద్యుత్తు సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే విద్యుత్తు వినియోగదారుల అప్లికేషన్ బుక్ చేయడానికి విద్యుత్తు సిబ్బంది వచ్చినప్పుడు మూడు సార్లు ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది. అవగాహన లేని వారు ఓటీపీలు చెప్పడానికి భయపడుతున్నారు. దీనికి కారణంలో సెల్‌ఫోన్ కాలర్‌ట్యూన్‌గా సైబర్ నేరగాళ్లకు ఓటీపీలు చెప్పకండి అంటూ.. అవగాహన కల్పిస్తున్న సందేశం విని ఓటీపీలు చెప్పడానికి వెనకడుగు వేస్తున్నారు. దీంతో కారంపూడి మండలంలో సోలార్ పలకల బిగింపు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. వినియోగదారులు సరిగా సహకరించడం లేదని విద్యుత్తు సిబ్బంది వాపోతున్నారు. ఈ సమస్య కారంపూడి మండలంలోనే కాక మాచర్ల డివిజన్ మొత్తం నెలకొంది. దీనికి తగ్గట్టుగా సర్వర్లు సరిగా పనిచేయకపోవడం మరొక కారణంగా పరిణమించింది. వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ విద్యుత్తు పలకలు బిగిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి సర్వర్‌లో లోపాలు లేకుండా పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని, అలాగే గ్రామాల్లో సోలార్ ప్లాంటేషన్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తే త్వరితగతిన లక్ష్యాలను చేరుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## మంత్రి నారా లోకేష్ సహకారంతో భక్తులకు ప్రసాదాల పంపిణీ

మంగళగిరి,జనవరి 11,ప్రభాతవార్త



ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని మంగళగిరిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద ఉత్తర ద్వారదర్శనానికి వచ్చిన భక్తులకు మంత్రి నారా లోకేష్ సహకారంతో టిడిపి నాయకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామి దర్శనానికి వచ్చిన 10వేల మంది భక్తులకు ప్రసాదాలు పంపిణీచేశారు.మంత్రి నారా లోకేష్ సహకారంతో ప్రతి ఏటా భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్నారు.అదేవిధంగా ఈ ఏడాది కూడా ప్రసాదాలు పంపిణీచేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య మాట్లాడుతూ కూటమి పాలనలోనే ఆలయాలు పూర్వవైభవం సంతరించుకుంటున్నాయని అన్నారు.చరిత్రలో నిలిచిపోయేలా శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి మంత్రి నారా లోకేష్ ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ప్రసాదాలు పంపిణీ చేసిన వారిలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి,పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు,అబ్దుల్ మజీద్,జొన్నాదుల బాలకృష్ణ,తాడిబోయిన వెంకటేశ్వరరావు,కాటాబత్తుల నిర్మల,సారమేకల గంగాధర్‌రావు,తోట శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నృసింహుని ఉత్తరద్వార దర్శనం

మంగళగిరి,జనవరి 11,ప్రభాతవార్త :



పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి ఉత్తరద్వార దర్శన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారు జామున ఉత్తరద్వార దర్శనం శ్రీలక్ష్మీ నరసింహా స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.గోవిందా గోవిందా అంటూ భక్తులు పలికిన నామస్మరణతో మంగళగిరి పరిసరాలు మారుమోగాయి.భక్తులు భారీగా హజరై శంకుతీర్థం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు.శ్రీస్వామివారిని దర్శించుకునేందుకు మంగళగిరి చుట్టుపక్కల ప్రాంతాల వారు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ స్థాయిలో భక్తులు పాల్గొని శ్రీస్వామివారి దర్శనాన్ని చేసుకొని శంకుతీర్థం స్వీకరించారు.

## నేడు కాకతీయ స్టూడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ

**గుంటూరు విద్య,జనవరి 11,ప్రభాతవార్త :**
ప్రభుత్వ సహాయం పొందని పేద ప్రతిభ కలిగిన అన్ని సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నతవిద్యకు కొంతవరకైనా సహాయ పడాలనే సామాజిక స్పృహతో శ్రీకాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ 2003లో ప్రారంభించడం జరిగిందని,12వ తేది ఉదయం 10గంటలకు కెవిప్పీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.బసవపున్నయ్య తెలిపారు.విలేకరుల సమావేశంలో పలువురు దాతలు,సొసైటీ నిర్వాహకులు మాట్లాడారు.సంస్థ స్థాపకుల్లో అమెరికాలో స్థిరపడిన జాస్తి వేంకటేశ్వర్లు,,డాక్టర్ కొల్లి రాధాకృష్ణమూర్తి,కొడాలి రాజ వీరయ్య,బొప్పన ద్వారకా ప్రసాద్,కెనడాలో స్థిరపడిన డాక్టర్ పుట్టగుంట వేణుగోపాలరావు,డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య,డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ,డాక్టర్ కొండబోలు వరప్రసాద్,కృష్ణప్రసాద్,డాక్టర్ యడ్లపల్లి లక్ష్మణస్వామి,పారిశ్రామికవేత్తలు,కర్నాటి వెంకటేశ్వర్లు,నాట్కో ఫార్మా ముఖ్యదాతలుగా వారి ప్రోత్సాహంతో అమెరికా లో స్థిరపడిన మరికొంతమంది ఆంధ్రులు,గుంటూరు పరిసరాల్లో ఉన్న ప్రముఖులు ఉదారంగా చేసిన,చేస్తున్న ధనసాయంతో పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేత గత 21సంవత్సరాలుగా నిర్విరామంగా జరుగుతూ ఉందని తెలిపారు.ఈ స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు,గౌరవాతిధి బొప్పన ద్వారకా ప్రసాద్,ప్రత్యేక అతిధిగా టిటిడి బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావులు హాజరుకానున్నారని వెల్లడించారు.దాదాపు 300మంది విద్యార్థులకు రూ.50లక్షలు సా ్కలర్‌షిప్పలను చెక్కుల రూపంలో అందించడం జరుగుతుందని తెలిపారు.

## జిజిహెచ్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ షేక్ నాగూర్ భాషా

**గుంటూరు విద్య,జనవరి 11,ప్రభాతవార్త :**
నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు గ్యాస్ట్రోఎంటరాలజీలో నిపుణులైన డాక్టర్ షేక్ నాగూర్‌భాషా గుంటూరు జిజిహెచ్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు.డాక్టర్ నాగూర్‌భాషా 2007లో ఎన్నార్ై మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ డిగ్రీ పూర్తి చేసి,2013లో కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఎండి జనరల్ మెడిసిన్ పూర్తిచేశారు.2016లో విశాఖపట్టణంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి డిఎం గ్యాస్ట్రో ఎంటరాలజీ పూర్తి చేసి 2020లో జిజిహెచ్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు.ప్రస్తుతం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.

## కంచికచర్లలో ఘనంగా వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలు...

**కంచికచర్ల జనవరి 11 ప్రభాతవార్త:**
తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 218 జయంతి వేడుకలను పురస్కరించుకుని కంచికచర్లలోని వడ్డే ఓలన్న విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కుల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ ఓర్సు నరసింహారావు మాజీ ఎంపిటీసీ ఒంటిపులి ప్రసాద్, మాజీ వార్డ్ మెంబర్ వల్లేపు శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ వడ్డెర ఓబన్న జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం శుభపరిమాణం అని, ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా వడ్డెర కుల చిరకాల పోరాటం, కోరిక అయినటువంటి ఎస్టీ రిజర్వేషన్ డిమాండ్‌ను ఎన్డీఏ కూటమి, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి మా వడ్డెర కులాన్ని ఎస్టి జాబితాలో చేర్చాలని అదేవిధంగా వడ్డేర్ల ను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను కోరుకుంటున్నాం అన్నారు. నందిగామ నియోజకవర్గ వడ్డేర్లకు వడ్డే ఓబన్న జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతల చంద్రకళ ఉప్పతళ్ళ అప్పారావు ఓర్సు రాజేష్, వేముల గురవయ్య ఒంటిపులి బాబు, ఉప్పతల్ల నరసింహారావు పదిర్ల శివాజీ, చింతల జమలయ్య అచ్చి గోపి, తదితరులు పాల్గొన్నారు.

## గంగిరెద్దుల పలకరింపుతో ఊరంతా సందడి

**పెదకూరపాడు, జనవరి 11 ప్రభాతవార్త :**

సంక్రాంతి పండుగ నెలపెట్టిందంటే ఊరూరా దూడా బసవన్నల నృత్యాలతో ఇంటి ముంగిట రంగవల్లులు కనువిందు చేస్తాయి. గంగిరెద్దుల పలకరింపుతో ఊరంతా సందడి నెలకొంటుంది. ఈ ఆనందాన్ని కుటుంబసమేతంగా తిలకించి వారు పెట్టే పిడికెడు గింజలతో పొట్ట నింపుకొని దేశ సంచారం చేస్తారు.

## సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతి

**సత్తెనపల్లి, జనవరి 11 ప్రభాతవార్త**
సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం మేనేజర్ సాంబశివరావు మాట్లాడుతూ వడ్డే ఓబన్న దేశం కోసం, సమాజం కోసం చేసిన సేవలు, పోరాటాలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో బత్తుల వెంకటస్వామి, కె.వీరాంజనేయులు, విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, పల్లపు ధర్మారావు, చల్లా శ్రీనివాసరావు, వేముల వరప్రసాదరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## పండుగను సాంప్రదాయంగా జరుపుకోండి

### - కోడి పందాలు నిర్వహిస్తే కఠినచర్యలు : సి.ఐ.

**అమరావతి, (క్రోసూరు) జనవరి 11 ప్రభాతవార్త :**

సంక్రాంతి పండుగను ఆనందంగా, సరదాగా గడుపుకోవాలని సి.ఐ. పత్తిపాటి సురేష్ అన్నారు. సాంప్రదాయంగా జరుపుకునే పండుగను కోడిపందాల వ్యసనంతో యువత చెడు దోవ పట్టవద్దన్నారు. ప్రతి గ్రామంలో సి.సి.కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. నిబంధనలకు అనుగుణంగానే పండుగ వాతావరణం ఉండాలన్నారు. గ్రామాలలో రహస్యంగా కోడి పందాలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సి.ఐ. సురేష్ కోరారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎలాంటి అనుమతులు లేవని, ప్రజలు పండుగను ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక గ్రామ నాయకులు, మండల నాయకులతో చర్చించారు.

## మహా సామ్రాజ్య పట్టాభిషేకం

**గుంటూరు కల్చరల్,జనవరి 11,ప్రభాతవార్త**

శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్స వాలు పూర్ణాహుతి,శ్రీరామ కళ్యాణ మహోత్సవం స్థానిక మారుతీనగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న శ్రీరామ సేవా సమితి వారణాసి,శ్రీమారుతీ దేవాలయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు మహా సామ్రాజ్య పట్టాభిషేకం సంబంధించిన పారాయణంలో అన్నిటికి కలిపి పూర్వంగా నిర్వహించిన అన్నింటికి పారాయణలకు మహాహోమ పూర్ణాహుతి నిర్వహించడం జరిగింది.సాయంత్రం 5.30గంటల నుండి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరిగింది.అలాగే మధ్యాహ్నం పాల్గొన్నదారులకు దేవాలయ సంఘ పక్షాన సత్కారం చేయటం జరిగింది.రేపు ఉదయం 7గంటల నుంచి శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం మహోత్సవం జరుగును కార్యక్రమాలను శ్రీరామ సేవా సమితి నిర్వాహకులు డాక్టర్ యు.వి.సోమయాజులు ఆధ్వర్యంలో ఈ పూర్ణాహుతి నిర్వహించారు.కార్యక్రమాలను కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

## అవగాహన...లో సంక్రాంతి వేడుకలు ప్రారంభం

**గుంటూరు కల్చరల్,జనవరి 11,ప్రభాతవార్త**

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేట లోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం ఉదయం సంక్రాంతి వేడుకలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.ఈ వేడుకలను ప్రముఖ నాటక రచయిత, దర్శకుడు, నటుడు కావూరి సత్యనారాయణ ప్రారంభిస్తూ కాలాన్ననుసరించి,ప్రకృతి ననుసరించి,సందర్భాన్న నుసరించి సం ప్రదాయాన్ననుసరించి ఎన్నో శిష్ట తల ను సంతరించుకున్న పండుగ సంక్రాంతి అన్నారు.తెలుగువారందరూ ఇంటిల్లిపాది ఒకచోట చేరి జరుపుకునే ఈ పండుగను అవగాహన సంస్థ సభ్యులందర్నీ ఒకచోటకు చేర్చి జరపటం గొప్ప విషయ మన్నారు.రంగస్థలనటుడు పల్నాటి సుబ్బారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటేనే సంతో షాల,వినోదాల పండుగన్నారు.అవగాహన సాంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ బిళ్ళాఅశోక్ సార ధ్యంలో గాయకురాలు యార్లగడ్డ లక్ష్మీ అధ్యక్షతన జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నజీర్,సాయి బాబు,పరమేశ ్వరీ,బాబురావు,రత్నా ్జజీ,భాగ్యలక్ష్మీ,రామకృష్ణారెడ్డి,ఎల్.నరసింహారావు,శివకోటేశ్వరరావు,హనిమిరెడ్డి తదితరులు పాటలు,పద్యాలు,కవితలు,జోక్స్‌తో అందర్నీ అలరించారు.సంక్రాంతి కవితలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన ధీరుడు ఓబన్న

**గుంటూరు విద్య,జనవరి 11,ప్రభాతవార్త :**
తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన ధీరుడు,మన రేనాటి వీరుడు,వడ్డెర ముద్దుబిడ్డ,స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న అని ఎన్టీయు రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు పేర్కొన్నారు.వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా శాఖా గ్రంధాలయంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిఘనంగా నివాళులర్పించారు.

## రాగ ద్వేషాలకతీతంగా జీవనాన్ని గడపాలి : సిపి

### - మీడియా ప్రతినిధులకు హెల్మెట్‌లను పంపిణీ చేసిన సిపి రాజశేఖరబాబు

**విజయవాడ క్రైం,జనవరి 11,ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరు బేధాభిప్రాయం లేకుండా మనం బాగుండాలి మనతో పాటు అందరూ బాగుండాలనే సూక్తితో కల్మషం లేకుండా రాగతద్వేషాలకతీతంగా జీవనాన్ని గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. శనివారం నైతృత్వంలో పోలీస్ అధికారులు,సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్ నందు సంక్రాంతి సంబరాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ పెరేడ్ మైదానం నందు భోగిమంటలు,గంగిరెద్దులు,ముత్యాల గొబ్బెమ్మలు,ముగ్గుల రంగవల్లులతో గ్రామం లాగా తయారై కర్రసాము,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ పోలీసు మైదానాని ్న ఊస్తే సంక్రాంతి సంబరాలకు ఒక గ్రామానికి వచ్చినట్లు అనిపిస్తోందని ఎటు చూసినా భోగిమంటలు,గంగిరెద్దులు,ముత్యాల గొబ్బెమ్మలు,ముగ్గుల రంగవల్లులు,సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరు బేధాభిప్రాయం లేకుండా మనం బాగుండాలి మనతో అందరూ బాగుండాలనే సూక్తితో కల్మషం లేకుండా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.ట్రాఫిక్‌లో హెల్మెట్ వాడకంపై నగరంలో పలు అవగాహనా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, ప్రజల్లో హెల్మెట్‌పై అవగాహన బాగా పెరిగిందన్నారు. మీడియా కథనాలు కూడ ప్రజల్లో బాగా చైతన్యం తీసుకొచ్చాయన్నారు. బెంజి సర్కిల్ వద్ద డ్రోన్ ఎఐటూల్‌ను ఉపయోగించి 17 నిముషాల పాటు పరిశీలించగా మొత్తం 1193 మోటారు వాహనాలు బెంజి సర్కిల్ మీదుగా ప్రయాణించటగా వాటిల్లో హెల్మెట్ పెట్టుకొని 1004 మంది ప్రయాణించారరన్నారు. యావరేజ్‌గా 84.2 శాతం మంది హెల్మెట్‌పై అవగాహన కలిగి హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్నారన్నారు. శుక్రవారం కేవలం హెల్మెట్ పెట్టుకోక పోవడం వల్ల రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడని,సంక్రాంతి పండగ నుండి అయినా ప్రతి ఒక్కరూ పూర్తిగా హెల్మెట్‌ను వాడాలని కోరుకుంటున్నానన్నారు. ప్రమాదంలో మరణాల సంఖ్య తగ్గించాలనేది తమ లక్ష్యమన్నారు. కుటుంబ సభ్యులను గుర్తు చేసుకొని నిబంధనలు పాటించమని, డ్రోన్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామన్నారు.పోలీసు సిబ్బంది అందరికీ హెల్మెట్ వాడాలని తెలియచేశామన్నారు. ఎవరైనా వాడకపోతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మీడియా వారు కూడ భాధ్యతగా హెల్మెట్‌లు వాడాలని విజ్ఞప్తి చేశారు. మీడియా ప్రతినిధులకు హెల్మెట్‌ను ఆయన తన చేతుల మీదుగా బహూకరించారు. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేస్తున్నామని,పండుగ పేరుతో బెట్టింగులు కోడిపందాలు ఆడవద్దని, ఇటీవల కోడిపందాల బరులను పూర్తిగా తొలగించామన్నారు. సంక్రాంతిని సరదాగా జరుపుకోమని బెట్టింగులు,కోడిపందాలు ఆడకుండా సాంప్రదాయ క్రీడలను ఆడుతూ ఆహ్లాదంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందించమన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించి పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేసారు. కార్యక్రమంలో డిసిపిలు గౌతమి షాలి,తిరుమలేశ్వరరెడ్డి,కృష్ణమూర్తి నాయుడు,ఎస్‌విడి ప్రసాద్,ట్రైనీ ఐపిఎస్ మనీషా, ఏడిసిపిలు ఎవిఎల్ ప్రసన్నకుమార్,ఎం.రాజారావు,కె.కోటేశ్వరరావు,ఎఆర్ ఎసిపి డి.ప్రసాదరావు, ఏసిపిలు,ట్రాఫిక్ సిఐలు,ఆర్‌ఐలు,అధికారులు,సిబ్బంది,వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అమృతలూరు వైకాపా మండల అధ్యక్షులుగా హేమచంద్రశ్రీనివాస్


**అమృతలూరు, జనవరి 11, ప్రభాతవార్త:**
వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అమృతలూరు మండల అధ్యక్షునిగా ప్యాపర్రు గ్రామానికి చెందిన వైయస్ఆర్‌సిపి నాయకులు, ప్రస్తుత గ్రామ సర్పంచ్ గడ్డిపాటి హేమచంద్ర శ్రీనివాస్(వాసు) నియమితులయ్యారు. మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు ద్వారా హేమచంద్ర శ్రీనివాస్ నియమితులయ్యారు. వైకాపా మండలాధ్యక్షునిగా నియమితులైన హేమచంద్ర శ్రీనివాస్‌కు వైయస్ఆర్‌సిపి నాయకులు అచ్చన చంద్రశేఖరరావు, గేరా ప్రతాప్, ముకిరి సాంబశివరావు, మానుకొండ నాయుడమ్మ, అమితే రత్నాకర్, తురుమెళ్ల గిరి, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు

### మృతురాలు కుటుంబానికి భానుగంగాధర్ ఆర్థిక సహాయం

అమృతలూరు జనవరి 11, ప్రభాత వార్త: మండల పరిధిలోని మూల్పూరు గ్రామం దళితవాడకు చెందిన కొండూరు రత్తమ్మ కుటుంబానికి టిడిపి నాయకులు, అమృతలూరు తేదేపా మాజీ మండలాధ్యక్షుడు గొట్టిపాటి భానుగంగాధర్ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కొండూరు రత్తమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. రత్తమ్మ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు కారణంగా వారికి ఈ సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆంగ్లేయులతో వీరోచితంగా పోరాడిన మహావీరుడు వడ్డే ఓబన్న

### - మాజీ ఎమ్మెల్యే మక్కెన

**వినుకొండ,జనవరి11,ప్రభాతవార్త:**

స్వతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. తెదేపా నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్థానిక నర్సరావుపేట రోడ్డులోని ఓబన్న విగ్రహానికి ప ్రాలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మకె ్కన మాట్లాడుతూ బ్రిటీషర్లపై వీరోచితంగా పోరాడిన మహావీరుడు ఓబన్న జయంతి నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో విగ్రహకమిటీ సభ్యులు పల్లవు వెంకటేశ్వర్లు, తెదేపానాయకులు సౌదాగర్‌జానీ, బత్తుల నరసింహారావు, బాలరాజు, దేవల ప్రసాద్, పల్లపు పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌యు మహిళా క్రికెట్ జట్టుకు ధనలక్ష్మి కాలేజి విద్యార్థి ఎంపిక

**ఈపూరు,జనవరి11,ప్రభాతవార్త:**
ఆచార్య నాగార్జున యూనివర్శిటి ప్రాంగణంలో సాధన డిగ్రీ కాలేజి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల క్రికెట్ అంతర కళాశాలల పోటీల్లో మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కాలేజికి చెందిన ఎంపీఈడి మొదటి సంవత్సరం విద్యార్థి ఎం. రాజేశ్వరి సత్తా చాటి యూనివర్శిటి జట్టుకు ఎంపికైనట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చుండు వెంకటరావు, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు అభినందంచారు.

## పల్లెకు పోదాం చలో చలో...

**నందిగామ జనవరి 11 ప్రభాతవార్త:**
సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణ ప్రాంతం నుండి సొంత గ్రామాలకి సంక్రాంతి జరుపుకోవటానికి సొంత గ్రామాలకు విచ్చేస్తున్న ప్రయాణికులకు ఏ రకమైనటువంటి ఇబ్బంది కలుగకుండా రహదారి భద్రతలో భాగంగా ఏ ప్రయాణికుడికి అసౌకర్యం కలగకుండా నందిగామ పట్టణం చందాపురం గ్రామం వెళ్లే రహదారిని దగ్గర ఉండి రహదారి మరమ్మత్తులు చేయిస్తూ హెచ్ 9 రహదారిపైన ఏ ప్రయాణికుడికి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ ని నియంత్రణ చేస్తున్న నందిగామ సీఐ వైవి ఎల్ నాయుడు మరియూ నందిగామ ట్రాఫిక్ సిబ్బంది.


## లింగాలపాడు ఐసిడిఎస్ నందు సంక్రాంతి సంబరాలు...

**నందిగామ జనవరి 11 ప్రభాతవార్త:**
నందిగామ మండలం లింగాలపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టుపరిధిలోని అంగన్వాడి కేంద్రంలో సిడిపిఓ భాగ్య రేణుక ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా భోగి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు భోగి పండ్లు పోశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వెంకట్రావమ్మా అంగనవాడి టీచర్ శ్రీలక్ష్మి, మమత కుమారి రత్నమాల పాల్గొన్నారు.

## పలు ఆలయాల్లో ధనుర్మాసం మహోత్సవాలు...

**నందిగామ జనవరి 11 ప్రభాతవార్త:**
నందిగామ మండలంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో ధనుర్మాసంమహోత్స వాల్లో భాగంగా శనివారం కూడా రవల్లి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీతారామంజనేయ స్వామి దేవాలయంలో ఆండాళ్ గోష్టి సభ్యుల ఆధ్వర్యంలో గోదా సమేత శ్రీ కృష్ణమూర్తి స్వామివారికి విశేష అర్చనలు భగవత్ రామానుజ స్వామి వారి పల్లకి సేవ 108 వెండి గంగాళాలలో పాయసాన్ని స్వామివారికి ఆలయ అర్చక స్వాములు దివి వెంకట రత్నమాచార్యులు వైఖానస సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఆండాళ్ గోష్టి సభ్యులు తిరుప్పావై పారాయణం భక్తి గేయాలు ఆలపించారు. దేవాలయాలు హరినామ సంకీర్తనతో మారుమోగాయి.

## ప్రపంచంలోనే తొలిసారిగా 286 కిమి దూరంలో రోబోటిక్ కార్డియాక్ సర్జరి

**విజయవాడ, జనవరి 11, ప్రభాతవార్త**

మనదేశంలో తొలిసారిగా స్వదేశీ సర్జికల్ రోబోటిక్ టెక్నాలజి డెవలపర్ ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ కేవలం రెండు రోజుల్లో రెండు ప్రపంచ మొదటి రోబోటిక్ కార్డియాక్ టెలిసర్జరీలు విజయవంతంగా నిర్వహించినట్లు సంస్థ ప్రతినిథులు తెలిపారు. గురుగ్రాం లోని సంస్థ ప్రధాన కార్యాలయాన్ని రాజస్థాన్లోని జైపూర్‌లోని మణిపాల్ ఆసుపత్రిలో 286 కిమి దూరం అనుసంధానం చేసి, విజయవాడ మణిపాల్ హాస్పటల్స్ డాక్టర్స్ కొందరు ఆన్‌లైన్ సర్జరీలో పాల్గొని విజయవంతం చేశారు.

## గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

**రేపల్లె(నిజాంపట్నం), జనవరి 11, ప్రభాతవార్త:**

గ్రామాలలోని ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పల్లెపండుగ వారోత్స వాలలో భాగంగా మండలం లోని కామరాజుగడ్డ నార్త్‌లో సిమెంట్ రహదారిని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శోభారాణి, పంచాయితీరాజ్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పంచాయితీ కార్యదర్శి, విఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

## 700లీటర్ల బెల్లంఊట ద్వంసం

**నగరం(నిజాంపట్నం), జనవరి 11, ప్రభాతవార్త:**

నాటుసారా బట్టీలపై, నాటుసారా తయారు చేసేందుకు నిల్వ ఉంచిన బెల్లంఊట స్థావరాలపై దాడులు చేసి 700 లీటర్ల బెల్లంఊట ద్వంసం చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నగరం సిఐ శ్రీరాంప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిజాంపట్నం మండలం దిండి అదవల, పరిశావారిపాలెం, యేమినేని వారిపాలెం గ్రామ పరిసర ప్రాంతాలలోని మడ అడవులలో దాడులు చేశామన్నారు. నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన 700 లీటర్ల బెల్లంఊట ద్వంసం చేశామని, నాటుసారా కాయకుండా బట్టీలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. నాటుసారా తయారీ , రవాణా, నిల్వ , విక్రయాలు, కలిగి ఉండటం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరెడ్డి, మధుసూధనరావు, వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

## నిజాంపట్నంలో ఘనంగా మంత్రి అనగాని జన్మదిన వేడుకలు

**నిజాంపట్నం, జనవరి 11, ప్రభాతవార్త:**

రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రమైన నిజాంపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య, మాజీ మండలాధ్యక్షురాలు నర్రా నాగమణి తన అనుచరులతో అనగాని పుట్టినరోజు వేడుకలను ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. బాణాసంచాకాల్చుతూ నిజాంపట్నం పురవీధులలో ర్యాలీ నిర్వహిస్తూ రేపల్లెకు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం, దిండి, ఆముదాలపల్లి తదితర ప్రాంతాల తెదెపా నాయకులు, అనగాని అభిమానలు పాల్గొన్నారు.

## అనుమతులు ఒక చోట ప్రయాణం మరోచోట

**అమరావతి, జనవరి 11, ప్రభాతవార్త**

కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ధరణికోట పరిధిలో అనుమతులు తీసుకొని అమరావతిలో చెవిటికల్లు రూటుకి పడవ నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. నవంబర్ 14న టెండర్లు దక్కించుకున్న వారు ఒకరు, ప్రస్తుతం పడవ నడుపుతున్న వారు మరొకరని స్థానిక ప్రజలు తెలిపారు. అనుమతులు లేకుండా వేరే ప్రదేశంలో నదిలో పడవ నడుపుతూ ప్రయాణికులు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరారు.జెడ్పీసీఈవో సమక్షంలో 70 వేలకు టెండర్ దక్కించుకున్న వారిని బెదిరించి మరొకరు నదిపై పడవను నడుపుతున్నారని స్థానికులు గుస గుసలాడుతున్నారు. టెండర్‌లో అనుమతి పొందిన చోటనే పడవని నడపాలని ప్రజలు కోరుతున్నారు.

## షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

**సత్తెనపల్లి, జనవరి 11 ప్రభాతవార్త :**

నియోజకవర్గ స్థాయి షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలను శనివారం మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఎల్లినేడి రామస్వామి, డి.ఎన్.ఆర్.ఫౌండేషన్ ఛైర్మన్ దరువూరి నాగేశ్వరరావులు ప్రారంభించారు. పోటీల అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు రూ.15 వేలు, రూ.7,116లు, రూ.3500లు అందజేశారు. అన ంతరం వారు మాట్లాడుతూ నగదు బహుమతులను దరువూరి నాగేశ్వరరావు, ఎం.వెంకట హనుమంతరావు, గుర్రం శివకోటిరెడ్డిలు అందజేశారన్నారు. సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలను తెలియజేశారు. ఆటల పోటీలు యువతకు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలుగజేస్తాయని వక్తలు తెలియజేశారు.

## అనుమతులు లేకుండా కోడిపందాలు ఆటకు సన్నాహాలు

**అమరావతి, జనవరి 11 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని లేమల్లె గ్రామ శివారులో అనుమతులు లేకుండా కోడిపందాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు తెలిపారు. ఎస్పీ ఆదేశాలు బేఖాతరు చేస్తూ స్థానిక నేతలు పందాలు నిర్వహించేందుకు భారీ గేట్లు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రెవిన్యూ అధికారుల కానీ, పోలీస్ యంత్రాంగం గాని అటువైపు కన్నెత్తిచూడలేదని ప్రజలు అంటున్నారు. పండుగ సరదా వాతావరణంలో జరుపుకోవాలని కోడిపందాలు నిర్వహిస్తూ కత్తి కట్టి వాటి ప్రాణాలు తీసేలా ఆటలు ఆడరాదని జంతు ప్రేమికులు అన్నారు. ఈ విషయమై అధికారులు స్పందించాలని స్థానిక ప్రజలు కోరారు.

## వడ్డే ఓబన్నకు ఎమ్మెల్యే కన్నా నివాళి

**సత్తెనపల్లి, జనవరి 11 ప్రభాతవార్త :**

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం గుంటూరు పట్టణంలో వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ వడ్డే ఓబన్న పోరాటయోధుడు అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన స్వాతంత్ర్య పోరాటంలో ఆయన సైన్యాధ్యక్షునిగా ఓబన్న వీరోచిత పోరాటం చేశారన్నారు. అటువంటి పోరాట యోధుని జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు

**సత్తెనపల్లి, జనవరి 11 ప్రభాతవార్త**

పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూరిగాయి. ధనుర్మాస పూజలలో భాగంగా శ్రీవారికి రోహిణి నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని విశేషలంకరణ చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

## దద్దనాల సత్యనారాయణ మృతి బాధాకరం

### - సంతాపసభలో రక్షణనిధి నివాళి

**ఎ కొండూరు, జనవరి 22, ప్రభాత'వార్త' :**

ఎన్‌టిఆర్ జిల్లా రామచంద్రాపురం గ్రామంలో తిరువూరు మాజీ ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి పి.ఎస్. దద్దనాల రామకృష్ణ సోదరుడు సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రామచంద్రాపురంలో శనివారం జరిగిన సత్యనారాయణ సంతాప సభలో మాజీ ఎంఎల్‌ఏ రక్షణనిధి పాల్గొని మాట్లాడుతూ చిన్నవయస్సులోనే క్యాన్సర్ వ్యాధితో మృతి చెందటం బాధాకరమని, స్వర్గీయ సత్యనారాయణ కుటుంభానికి, మాజీ పి.ఎస్. రాంబాబును, రామకృష్ణను మాజీ ఎంఎల ఎ రక్షణనిధి ఓదార్చారు. స్వర్గీయ సత్యనారాయణ చిత్రపటానికి మాజీ ఎంఎల్ఎ రక్షణనిధి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## రైతు సంతోషంగా ఉంటేనే దేశం బాగుంటుంది : ప్రత్తిపాటి

**యడ్లపాడు, జనవరి 11, (ప్రభాతవార్త)**



రైతులతొలి పండుగ సంక్రాంతి అని, అటువంటి పండగ వేళ అన్నదాత లోగిళ్ల కళకళలాడాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో 2.30లక్షలతో నిర్మించిన మిని గోకులం షెడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రైతు సంతోషంగా ఉంటేనే దేశం బాగుంటుందని, ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా పుట్టిన ఊరిని కన్నతల్లిని, అన్నంపెట్టే అన్నదాతను ఎప్పటికీ మరువకూడదని అన్నారు. గోకులం షెడ్డులను రైతులు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వ ఆలోచనలు సఫలీకృతం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, నాయకులు కామినేని సాయిబాబు, పి. శ్రీనివాసరావు, పి. పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## మిట్టపల్లిలో ఘనంగా సంక్రాంతి సంబరాల నిర్వహణ

**యడ్లపాడు, జనవరి 11, (ప్రభాతవార్త) :**



మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలో ఉన్న మిట్టపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులకు రంగవల్లి పోటీలు, క్రీడలు, బోగిమంటలు, పండుగను గుర్తుచేసేవిధంగా గాలిపటాలు ఎగరవేసి సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ గోపి కృష్ణ, సెక్రటరీ ఎమ్‌బివి సత్యనారాయణ పాల్గొని పండుగ విశిష్టతను వివరించి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి జి రాజకుమార్ పర్యవేక్షించారు.

## ఒయాసిస్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం

**చిలకలూరిపేట,జనవరి11,(ప్రభాతవార్త):**



ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కెజె ఆసుపత్రి ఆవరణలో శనివారం ఓమేగా హస్పటల్ వారి సహకారంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో లక్షరూపాయిలు విలువచేసే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, స్త్రీలకు రొమ్ము క్యాన్సర్, మెమోగ్రామ్ పరీక్షలు, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ (స్క్రీనింగ్ ), పరీక్షలు, బిపి,షుగర్, ఇసిజి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ క్యాన్సర్ అంటే ప్రజలలో భయం ఏర్పడుతుందని, రాకుండా నివారణ ఎలా అనేది తెలుసుకోవాలని అన్నారు. ఈ వైద్యశిబిరంలో ప్యాప్స్మియర్ పరీక్ష చేసి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందో తెలుస్తుందని అన్నారు. దీనిద్వారా క్యాన్సర్ రాకుండా నివారించుకోవచ్చునని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జయకర్సింగ్ హోం చైర్మన్ డాక్టర్ ముద్దన రమేష్‌బాబును సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ శిబిరంలో ప్రముఖ రేడియేషనల్ అంకాలజిస్ట్ డాక్టర్ గీతా రుక్మిణి, సంస్థ ప్రధాన కార్యదర్శి కరణం విజయలక్ష్మి, పెథాలజిస్ట్ వి రాధిక, డాక్టర్ శుభశ్రీ, సెల్వినాభాను, ఓమేగా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఛార్లెస్ హైస్కూల్ ఎంతో చరిత్రగలిగినటువంటి విద్యాసంస్థ : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,జనవరి11,(ప్రభాతవార్త):**



పట్టణంలో పెదనందిపాడు రోడ్‌లో ఉన్న సెయింట్ ఛార్లెస్ హైస్కూల్ ఎంతో చరిత్రకలిగిన విద్యాసంస్థ అని ఈ పాఠశాలలో చదివిన ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజలు ఈ రోజున దేశ,విదేశాలలో ఉన్నతమైన స్థానాలలో ఉన్నారని ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఉపాధ్యాయులు చదువుతోపాటు విద్యార్థులకు క్రమశిక్షణలో ఉండే మంచి, చెడులను తెలియచేయాలని అన్నారు. ఇంగ్లీష్, మన బాష తెలుగులపై మంచి పట్టు సాధించాలని, తల్లిదండ్రులను మీ పట్ల కన్నకలలు మీరు నెరవేర్చాలని, మీరు పుట్టిన గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తెచ్చే విధంగా విద్యార్థినీ,విద్యార్థులు ఎదగాలని ప్రత్తిపాటి తెలియచేశారు. భావితరాల భవిష్యత్ గురించి ఆలోచించే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు మనకు ఉండటం ఎంతో ఆనందమని, విద్యారంగంలో మంత్రి లోకేష్ ఎన్నో మార్పులు తీసుకువస్తున్నారని, వీరికి తోడుగా పవన్‌కళ్యాణ్ ఉండటం మన అదృష్టమని అన్నారు. వీరి ముగ్గురి పాలనలో మన రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని అన్నారు. గత 58 సంవత్సరాలుగా వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

## సియం నారా చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన రావు సుబ్రహ్మణ్యం

**చిలకలూరిపేట,జనవరి11,(ప్రభాతవార్త):**



ఇటీవల తిరుపతిలో జరిగిన దుర్ఘటన విషయంలో మృతుల కుటుంబాలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు నవరతం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలియచేశారు. శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిసిన రావు సుబ్రహ్మణ్యం మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు ఉద్యోగాలు ఇచ్చేందుకు తీసుకున్న నిర్ణయం పట్ల ఆయనకు అభినందనలు తెలియచేశారు. ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తేవాలని, పరిష్కారం చూపేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా రావు సుబ్రహ్మణ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించినట్లు ఆయన తెలిపారు.

## అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు : అర్బన్ సిఐ పి రమేష్

**చిలకలూరిపేట,జనవరి11,(ప్రభాతవార్త):**



సంక్రాంతి పర్వదినం సందర్భంగా కోడిపందేల నిర్వహణ, మత్తుపదార్థాల రవాణా, అక్రమ మద్యం అమ్మకాలు తదితర అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సిఐ పి రమేష్ హెచ్చరించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సెలవులకు విహార యాత్రలకు, బంధువుల ఇళ్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారమివ్వాలని తెలిపారు. అసాంఘిక చర్యల సమాచారం ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహించేవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుక

**చిలకలూరిపేట,జనవరి11,(ప్రభాతవార్త):**

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం పట్ల ఆంధ్రప్రదేశ్ సమైక్య వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పల్లపు శివయ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు అభినందనలు తెలియచేశారు. శనివారం రైతు బజార్‌వద్ద వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గుంజి వెంకటేశ్వర్లు, కుందాల నాగేశ్వరరావు, వేముల శ్రీనివాస్, బత్తుల వెంకటరమణ, తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం వెలకట్టలేనిది : కమిషనర్ శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 11 (ప్రభాతవార్త) :**



స్వాతంత్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం వెలకట్ట లేనిదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన స్వాతంత్ర్య పోరాటంలో ఆయన సైన్యాధ్యక్షునిగా వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం చేశారన్నారు. అటువంటి మహనీయుని జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ స్వాతంత్ర్యపోరాటంలో నల్లమల అడవుల్లో జరిగిన కుంఫిని వ్యతిరేక పోరాటంలో సైన్యాధ్యక్షునిగా ముందుండి సైన్యాన్ని నడిపిన ఓబన్న పోరాట స్ఫూర్తిని నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సిఎంఓహెచ్ డాక్టర్ అమృత, ఎస్ఈ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలపాటి విజయం కూటమి ప్రభుత్వానికి బహుమతి

### - రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

**తెనాలి, జనవరి 11 (ప్రభాతవార్త)**




రాష్ట్ర అభివృద్ధి కోసం ఓ విజన్‌తో ముందుకు వెళుతున్న కూటమి ప్రభుత్వానికి బహుమతిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకోవడం ఎంతైనా అవసరమని, తద్వారా శాసన మండలిలో పట్టభద్రుల ప్రయోజనాలను సాధించుకోవడం సులభతరమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రత్నం ఫార్చ్యూన్ కళ్యాణ మండపంలో శనివారం తెనాలి, వేమూరు నియోజకవర్గాల పట్టభద్రుల సమావేశం ఆద్యంతం పట్టభద్రులైన ఓటర్లతో జోష్ నింపింది. నల్లూరి వెంకటేశ్వరరావు సభకు స్వాగతం పలుకగా, వక్తలు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. సభలో మంత్రి మనోహర్ అధ్యక్ష ఉపన్యాసం చేశారు. కూటమి నాయకులకు ప్రజలు అనూహ్యతీర్పునిచ్చి అధికారంలకి తీసుకువచ్చారని అన్నారు. గత ఆరు నెలల పాలనకు ముందు, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించారని అన్నారు. కూటమి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో మంత్రి మండలి అభి వృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతున్న తరుణంలో, ఎన్నో అంశాలు శాసన సభ ద్వారా శాసన మండలి ద్వారా సుదీర్ఘ చర్చలు జరుగుతాయని, అటువంటి శాసన మండలిలో పట్టభద్రుల సమస్యల సాధకుడుగా, ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమర్థులని, వారిని గెలిపించి, కూటమి ప్రభుత్వానికి బహుమతిగా ఇవ్వాలని, ఇందు కోసం అందరం సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందని మంత్రి మనోహర్ అన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ కూటమి పార్టీల నిర్ణయానికి కట్టుబడి, తెనాలి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను, ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చి జనసేనకు జై కొట్టించి, గతంలో చూడని మెజార్టీతో గెలిపించిన, ఆలపాటి నిస్వార్థ సేవను ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించి, 33 నియోజకవర్గాల పట్టభద్రులకు సేవ చేసే అవకాశం కల్పించారని అన్నారు. ఈ క్రమంల పట్టభద్రుల ఎన్నికను ఏకపక్ష ఎన్నికగా, రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ మాట్లాడుతూ తిరుపతి దుర్ఘటనలో, మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుసరించిన దుర్నీతిని ఎండగట్టారు. పట్టభద్రుల ఎన్నికల్లో, తెనాలి, వేమూరు నియోజకవర్గ పట్టభద్రులు సంఘటితమై, మంచి మెజార్టీ తీసుకు రావడం ద్వారా ఆలపాటి విజయంలో కీలకంగా మారాలని కోరారు. బిజెపి నాయకులు కఠారి వాసుదేవనాయుడు మాట్లాడుతూ ఆలపాటి విజయం కోసం పట్టభద్రుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సంఘటితం కావడం శుభపరిణామం అన్నారు. పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు సభాముఖంగా తమ మద్దతు ప్రకటించారు. గెలుపు నల్లేరుపై నడకైనా, పట్టభద్రుల మద్దతును క్షేత్రస్థాయిలో కూడగట్టుకునే కార్యాచరణలో మరింత ముందుండాలని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆలపాటి విజయం తర్వాత పరిష్కరించాల్సిన సమస్యలలో ప్రధానంగా గ్రూప్ వన్, గ్రూప్ టు అంశాలకు సంబంధించిన సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పదవులు ఉన్న లేకపోయినా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రజల మనిషి, అని అదే తన జీవన విధానం అన్నారు. గత ప్రభుత్వంలో పట్టబద్దులు, ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగులు, నిరుద్యోగ యువత ఎదుర్కొన్న సమస్యలు సామాన్యమైనవి కావని, ఇది జగమెరిగిన సత్యం అన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం, బలమైన కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమన్నారు. శాసన మండలిలో తనవాణి ద్వారా పట్టభద్రుల సమస్యలు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు చిత్తశుద్దితో కృషిచేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచడానికి చేస్తున్న కృషికి, శాసన మండలి ద్వారా మరింత ప్రోత్సాహం అందించేందుకు మంచి ప్రభుత్వానికి మీ మద్దతు అందించాలని కోరారు. పోలింగ్ రోజున ప్రథమ ప్రాధాన్యత ఓటును నెంబర్‌వన్ సంఖ్యను వేసి పట్టభద్రుల ఓటు విలువలు పెంచాలన్నారు. పట్టభద్రుల కు, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. రావి కృష్ణమోహన్ మిత్రబృందం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## గో ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవర్చుకోవాలి

### --తెలంగాణా జిఎస్టీ జాయింట్ కమీషనర్

**తెనాలి, జనవరి 11 (ప్రభాతవార్త) :**



గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు అవగాహన పెంచుకుని, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించాలని తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ జాయింట్ కమీషనర్ ఎడ్ల శ్రీలీల గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సులో రైతులనుద్దేశించి అన్నారు. మండలంలోని కొలకలూరు గ్రామంలో శనివారం శ్రీ భారత్ ఫౌండేషన్ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సును నిర్వహించారు. సుభాష్ పాలేకర్ కృషి విధాన సాధకుడు విజయరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ జాయింట్ కమీషనర్ ఎడ్ల శ్రీలీల ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు రసాయనిక ఎరువులు, క్రిమిసింహారక మందులు వినియోగించే తీరులో, మోతాదు పెరిగి, ఆ ఆహార ఉత్పత్తులు వినియోగించడం ద్వారా అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. ఆరోగ్య వంతమైన గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు అవగాహన పెంచుకుని నాణ్యమైన ఆహార ఉత్పత్తులు పెంచాలన్నారు. సుభాష్ పాలేకర్ కృషి నిర్వాహకులు విజయరామ్ తమ సుదీర్ఘ ఉపన్యాసంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంలో మెళుకువలు వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సేవ్ ఆర్గనైజేషన్, శ్రీభారత్ పౌండేషన్ సంయుక్తంగా సదస్సు ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ గ్రామాల, 600మంది రైతులు పాల్గొన్నారు.

## అణగారిన మహిళల జీవితాలకు అక్షర చుక్కాని సావిత్రిభాయిపూలే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు క్రైమ్,జనవరి 11,ప్రభాతవార్త**





అణగారిన మహిళల జీవితాలకు అక్షర చుక్కాని సావిత్రిభాయి ఫూలే అని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శనివారం జిల్లా టిడిపి కార్యాలయంలో సావిత్రిబాయి ఫూలే జయంతి ఉత్సవాలకు మంత్రి సవిత, ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. తొలుత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు, మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిభాయి ఫూలే విగ్రహాలకు మంత్రి, ఎమ్మెల్యే ఇతర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత సమాజంలో చారిత్రాత్మకమైన మార్పుకోసం సావిత్రిభాయి ఫూలే దంపతులు పునాది వేశారని, మహిళల విద్యకు ప్రాధాన్యం కల్పించారని, అణచివేతకు గురైన వారికి న్యాయం అందించేందుకు తమ జీవితాన్ని అర్పించారని తెలిపారు. మహిళలు వంటింటికే పరిమితం కాకూడదని, వారిని ఉన్నతమైన వ్యక్తులుగా తయారు అవ్వాలన్న లక్ష్యంతో సావిత్రిభాయి శ్రమించారన్నారు. లింగ వివక్ష, కుల అసమానతలపై ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని మహిళలను అక్షరాస్యులను చేయడానికి సావిత్రిబాయి ఫూలే ఎంతోకృషి చేశారని, వంటింటి నుంచి అంతరిక్షం వరకు మహిళలు ఎదిగారంటే అది సావిత్రిబాయి ఫూలే లాంటి మహనీయుల కృషేనని, అటువంటి మహనీయులను మనం ఆదర్శంగా తీసుకొని, సమాజ శ్రేయస్సు కు కృషిచేయాలని ఎమ్మెల్యే మాధవి పిలుపునిచ్చారు.

## ఐలాండ్స్, డివైడర్ల నిర్వహణపై దృష్టి సారించాలి : కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 11 ప్రభాతవార్త**



గుంటూరు నగరంలోని ఐలాండ్స్, డివైడర్ల నిర్వహణపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ శ్రీనివాసులు గాంధీపార్క్ ఎదుట ఐలాండ్, డివైడర్లు, వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఎదుట పింక్ టాయ్‌లెట్స్, పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, పారిశుధ్యంను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయ కార్యదర్శులకు, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ఐలాండ్స్ అభివృద్ధి, నిర్వహణపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. ఐలాండ్స్‌ల్లో పచ్చదనం పెంపు, నీటి స్పింకర్ల మరమ్మత్తులు ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డివైడర్లపై పచ్చదనం కోసం నాటిన మొక్కలు కొన్ని ప్రాంతాల్లో లేవని, ఆయా ప్రాంతాల్లో నూతన మొక్కలు నాటాలని, ఉన్న మొక్కలను ఎప్పటికప్పుడు ట్రిమ్మింగ్ చేయాలని పార్కు విభాగ ఏడిహెచ్ ని ఆదేశించారు. అలాగే విజ్ఞాన మందిరం ఎదుట పింక్ టాయ్‌లెట్స్‌ని పరిశీలించి వాటి నిర్వహణ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఓల్డ్ క్లబ్ రోడ్డు, కుగ్లర్ హాస్పిటల్ రోడ్డులలో పర్యటించి పారిశుధ్య పనులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్నను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

**బాపట్ల,జనవరి11,ప్రభాతవార్త**



స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న వడ్డే ఓబన్నను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. వడ్డే ఓబన్న 218 జయంతి సందర్భంగా శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంల ఆయన చిత్రపటానికి జెసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూ ఈ ఏడాది వడ్డే ఓబన్న జయంతని రాష్ట్ర పండుగ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వడ్డే ఓబన్న నంద్యాల జిల్లాలో సంజూమాల మండలం నోస్సంగ్రామంలో 1807 జనవరి 11న జన్మించారన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యం పై రైతులు పండించిన పంటలకు శిస్తు వసూలుకు వ్యతిరేకంగా ఉయ్యాల వాడ నరసింహారెడ్డితో కలిసి ఓబన్న పోరాటాలు చేసి ప్రజల కోసం నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డివో గ్లోరియా ,కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గాదె మధుసూదన రెడ్డికి అభిమానుల అభినందన వెల్లువ

**పిట్టలవానిపాలెం,జనవరి11,ప్రభాతవార్త:**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయ కర్త గాదె మధుసూదనరెడ్డిని నియోజకవర్గ పరిదిలోని వివిధ మండలాల నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలియజేసి దుశ్యాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గాదె మధుసూదనరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని కార్యకర్తలను నాయకులను ఏకతాటిపై నడిపించి ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని, పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ని మరళా ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. గాదె మధుసూధనరెడ్డిని కలిసి వారిలో బాపట్ల నియోజకవర్గంలోని మండల నాయకులు, వివిధ గ్రామాల నాయకులు ,పర్చూరు మండల పార్టీ అధ్యక్షులు కటారి అప్పారావు, లంక శివ, చినగంజాం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ఆసోది బ్రహ్మారెడ్డి, రామకృష్ణారెడ్డి, చెరుకూరి ఎంపిటిసి సభ్యులు వీరయ్య, నాగులపాలెం పార్టీ నాయకులు శేషగిరి, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందాలు,పేకాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు

**బాపట్ల,జనవరి11,ప్రభాతవార్త:**



సంక్రాంతి పండుగ సంరద్భంగా బాపట్ల సబ్ డివిజన్ పరిదిలో ఎటువంటి గొడవలు, కోడి పందాలు, పేకాట, అసాంఘీక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎస్పీ గోగినేని రామాంజనేయులు తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ లో శనివారం సాయింత్రం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న డిఎస్పీ రామంజనేయులు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ఎంతో కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. పండుగ సందర్భంగా ఎడ్ల ప్రదర్వన పందాలకు మాత్రమే అనుమతులు ఇస్తున్నామనానఉ. అవిధంగా కాకుండా కోడి పందాలు. పేకాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే రెండు బృందాలు జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ వ్యాప్తంగా తిరుగుతున్నాయన్నారు. పోలీసుల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పండుగకు ఊళ్ళకు వెల్లేవారు. గృహాలలో విలువైన వస్తువులు ఉంచకుండా వాటిని బ్యాంకులలో, లాకర్‌లలో ,సురక్షితమైన ప్రాంతాలలో భద్రపర్చుకోవాలన్నారు. ఏక్కడైన అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నట్లయితే వెంటనే సంబందిత పోలీస్ స్టేషన్‌ను సమాచారం అందించాలని ఆయనకోరారు. ద్విచక్రవాహనాలు తప్పని సరిగా వాహన నండిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపేసమయంలో తప్పని సరిగాసీటు బెల్టు ధరించాలన్నారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ హరికృష్ణ, టౌన్ సిఐ రాంబాబు, బాపట్ల రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల సాధనకు లెర్నెట్ స్కిల్స్ ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు

**జగ్గయ్యపేట, జనవరి 11, ప్రభాతవార్త :**



జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీరాం అమ్మాణి డిగ్రీ కాలేజీలో ఉద్యోగాల సాధనకు లెర్నెట్ స్కిల్స్ ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జెఆర్‌సి విబిడిసి ప్రిన్సిపాల్ కెఎన్ రమేష్, లెమెట్ ప్రతినిధులు ఉదయకిరణ్, హరినాథ్‌బాబు శనివారం తెలిపారు. నియోజకవర్గస్థాయిలో డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నంలోవున్న విద్యార్థులకు ఈప్రోగ్రాంలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉద్యోగాల సాధనకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమేటిక్, రీజనింగ్, కంప్యూటర్ స్కిల్స్ శిక్షణ పొందిన వారికి బ్యాంకింగ్, ఐటి, మార్కెటింగ్ విభాగాలలో ఉద్యోగావకాశాలు కల్పించటం జరుగుతుందన్నారు. అలాగే శిక్షణ కాలంలో ట్రైనింగ్ కిట్‌ను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈశిక్షణలను జెఆర్‌సి విద్యాసంస్థల ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ సహకారంతో శ్రీరాం అమ్మాణి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా శనివారం తొలి బ్యాచ్ విద్యార్థులకు జెఆర్‌సి విద్యాసంస్థల డైరెక్టర్ రంగాపురం నాగేశ్వరరావు ఉచిత శిక్షణకిట్స్‌ను అందజేశారు.

## భక్తుల మనోభావాలతో ఆటలాడుకున్న టిటిడి,భద్రతా సిబ్బంది

**గుంటూరు కల్చరల్,జనవరి 11,ప్రభాతవార్త :**




భక్తుల మనోభావాలతో ఆటలాడుకున్న టిటిడి, భద్రతా సిబ్బంది తిరుపతిలో జరిగిన త్రొక్కిసలాట దుర్ఘటనకు పూర్తిగా నైతిక బాధ్యత వహించి తీరాల్సిందేనని 6గురు చనిపోవడానికి అధికారులు, పోలీసులు సమన్వయ లోపమే కారణమని అవగాహన సంస్థ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సంస్థ సీనియర్ సభ్యులు అభిప్రాయపడ్డారు. విద్యావేత్త, విశ్లేషకులు ఎస్.రవిబాబు మాట్లాడుతూ తిరుపతి బైరాగి పట్టెడ తొక్కిసలాట ఘటన వివరాలను సొంతంగా పరిశీలిస్తే టిటిడి ఏర్పాట్లలో లోసుగులు, భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందన్నారు. 3000మంది పోలీసులు, 1500విజిలెన్స్ సిబ్బందిని మోహరించామని చేసిన ప్రకటన పచ్చి అబద్ధమని టిక్కెట్టు కేంద్రాల వద్ద 50మందికి మించి పోలీసులు లేరన్నారు. సమావేశంలో గాంధేయవాది అచ్యుత ఇందుశేఖర్, ప్రధానోపాధ్యాయులు నారపరెడ్డి, ఆర్.వి.సింగరయ్య తదితరులు ప్రసంగించారు.

## అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు

**గుంటూరు కల్చరల్,జనవరి 11,ప్రభాతవార్త :**



స్థానిక మారుతీనగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న శ్రీరామ సేవా సమితి వారణాసి, శ్రీమారుతీ దేవాలయ సంఘం సంయుక్తాధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఉత్తరద్వారా దర్శనం నిర్వహించారు. ఉదయం 8గంటల నుండి చండీహోమం నిర్వహించారు. మధ్యాహ్నం 2నుండి శ్రీరామచంద్రులకు లక్ష తులసీ పూజ జరిపారు. సాయంత్రం 6గంటలకు హారతి నీరాజన మంత్రపుష్పాలు దర్బార్‌సేవ నిర్వహించి ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను బ్రహ్మశ్రీ యు.వి.సోమయాజులు ఆధ్వర్యంలో కార క్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

## పార్టీ కార్యకర్తకు జనసేన భీమా చెక్కు అందజేసిన మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి, జనవరి 11 (ప్రభాతవార్త) : జన పార్టీ కోసం తనతోపాటు అహర్నిశలు కృషి చేసిన వెంకటేశ్వరరావును కోల్పోవడం అత్యంత బాధాకరమని మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ తరపున రూ.5లక్షలు చెక్కును వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. తెనాలి మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన జనసైనికుడు పెండ్యాల వెంకటేశ్వరరావు, గతంలో రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించగా, శనివారం మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ నాయకులతో వెళ్ళి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి జనసేన పార్టీ తరపున రూ.5లక్షల బీమా చెక్కును అందజేశారు. జనసేన పార్టీకి పెంట్యాల వెంకటేశ్వరావు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన పెంట్యాల వెంకటేశ్వరరావు ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి నాదెండ్ల మనోహర్ వెంకటేశ్వరరావు చిత్రపటం చెంత నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మనోహర్ వెంట జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ ఎంపీటీసీ సభ్యులు అమ్మిశెట్టి హరికృష్ణ, జిడుగు తులసి, గణేష్ యూత్ వీరవల్లి మురళి, గ్రామ ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, జనసేన జిల్లా నాయకులు షేక్ ఇస్మాయిల్, తదితర పార్టీ శ్రేణులు ఉన్నారు.

# ఎన్నికల వేళ ఆప్‌కు కాగ్ షాక్




## ఢిల్లీ మద్యం పాలసీవల్ల రూ.2026 కోట్ల నష్టం, తేల్చిచెప్పిన కాగ్

**న్యూఢిల్లీ, జనవరి 11:** ఢిల్లీ మద్యంపాలసీ వ్యవహారం ఇపుడు ఎన్నికల సమయంలో కాగ్ పుణ్యమా అని మరోసారి తెరపైకి వచ్చింది. పాలసీ కారణంగా ప్రభుత్వానికి రూ.2026 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ మేరకు కాగ్ దీనిపై రూపొందించిన నివేదిక లీక్ అయినట్లు ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు. ఢిల్లీమద్యం పాలసీ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో ఆమ్ ఆద్మీపార్టీ విఫలం అయిందని కాగ్ వెల్లడించింది. దీనిపై నిపుణుల కమిటీ సిఫారసులను నాటి డిప్యూటిసిఎం మనీశ్‌సిసోడియా నేతృత్వంలోని మంత్రులబృందం విస్మరించిందని తెలిపింది. అంతేకాకుండా ఈ పాలసీపై కీలక నిర్ణయాలు తీసుకునే క్రమంలోమంత్రిమండలి, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కూడా తీసుకోలేదని వెల్లడించింది. లైసెన్సులు జారీ నిబంధనలు ఉల్లంఘనలు జరిగినట్లు పేర్కొంది. ఈ పాలసీ వ్యవహారంలో అనేక ఫిర్యాదులు ఉన్నా అన్ని సంస్థలను వేలం వేసేందుకు అనుమతించారని గుర్తించింది. వేలం వేసిన సంస్థల ఆర్థికస్థితిగతులపై ఎలాంటిపరిశీలనలు జరపలేదని నష్టాల్లో ఉన్న కంపెనీలకూ అవకాశం ఇచ్చినట్లు తెలిపింది. వారికి లైసెన్సులను కూడా పునరుద్ధరించినట్లు నివేదిక తెలిపింది.

కాగా ఢిల్లీ ప్రభుత్వం 2021 నవంబరు 17న మద్యం పాలసీ తెచ్చింది. 2022 సెప్టెంబరు చివరిలో వెనక్కి తీసుకుంది. ఈ మద్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని ఆప్‌నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్‌పాలసీని సవరించేటపుడు సిసోడియా అక్రమాలకు పాల్పడ్డారనేది సిబిఐ ఇడిలు ఆరోపించాయి. లైసెన్స్ దారులకు అవసరమైన సాయంచేసి ప్రతిఫలంగా కొంతమొత్తాన్ని పొందినట్లు దర్యాప్తుసంస్థలు చెప్పాయి.


ఈ కుంభకోణంలో భాగంగా సిసోడియా ఢిల్లీమాజీ సిఎం అరవింద్‌కేజ్రీవాల్ ఇతర ఆప్ నేతలను అధికారులు అరెస్టుచేసారు. కొంతకాలం క్రితం నేతలు బెయిల్‌పై విడుదలయ్యారు. ఇదిలా ఉండగా త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి ఐదున పోలింగ్ జరుగుతుండగా 8న ఫలితాలు వెలువడతాయి. ఈక్రమంలోనే కాగ్ నివేదికలోపేర్కొన్న అంశాలు ఇపుడు ఆప్ ప్రభుత్వానికి సంకట స్థితిని తెచ్చిపెట్టాయనడంలోసందేహంలేదు. ఎన్నికల్లో ఇపుడు కాంగ్రెస్, బిజెపిలు మద్యం పాలసీ, కాగ్ అంశాలనే ప్రధాన అస్త్రాలుగా మలుచుకోనున్నాయి.

# నీలిరంగులో సూర్యుడు!

## 200 యేళ్లక్రిత్రం అలా కనిపించడంపై వీడిన రహస్యం

### భూమిపై భారీ అగ్నిపర్వతం బద్దలవడం వల్లేనని తేల్చిన శాస్త్రజ్ఞులు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** ప్రస్తుతం సూర్యుడు ఏ రంగులో వుంటాడంటే అందరు చాలా సులభంగా సమాధానం చెబుతారు. సూర్యోదయం, సూర్యాస్తమయం వేళలో నారింజరంగు మధ్యాహ్నం వేళ తెల్లటి పాలరంగులో వుంటాడనేది అందరికి తెలిసిన విషయమే.



అయితే రెండు వందల సంవత్సరాల క్రితం సూర్యుడు కొంతకాలం పాటు నీలి రంగులో మారడంపై నెలకొన్న రహస్యాన్ని స్కాట్లాండ్‌లోని యూనివర్శిటీ ఆఫ్ సెయింట్ అండ్రూస్ సైంటిస్టులు రట్టు చేశారు. సూర్యుడు ఏమిటి నీలం రంగులో మారడం ఏమిటని అందరు ఆశ్చర్యపోవచ్చు. కానీ 1831లో ఇది జరిగిందని స్కాట్లాండ్‌లోని యూనివర్శిటీ ఆఫ్ సెయింట్ అండ్రూస్ సైంటిస్టులు ఆధారాలతో సహా రుజువు చేశారు. దీనికి సంబంధించి సూర్యుడు నీలి రంగులో మారితే ఎలా వుంటాడనే దానిపై ఒక ఫోటోను కూడా వారు విడుదల చేశారు. 1831 సంవత్సరంలో భూమిపై సంభవించిన భారీ అగ్ని పర్వత విస్ఫోటనం వల్ల ఎగసిపడిన సల్ఫర్ డయాక్సైడ్ భూవాతావరణంలోకి ప్రవేశించిందని, దీని కారణంగా గాలిలో ఇది భారీగా విస్తరించి మేటలు వేసిందని, ఈ కారణంగా దాదాపు భూమండలంలో అన్ని ప్రాంతాలలో కొంతకాలం పాటు సూర్య కిరణాలు నీలం రంగులో కనిపించాయని ఆ యూనివర్సిటీ సైంటిస్టులు తేల్చారు. అప్పట్లో అగ్ని పర్వతం బద్దలవడం వల్ల భూవాతావరణం చాలామేరకు చల్లబడిందని, ఇదే సమయంలో కొన్ని విచిత్రమైన మార్పులు చోటుచేసుకున్నాయని వారు తెలిపారు. దీని ప్రభావం వల్ల సూర్యుడి కాంతి భూవాసులకు నీలి రంగులో కొంత కాలం కనిపించిందని ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్ అనేజర్నల్‌లో ఒక అధ్యయనం ప్రచురితమయ్యింది. స్కాట్లాండ్‌లోని యూనివర్శిటీ ఆఫ్ సెయింట్ అండ్రూస్ సైంటిస్టులు ఈ విషయాలను తమ పరిశోధనలో తేల్చారు. 1831 నాటి వాతావరణ రికార్డులను వారు విస్తృతంగా విశ్లేషించి ఈవిషయాలను ధృవీకరించారు. అగ్నిపర్వతంనుంచి, మంచు అంతర్భాగంనుంచి సేకరించిన బూడిదలను ల్యాబ్‌లో విశ్లేషించగా అసలువిషయం బయట పడిందని అధ్యయన రచయితలు చెబు తున్నారు.

అప్పట్లో పేలిన అగ్ని పర్వతం రష్యా, జపాన్ మధ్యవున్న వివాదాస్పద భూభాగంలో గల సిముషీర్ ద్వీపంలోని జవారిట్స్కి పేరిట వుందని కూడా వారు నిర్ధారించారు. దీనికి సంబంధించిన రాతపూర్వక వివరాలను ఇంత వరకు ఏనాడు నమోదు చేదయలేదని వారు తేల్చారు. అప్పట్లో పేలిన అగ్ని పర్వతం జవారిట్స్కి సిమూర్‌షీర్ ద్వీపంలో జనావాసం లేని ప్రాంతంలో వుండడం, ఆ ప్రాంతానికి చాలా దూరం వరకు జనసంచారం లేకపోవడంతో దీని గురించి అప్పట్లో ఎవరు పట్టించుకోలేదని సైంటిస్టులు తెలిపారు.



## ప్రధానిమోడీపై సంస్కృతంలో మహాకావ్యం

**గంజాం(ఒడిశా), జనవరి 11:** రాష్ట్రంలోని గంజాం జిల్లాకు చెందిన సంస్కృత పండితుడు సోమనాథ్ ప్రధాని నరేంద్రమోడీపై మహా కావ్యాన్ని రచించారు. ప్రస్తుతం ఆయన ఆంధ్ర ప్రదేశ్ తిరుపతిలోని జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మోడీ జీవన ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లు, ఆయన రాసిన రచనలను వివరిస్తూ 12 అధ్యాయాలు, 1200 శ్లోకాలతో నరేంద్ర ఆరోహణం పేరిట ఈ మహా కావ్యాన్ని రాసినట్లు సోమనాథ్ పేర్కొన్నారు. ఈగ్రంథ రచనకు ప్రతాప రుద్రీయం, కావ్య ప్రకాశం వంటిప్రాచీన సంస్కృత ఇతిహాసాల శైలిని అనుసరించానన్నారు. దీనిని రాయడానికి నాలుగేళ్ల పట్టిందని వివరించారు. గుజరాత్‌లోని వెరావల్‌లో జరిగిన యువజనోత్సవంలో ఈపుస్తకం ఆవిష్కరించినట్లు సోమనాథ్ అన్నారు. ఈ కావ్యాన్ని హిందీ, ఆంగ్లభాషల్లో అనువదించినట్లు చెప్పారు. సోమనాథ్ ఈ కావ్యంపై మాట్లాడుతూ ప్రధానిమోడీ జీవన విధానం రాజకీయ ప్రయాణం ఎల్లప్పుడూ చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు.



## బిజెపి సిఎం అభ్యర్థి బిదూరీయే!

### - కేజ్రీవాల్ విమర్శ

**న్యూఢిల్లీ, జనవరి 11:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తున్న తరుణంలో ఆప్, బిజెపి ఒకదానిపై ఒకటి తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకుంటున్నాయి. ఈక్రమంలో తనకు ఉన్న సమాచారంన రపకారం బిజెపి సిఎం అభ్యర్థి రమేశ్‌బిదూరి అని ఆమ్ ఆద్మీపార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. అంతకుముందు ఢిల్లీ సిఎం అతిశికూడా ఇవే వ్యాఖ్యలుచేయడం గమనార్హం. మాకున్న సమాచారం మేరకు రమేష్ బిదూరీయే బిజెపి తన సిఎం అభ్యర్థిగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండు మూడు రోజుల్లో ప్రకటన వస్తుందని, సిఎం అభ్యర్థి అవుతున్నందుకు ఆయనకు శుభాకాంక్షలు. దేశరాజధాని విషయంలో ఆయన విజన్ ఏంటో చెప్పాలి. బిజెపి తన అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఢిల్లీ అభివృద్ధి ఇతర అంశాలపై సిఎం అభ్యర్థులు చర్చల్లో పాల్గొనాలని కేజ్రీవాల్‌సవాల్ విసిరారు. ఢిల్లీ సిఎం అతిశి లక్ష్యంగా బిదూరి ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలుచేసిన సంగతి తెలిసిందే. సిఎం అతిశి ఆమె తండ్రినే మార్చేసారని, గతంలో ఆమెకు ఒక ఇంటిపేరు ఉండగా ప్రస్తుతం మరోపేరు వినియోగిస్తున్నారని ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన అఫ్జల్‌గురుకు క్షమాబిక్ష ప్రసాదించాలని ఆమె తల్లితండ్రులు పిటిషన్‌కూడా దాఖలుచేసారంటూ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక వాద్రాపైనా వివాదాస్పద వ్యాఖ్యలుచేసారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తన నియోజకవర్గంలోని రోడ్లన్నీ ప్రియాంక గాంధీ బుగ్గల్లా తీర్చిదిద్దుతామని అన్నారు. దీనితో కాంగ్రెస్ నాయకులు మొత్తం ఆయనపై మండిపడ్డారు. తనపై చేసిన వ్యాఖ్యలకు ఢిల్లీ సీఎం అతిశి నిప్పులు చెరిగారు. ఓట్లకోసం ఎంతకైనా దిగజారుతారని ఆమె రమేష్‌ను విమర్శలతో చీల్చిచెండాడారు.

# భారత్‌ను దెబ్బతీసేందుకు పాక్ కొత్త వ్యూహం!



## సరిహద్దు వెంబడి యాంటీ పర్సనల్ మైన్స్ ఏర్పాటు

**శ్రీనగర్, జనవరి 11:** యావత్ ప్రపంచం అభివృద్ధివైపు పరుగుతీస్తున్నా.. పాకిస్థాన్ ప్రవర్తనలో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. అభివృద్ధిని పక్కనబెట్టి.. భారత్‌ను ఎలా దెబ్బ తీయాలా? అని అవకాశం కోసం ఎదురుచూస్తోంది. సమయం దొరికినప్పుడల్లా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించడమే పనిగా పెట్టుకున్న పాక్.. తాజాగా భారత్, పిఒకె సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్ఒసి) వెంబడి రక్షణ సామర్థ్యాన్ని అనూహ్యంగా పెంచుతోంది. కంచె వెంబడి పెద్దసంఖ్యలో యాంటీ పర్సనల్ మైన్స్ ఏర్పాటు చేయడంతోపాటు స్పెషల్‌సర్వీస్ గ్రూప్ కమాండోలు, మాక్ ఫైరింగ్ యూనిట్లను సిద్ధం చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం.

**యాక్షన్‌లోకి మళ్లీ హిజ్బుల్!**

నియంత్రణ రేఖ వెంబడి ఓ పక్క సైనిక బలగాలను బలోపేతం చేసుకుంటున్న పాకిస్థాన్.. స్థానిక ఉగ్రవాద సంస్థలను కూడా యాక్టివేట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో భారత సైనిక వాహనాలే లక్ష్యంగా జరిగిన దాడుల్లో హిజ్బుల్ ఉగ్రవాదుల ప్రమేయం ఉన్నట్లు భారత రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మందుపాతరలు పెట్టి సైనిక వాహనాలను పేల్చేయడం. వారు అప్రమత్తమయ్యేలోపే మాటువేసి వారిపై కాల్పులు జరపడం హిజ్బుల్ వ్యూహంలోభాగం. ఈతరహా ఘటనలు జమ్మూ కాశ్మీర్‌లో ఇటీవలకాలంలో ఎక్కువవు తున్నాయి. దీన్నిబట్టి కొన్నాళ్లుగా స్తబ్దుగాఉన్న హిజ్బుల్ ముజాహిదీన్ తన కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీని వెనక పాక్‌హస్తం ఉందన్నవిషయం బహిరంగ రహస్యం.

**వ్యూహం మార్చిన పాకిస్థాన్**

సైన్యంతో భారత్‌ను ఎదుర్కొనే సత్తాలేని పాకిస్థాన్.. దొంగదెబ్బ తీయాలని ప్రయత్నిస్తోంది. నేరుగా యుద్ధానికి దిగకుండా ఉగ్రవాదులను పావులుగా వాడుకుంటోంది. వారికి ఆశ్రయం కల్పిస్తూ మారణహోమాలకు పురిగొల్పుతోంది. ఒకవేళ భారత్ ఎదురు తిరిగితే.. పాకిస్థాన్‌పై దాడికి పాల్పడుతోందంటూ అంతర్జాతీయ వేదికలపై భారత్‌నుదోషిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే.. తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్, హిజ్బుల్ తదితర ఉగ్రనాగులకు పాలుపోసి పెంచుతోంది. కశ్మీర్ లోయలోఉండే స్థానిక ఉగ్రవాదులనే తమకు అనుకూలంగా మార్చుకుంటూ భారత్‌పై దాడులకు సిద్ధం చేస్తోంది.

# ఇది డెమోక్రాట్ల 'నీచమైన ఆట'

## హష్‌మనీ కేసులో బేషరతు విడుదల అమలుపై ట్రంప్



**వాషింగ్టన్, జనవరి 11:** హష్‌మనీ వ్యవహారంలో అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు న్యూయార్క్ జడ్జి బేషరతు విడుదలను అమలు చేస్తూ తీర్పు ఇచ్చిన విషయం విదితమే. తాజాగా ఈ తీర్పుపై ట్రంప్ స్పందించారు. ఇది డెమోక్రాట్ల 'నీచమైన ఆట' అని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఓ పోస్టు చేశారు. 'నాకు బేషరతు విడుదలను ఇచ్చారు. ఇలాంటి కేసు ముందెన్నడూ లేదని లీగల్ స్కాలర్లు, నిపుణులు చెబుతున్నారు. ఈ స్కామ్ మొత్తం కొట్టివేయడానికి అర్హమైనది. ఈ బూకటపు కేసుపై మేము అప్పీల్ చేస్తాం.

అంతేకాక, ఒకప్పటి మన గొప్ప న్యాయవ్యవస్థపై అమెరికన్లు పెట్టుకున్న నమ్మకాన్ని పునరుద్ధరిస్తాం' అని ట్రంప్ రాసుకొచ్చారు.

హష్‌మనీ కేసులో ట్రంప్ ఇప్పటికే దోషిగా తేలారు. అయితే.. గత నవంబరులోనే న్యూయార్క్ కోర్టు ఆయనకు శిక్ష ఖరారు చేయాల్సి ఉంది.

అదే సమయంలో అమెరికా నూతన అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యారు. దాంతో తాను క్రిమినల్ విచారణ ఎదుర్కోకుండా రక్షణ ఉంటుందని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ ట్రంప్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు తొలుత శిక్షను నిరవధి కంగా వాయిదా వేయగా.. అనంతరం రక్షణ కల్పించే అవకాశాలు లేవని తేల్చింది.


ఈ క్రమంలోనే శుక్రవారం న్యూయార్క్ జడ్జి తీర్పు వెలువరించారు. దోషిగానే నిర్ధారిస్తూ ఎలాంటి శిక్ష, జరిమానా లేకుండా బేషరతు విడుదలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో దోషిగా నిర్ధారణ అయిన తొలి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ నిలవనున్నారు. జనవరి 20న ఆయన నూతన అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించనున్న విషయం తెలిసిందే.

**ఏమిటీ హష్‌మనీ కేసు..?**

శృంగార తార స్టార్మీ డానియల్స్‌తో ట్రంప్ గతంలో ఏకాంతంగా గడిపారనే ఆరోపణలు ఉన్నాయి. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో దీనిపై ఆమె నోరు విప్పకుండా ఉండేందుకు ట్రంప్ తన న్యాయవాది ద్వారా 1.30 లక్షల డాలర్ల హష్‌మనీని ఇప్పించారన్నది ఆరోపణ. ప్రచార కార్యక్రమాల కోసం అందిన విరాళాల నుంచే ఆ మొత్తాన్ని ఖర్చు చేశారని, అందుకోసం రికార్డులన్నింటినీ తారుమారు చేశారన్నది ప్రధాన అభియోగం.

ఇలా మొత్తం 34 అంశాల్లో ఆయనపై నేరారోపణలు నమోదయ్యాయి. ఆరు వారాల విచారణ తర్వాత ట్రంప్‌పై మోపిన అభియోగాలన్నీ నిజమేనని 12 మంది జడ్జిలతో కూడా ధర్మాసనం ఏకాభిప్రాయంతో ఆ మధ్య తీర్పు వెలువరించింది.

ట్రంప్‌తో ఏకాంతంగా గడిపిన మాట వాస్తవమేనని స్టార్మీ డానియల్స్ స్వయంగా కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. ఆమెతో సహా మొత్తం 22 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం.. శిక్షను వెలువరించింది.




## కార్చిచ్చులో బుగ్గిపాలయిన

# వెయ్యికోట్ల భవనం!

**లాస్ ఏంజెల్స్, జనవరి 11:** అమెరికాలోని లాస్‌ఏంజెల్స్ ప్రాంతంలో కార్చిచ్చు ఎన్నో ఇళ్లను బూడిదగా మార్చేసింది. ఈ విలయం పసిఫిక్ పాలిసేడ్స్ ప్రాంతంలో అత్యంత ఖరీదైన భవనాన్ని శిథిలంగా మార్చింది. ఆ మాన్షన్ విలువ సుమారు 125 మిలియన్ డాలర్లు ఉంటుంది. అంటే భారత కరెన్సీలో సుమారు 1077 కోట్లకుపైనే అని అంచనా. 18 పడకగదుల ఈ విలాస భవనం లుమినార్ టెక్నాలజీస్ సిఇఒ ఆస్టిన్‌రస్సెల్‌కు చెందినది. దీనిని అద్దెకు ఇస్తే రూ.3 కోట్లకుపైగానే వస్తోంది. సక్సెషన్ అనే టివి సిరీస్‌లో ఈ ఇల్లు కనిపిస్తుంది. దాంతోనే ఈ ఇల్లు అందరి దృష్టిని ఆకర్షించింది. కానీ ఇపుడు అబ్బురపరిచే ఫర్నిటచర్, సుందరమైన గార్డెన్స్ అన్నీ బూడిదగా మారిపోయాయి. అయితే ఈ ఇంటిగురించిన కథనాల్లో పూర్తిస్థాయి ధృవీకరణ లేదు. సిరిసంపదలతో తులతూగిన లాస్ ఏంజెల్స్ నగరం నేడు మరుభూమిని మరిపిస్తోంది. ఎగిసిపడుతున్న పొగ, మంటలు అంతరిక్షంలోని ఉపగ్రహాలకు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎటుచూసినా పూర్తిగా కాలిపోయి బూడిదగా మారిన గృహాలు దర్శనమిస్తున్నాయి. మరోవైపు ధనవంతులు, హాలీవుడ్ స్టార్లు వదిలేసి వెళ్లిపోయిన ఇళ్లల్లో విలువైన వస్తువులను దొంగలు దోచుకుంటున్నారు. ఆస్తినష్టం సుమారు 150 బిలియన్ డాలర్లకు పెరగవచ్చని అక్యూవెదర్ అంచనావేసింది. అమెరికా బీమారంగంకూడా ఈకార్చిచ్చుకు కుదలయ్యే భయాలున్నాయి. జెపిమోర్గాన్, మార్నింగ్‌స్టార్ అంచనాలప్రకారం 20 బిలియన్ డాలర్లవరకూ బీమా సంస్థలకు నష్టం ఎదురవుతుందని వెల్లడించాయి. కాలిఫోర్నియాలోని అతిపెద్ద బీమాసంస్థ స్టేట్‌ఫామ్ కొన్ని నెలల కిందటే పాలిసాడ్స్‌లోని కొన్ని ప్రాంతాల్లోని ఇళ్లకు కార్చిచ్చు ముప్పు ఉందని గ్రహించి పాలసీలు ఇవ్వడం మానేసింది.

## నేను పోటీలో ఉంటే...

# ట్రంప్‌ను ఓడించేవాడినే!



### మీడియాతో బైడెన్ చిట్‌చాట్

**వాషింగ్టన్, జనవరి 11:** నేనుకానీ ఎన్నికల్లో పోటీచేసి ఉంటే ట్రంప్‌ను సులువుగా ఓడించేవాడినని ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో తిరిగి పోటీచేయకూడదనే నిర్ణయంపై విచారిస్తున్నారా ఆ చర్య ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు కావడానికి సహాయపడిందని అనుకుంటున్నారా అని మీడియా ప్రశ్నలకు బైడెన్ స్పందిస్తూ తాను అలా అనుకోవడం లేదన్నారు. తాను ఎన్నికల బరిలోఉంటే ట్రంప్‌ను కచ్చితంగా ఓడించేవాడినని విశ్వాసం వ్యక్తంచేసారు. కమలా హ్యారిస్ ఎన్నికల్లో ట్రంప్‌ను ఓడించగలదని తాను భావించానని అందుకనే ఆమెకు మద్దతిచ్చానని అన్నారు. అందుకు అనుగుణంగానే కమల కూడా తీవ్రస్థాయిలో కృషిచేసారన్నారు. ఆమె ట్రంప్‌ను ఓడిస్తుందన్న నమ్మకంతోనే తాను పోటీనుంచి వైదొలిగినట్లు చెప్పారు. తొలుత అధ్యక్ష ఎన్నికల రేసులో నిలబడిన జోబైడెన్‌కు సొంతపార్టీనేతలనుంచే వ్యతిరేకత వచ్చింది. ఆరోగ్యసమస్యలతో అధ్యక్ష ఎన్నికల రేసునుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. డెమొక్రటిక్‌పార్టీ అభ్యర్థిగా కమలా హారిస్‌కు తన మద్దతును ప్రకటించారు. పదవులకంటే ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని రక్షించడమే కీలకమని అందుకే పదవినుంచి దిగిపోవాలన్న తన నిర్ణయాన్ని అప్పట్లో బైడెన్ సమర్థించుకున్నారు. అమెరికా రాజకీయాల్లో స్పష్టమైన విభజన ఉందని దానికి స్వస్తి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

నియంత నిరంకుశులకంటే కూడా దేశం గొప్పదన్నారు. అమెరికాలో మెటా థర్డ్‌పార్టీ ఫ్యాక్ట్ చెకింగ్ కార్యక్రమాన్ని ఉపసంహరించుకోడాన్ని జోబైడెన్ తీవ్రంగా విమర్శించారు. ఈ చర్య సిగ్గుచేటని అన్నారు. లాస్‌ఏంజెల్స్ ప్రస్తుతపరిస్థితి యుద్ధభూమిలా మారిందని బైడెన్ అన్నారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ సమర్థురాలంటూ ప్రశంసించారు. నవంబరు 5న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌చేతిలో కమాలా ఓడిన సంగతి తెలిసిందే.

# ఎమ్మెల్యే అనుమానాస్పద మృతి



**లూథియానా,జనవరి 11:** పంజాబ్‌లోని లూదియానా వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే గురుప్రీత గోగీ(58) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అధికారులు తెలిపిన వివరాలప్రకారం ఎమ్మెల్యే గోగీకి శుక్రవారం అర్థరాత్రి బుల్లెట్ గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించేలోపే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఆయన తలలో రెండు బుల్లెట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదవశాత్తూ తుపాకీ పేలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు డిసిపి కుల్దీప్‌సింగ్‌చాహల్‌పేర్కొన్నారు. 2022లో ఆప్ పార్టీలోచేరిన గోగీ లూథియానా నియోకవర్గం నుంచి రెండుసార్లు గెలిచారు. గోగీ మృతిపై కుటుంబసభ్యుల వివరాలు భిన్నంగా ఉన్నాయి. ఆయన కుటుంబసభ్యులు మాత్రం ఎవ్వరూ కాల్చలేదని, ఆటైమ్‌లో ఆయన గదిలో ఒంటరిగానే ఉన్నారని, అదిప్రనమాదవశాత్తూ జరిగిన సంఘటన కావచ్చని చెపుతున్నారు. తుపాకీని గురుప్రీత్ శుభ్రంచేస్తుండగా ప్రమాదవశాత్తూ పేలి బుల్లెట్ గాయం అయిందని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. శవపరీక్ష నివేదిక వచ్చాక ఘటనపై మరింత స్పష్టత రావొచ్చని అధికారులు చెపుతున్నారు. కాగా ఎన్నికల్లో లూదియానా వెస్ట్‌లో ఆయన మాజీ మంత్రి భరత్ భూషణ్ ఆషూని ఓడించారు.

# తమిళనాడు అభివృద్ధిపై ఓర్వలేని గవర్నర్



### సిఎం స్టాలిన్ రుసరుసలు

**చెన్నై, జనవరి 11:** డిఎంకె నాయకత్వంలోని తమిళనాడు ప్రభుత్వం గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య దూరం పెరుగుతోంది. మరోసారి గవర్నర్‌పై ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర అభివృద్ధినిచూసి ఆయన జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలుచేసారు. గవర్నర్ అసెంబ్లీకి వచ్చినా ప్రసంగించకుండానే మధ్యలో వెళ్లిపోయారు. ఆయన తీరు చిన్నపిల్లల చేష్టల మాదిరిగా ఉందని రాజ్యాంగం ప్రకారం గవర్నర్ బాధ్యతలు నిర్వర్తించలేక పోయారని తమిళనాడు అభివృద్ధిని చూసి ఆయన జీర్ణించుకోలేక పోతున్నారని సిఎం తీవ్ర విమర్శలుచేసారు. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవం సందర్భంగా జాతీయ గీతాన్ని ఆరోపిస్తూ గవర్నర్ ఆర్ఎన్‌రవి ప్రసంగం చేయకుండానే వెళ్లిపోయారు. రాజ్యాంగం జాతీయ గీతానికి మరోసారి అవమానం జరిగిందని, జాతీయ గీతాన్ని గౌరవించడం రాజ్యాంగం ప్రకారం మన ప్రాథమిక విధి అని అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నాయంటూ ఇటీవలే ఎక్స్‌లో పోస్టుకూడాచేసారు. ఈ పరిణామాలతో అధికార డిఎంకె ప్రభుత్వానికి గవర్నర్‌కు మద్య మరోసారి విభేదాలు ఏర్పడ్డాయి. రాష్ట్రప్రజలను ప్రభుత్వాన్ని ఆయన ఎప్పుడూ అవమానిస్తు న్నారని ఆరోపించిన సిఎం స్టాలిన్ గవర్నర్ చర్యపై మరోసారి విమర్శలుచేసారు.



## శ్రీకాళహస్తిలో సంక్రాంతి సంబరాలు: వస్త్ర దుకాణాలు కిట కిట

**శ్రీకాళహస్తి, జనవరి 11 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు నిరుపేదల జీవితాల్లో సంక్రాంతిని సంతరిస్తుంది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పెంచిన పెన్షన్ నిరుపేదలకు పండగ సంబరాలకు ఊతం ఇస్తోంది. దాంతో నిరుపేదల్లో కొనుగోలు శక్తిని పెంచుతుంది. ఈ ఏడాది సంక్రాంతి వ్యాపారాలు శనివారం వరకు వెల వెల బోయినా మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా పట్టణంలోని రెండు మాల్స్ ఆఫర్స్ తో అదుర్స్ కల్గిస్తుంది. దాంతో వందలాది బట్టల షాపుల్లో గతంలో ఇసుకేస్తేరాలనంత రద్దీ ఉండేది. అయితే ఈ యేడాది మాల్ ఏర్పాటుతో దుకాణాలు వెల వెలబోతున్నాయి. పట్టణంలో రోజు రోజుకు బట్టల షాపుల సంఖ్య పెరుగుతుంది. అయినా రద్దీ తగ్గటం లేదు.

శనివారం పట్టణంలోని నె హ్రూవీధి, పాత నెల్లూరు బస్టాండు, ఆర్టిసి సర్కిల్ వద్ద జనం గుంపులు, గుంపులుగా కనబడ్డారు. అయితే కిరాణ షాపులు మాత్రం సాదాసీదాగా కనబడింది.



స్వామి అమ్మవార్లకు పూజాదికాలు నిర్వహిస్తున్న దృశ్యం

## వేదోక్తంగా ప్రారంభమైన ఆర్ద్రోత్సవాలు

### నేడు శివకామసుందరి, నటరాజస్వామివార్ల దివ్య కల్యాణోత్సవం, రేపు ఉత్తర ద్వార దర్శనం

**ఇంద్రకీలాద్రి, జనవరి 11, ప్రభాతవార్త :** దుర్గమ్మ ఆలయంలో శనివారం వేదోక్తంగా ఆర్ద్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజ జరిపారు. అనంతరం శివకామ సుందరి సమేత నటరా జ స్వామివార్లకు మంగళస్నానాలు నిర్వహించి, నూతన వధూవరులుగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, వేదపండితులు, వైదిక సిబ్బంది, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈనెల 13వ తేదీ వరకు ఆర్ద్రోత్సవాలు నిర్వహిస్తామని ఇఓ కె రామచంద్రమోహన్ వెల్లడించారు. 12వ తేదీన లింగోద్భవ కాలంలో రాత్రి 9.30కు మహాన్యాసం, అభిషేకాది సేవలు, నిర్వహిస్తామన్నారు.

రాత్రి 7గంటలు శ్రీ శివకామసుందరి శ్రీ నటరాజస్వామివార్ల దివ్య కళ్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. రాత్రి 11గంటలకు ఆర్ద్రోత్సవం (అభిషేకం, అన్నాభిషేకం) జరుగుతాయన్నారు. ఈనెల 13న ఉత్తర ద్వార దర్శనం, సాయంత్రం ఉత్సవర్లకు నగరోత్సవం నిర్వహిస్తామన్నారు. 12వ తేదీన జరిగే కళ్యాణోత్సవంలో భక్తులు రు.1,116ల టికెట్టు పొంది పాల్గొనవచ్చన్నారు.

## సంస్కృతాంధ్ర పండితుడు కాశీవిశ్వేశ్వర శర్మ శివైక్యం

**అనంతపురం, జనవరి 11 ప్రభాతవార్త బ్యూరో:** తెలుగు సంస్కృత భాషల్లో పండితుడైన డాక్టర్ కలవకొలను కాశీ విశ్వేశ్వర శర్మ శనివారం శివైక్యం చెందారు. అనంతపురంలోని కెఎస్ఎస్ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో సంస్కృత భాష అతిథి ఉపన్యాసకులుగా ఆయన పని చేస్తున్నారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో 1967 ఫిబ్రవరి 2న శర్మ జన్మించారు. ఎంఏ (తెలుగు), ఎంఏ (సంస్కృతం) పూర్తి చేశారు. సుందరకాండ అనే అంశంపై తెలుగులో పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి పురాణం ప్రాజెక్టుతో ఆయనకు అనుబంధం ఉంది. అష్టాదశ పురాణాల తెలుగు అనువాద కార్యక్రమంలో కీలక భూమిక పోషించారు. ఇందులో భాగంగా బ్రహ్మాండ పురాణం, స్కంద పురాణం, శివపురాణంలో 3200 శ్లోకాలను సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించారు. అనంతపురంలోని శ్రీవాణి డిగ్రీ కాలేజీలో, సాయి విజ్ఞాన్ జూనియర్ కాలేజీ, పాఠశాలలో సంస్కృతం బోధిస్తున్నారు. దూర విద్య ద్వారా సంస్కృత తరగతులను నిర్వహిస్తున్నారు. అలాగే శ్రీకృష్ణదేవరాయ ఎస్ఎస్బిఎన్ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ, ఎస్వి డిగ్రీ కాలేజీలలో సంస్కృత ఉపన్యాసకులుగా పని చేశారు. సంస్కృత భారతి అనంతపురం జిల్లా కార్యదర్శిగా, పత్రాలను సంస్కృత శిక్షకులుగా వ్యవహరించారు. బిఎస్సి మొదటి సంవత్సరం విద్యార్థులకు సంస్కృతం చంద్రమా, సంస్కృత ప్రశ్నోత్తర రూపకర్తగా వ్యవహరించారు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం నవ సంస్కృత అధ్యయన కేంద్రంలో కేంద్రాధికారిగా పనిచేశారు. డాక్టర్ కలవకోలను కాశీ విశ్వేవ్వర శర్మ శివైక్యం చెందడం పట్ల తెలుగు భాషా వికాస ఉద్యమం జిల్లా సంయోజకులు, ఆకాశవాణి సీనియర్ వ్యాఖ్యత డాక్టర్ జాగర్లపూడి శ్యాంసుందర శాస్త్రి సంతాపం వ్యక్తం చేశారు.



వరదలకు ధ్వంసమైన హైదరాబాద్-విజయవాడ హైవే పాలేటి బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను పునఃప్రారంభిస్తున్న జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్

## పాలేటి బ్రిడ్జిపై వాహనాల రాకపోకల పునరుద్ధరణ

**జగ్గయ్యపేట, జనవరి 11, ప్రభాతవార్త :** గత యేడాది సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా ధ్వంసమైన హైదరాబాద్-విజయవాడ హైవే (ఎన్హెచ్-65) గరికపాడు పాలేటి బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఎన్టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గరికపాడు పాలేటి బ్రిడ్జిలు రెండింటిలో ఒకటి వరద తాకిడికి గురై ధ్వంసం కాగా కొన్ని నెలల కాలంగా హైవే అథార్టీ జిఎంఆర్ సంస్థ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎట్టకేలకు పూర్తిచేసింది. దీంతో జగ్గయ్యపేట ఎంఎల్ఏ, ఏపి పిఏసి సభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను పునఃప్రారంభించారు. బ్రిడ్జి నిర్మాణ పనులను చాలా ఆలస్యంగా నిర్వహించటం వలన ఈప్రాంతంలో ప్రతి వారంలో ఒక ప్రమాదం సంభవించటం, ప్రయాణీకులు మృతి చెందుతుండటంతో ఈప్రాంతవాసులు మీడియాతోపాటు సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు చేయటంతో యుద్ధప్రాతిపదికన బ్రిడ్జి మరమ్మతు పనులు పూర్తిచేశారు. సంక్రాంతి పండుగకు ముందే ఈ రహదారిని పునరుద్ధరించటంతో ఈ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు వెసులుబాటు కలిగింది.

## వైభవంగా ముక్కోటి కోరాయి వేడుకలు

**జగ్గయ్యపేట, జనవరి 11, ప్రభాతవార్త :** ప్రతి సంవత్సరం 24 ఏకాదశులు వస్తుండగా సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి అని వ్యవహరిస్తారనే విషయం పాఠకులకు విదితమే. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణ వరకు జరిగే మార్గం మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుంది. శ్రీమహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానిక దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడని హైందవ సంస్కృతిలోని ఒక పెద్ద పండుగ కావటం విశేషం. జగ్గయ్యపేట ప్రాంతంలోని బంగారం కొట్ల కూడలిలో పలు దేవాలయాల నుండి పలు రథాలపై బయలుదేరిన ఉత్సవ మూర్తులు కొరాయి ఉత్సవంలో భాగంగా భక్తులకు దివ్యదర్శనమిస్తారు. ఈ కార్యక్రమం ప్రతి ఏడాది జగ్గయ్యపేట పట్టణంలోని బంగారం కొట్ల కూడలిలో అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈవేడుకలో జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్లు శ్రీరాం బదరినారాయణ, శ్రీరాం సుబ్బారావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కాగా జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీరంగనాయస్వామి, శ్రీవరదరాజస్వామి, ధనశైల శ్రీరామాలయం, స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి, సీతారామపురం శేషాచల శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీచెన్నకేశవస్వామి, శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానాలతోపాటు జగ్గయ్యపేట మండలం బలుసుపాడు శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలో కూడా శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. శ్రీగురుధామ్ వ్యవస్థాపకులు, డాక్టర్ ఏపిజె అబ్దుల్కలాం ఇంటర్నేషనల్ పురస్కార గ్రహీత, ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ-వసంతలక్ష్మి గురు దంపతుల ఆధ్వర్యంలో శ్రీశివానందగురు కల్చరల్-ఎడ్యుకేషనల్ ట్రస్టు ప్రతినిధులు వేడుకలను నిర్వహించారు.

# నిస్తేజమైన మనసుకు పుస్తకంతో ఉపశమనం

## విజయవాడ బుక్ఫెయిర్లో పుస్తకాలు కొనుగోలు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విజయవాడ జనవరి 11 ప్రభాతవార్త ప్రతినిధి:** పుస్తకం మనస్సు నిస్తేజంగా మారిన తరుణంలో ఉపశమనంగా నిలుస్తోందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పుస్తకాన్ని చదవడం, విషయ సారంశంపై ఆలోచన చేయడం మంచి మనస్సు మంచి వ్యాయమాన్ని అందిస్తాయన్నారు. ఒకానొక క్షణంలో పుస్తకం ఇచ్చే సమాచారం సామాజిక జాగృతి దిశలో నడిపిస్తుందన్నారు. పవన్ కల్యాణ్కి పుస్తకాలంటే అమితమైన ప్రేమ. పుస్తక ప్రియులైన పవన్ కల్యాణ్ విజయవాడ బుక్ ఫెయిర్ ను శనివారం ఉదయం సందర్శించారు. దాదాపు రెండున్నర గంటలపాటు పలు పుస్తక కేంద్రాలకు వెళ్ళి పుస్తకాలు కొనుగోలు చేశారు. ప్రతి స్టాలక్షలో పుస్తకాలను పరిశీలించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు పుస్తకాలు కొనుగోలు చేశారు. తెలుగు సాహిత్యానికి సంబంధించి పలు పుస్తకాలు పరిశీలించారు. ప్రముఖ రచయితల నుంచి యువ రచయితల వరకూ పలువురి రచనలను కొనుగోలు చేశారు. అదే విధంగా ప్రాచీన సాహిత్యంపై వెలువరించిన



విశ్లేషణలు, పరిశీలన పుస్తకాలను ఎంచుకున్నారు. వీటితో అనువాద సాహిత్య పుస్తకాలు, నిఘంటువులు , ఆధ్యాత్మిక సంబంధిత రచనలు పరిశీలించి కొనుగోలు చేశారు. ఈసందర్భంగా తనకు ఎంతో నచ్చిన మ్యాన్స్ సెర్చ్ ఫర్ మీనింగ్ పుస్తకం చూసి ఎంతో సంతోషించారు. డా. విక్టర్ ఈ ఫ్రాంకిల్ రాసిన ఈ పుస్తకం చదివితే నిరాశానిస్పృహలు అధిగమించి ఆశావాద భావన కలుగుతుందని చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో నాజీల నిర్బంధాల్లో ఉన్న ఫ్రాంకిల్ ఎలా భవిష్యత్ జీవితాన్ని నిలుపుకున్నాడో ఆ రచన తెలుపుతుందని చెబుతూ బహుమతిగా ఇవ్వడానికి ఉంటాయని ఎక్కువ సంఖ్యల్లో ఈ పుస్తకాలు కొనుగోలు చేశారు. అదే విధంగా భారతీయ చట్టాలు, చరిత్ర, రాజకీయ , పబ్లిక్ పాలసీ, శాస్త్ర సాంకేతిక, వ్యవసాయ, వృక్ష, పర్యావరణ సంబంధిత పుస్తకాలపై ప్రత్యేక ఆసక్తి చేపారు. ఉప ముఖ్యమంత్రి వెంట విజయవాడ నగర కమిషనర్ రాజశేఖర్బాబు, బుక్ ఫెయిర్ నిర్వాహకులు ఎమెస్కో విజయ్కుమార్ టి.మనోహరనాయుడు, లక్ష్మయ్య, బాబ్జీ. జి. విజయకుమార్ తదితరులు ఉన్నారు.

## గ్రామవార్డు సచివాలయాలను రేషనలైజ్ చేసిన సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

**విజయవాడ, జనవరి 11, ప్రభాతవార్త :** రాష్ట్రంలో 15004 గ్రామ వార్డు సచివాలయాలుండగా, 1,27,175మంది ఉద్యోగులున్నారని, వారికి గత ప్రభుత్వం రెండు సంవత్సరాల ప్రొబిషన్ తరువాత రెగ్యులర్ చేస్తామని , ప్రొహిబిషన్ తరువాత రెగ్యులర్ పేస్కేల్ కల్పిస్తామని చెప్పి, 9నెలలు ఆలస్యంగా ప్రొబిషన్ చేసి రావాల్సిన ఎరియర్స్ ఇవ్వకుండా మోసగించారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యులు డా కొండారెడ్డి నరహరి వరప్రసాద్ ఆరోపించారు. శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎన్డిఏ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామ వార్డు సచివాలయాలను రేషనలైజ్ చేయాలన్న ఆలోచన గ్రామ వార్డు సచివాలయాలకు ఒక తీపి కబురని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్లు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల పక్షాన ఉన్నారన్నారు. సంఘ రాష్ట్రాధ్యక్షులు గునిపె రాజేష్ ప్రసంగిస్తూ గ్రామవార్డు సచివాలయ వ్యవస్థలో మొత్తం 22 డిపార్టుమెంట్లు న్నాయని, ఉద్యోగంలో చేరి ఐదు సంవత్స రాలు పూర్తయినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పదోన్నతులు పొందలేదని, వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని, కూటమి ప్రభుత్వంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు మెరుగైన భవిష్యత్తు వుంటుందని కోరు కుంటున్నామన్నారు. రాష్ట్ర కోశాధికారి బెల్లంకొండ పాండురంగా మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సర్వేలు, లైన్డిపార్ట్మెంట్ విధులు ఒకే సమయంలో నిర్వహించడంతో సచివాలయ ఉద్యోగులు మానసిక వత్తిడికి గురవుతున్నారని, అందువల్ల సింగిల్లైన్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కడల బాలాజి, అసోసియేటివ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయగాంధి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాడుగుల రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులనుద్దేశించి ప్రసంగిస్తున్న డా కొండారెడ్డి నరహరి వరప్రసాద్

# మూడు కేటగిరీలుగా సచివాలయాల విభజన

## గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్మాణాత్మక మార్పులు

**విజయవాడ, జనవరి 11,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ,వార్డు సచివాలయాల్లో నిర్మాణాత్మక మార్పులు తీసుకుని వస్తున్నట్లు ఏపీ చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ద్వారా వారి నుంచి మంచి సేవలు పొందేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కొన్ని చోట్ల ఎక్కువగా, కొన్ని చోట్ల తక్కువగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఉన్నారు. రేషనలైజేషన్ ద్వారా వీటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 11,162 గ్రామ సచివాలయాలు, 3,842 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 1,27,175 మంది పని చేస్తున్నారు. ప్రతి సచివాలయంలో 10 మంది ఉద్యోగులు ఉండేలా ఈ విభాగాన్ని డిజైన్ చేయగా చాలా ప్రాంతాల్లో తక్కువ మంది సిబ్బందితో కార్యకలాపాలు నడిపిస్తున్నారు. కొన్నిచోట్ల 4 నుంచి ఆరుగురితో సచివాలయాలు పని చేస్తున్నాయి. రేషనలైజేషన్లో భాగంగా మల్టీ పర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్గా వీరిని విభజించాలనేది ప్రతిపాదన. మల్టీపర్పస్ ఫంక్షనరీస్ విభాగంలోకి విలేజ్ సెక్రటేరియట్ పరిధిలోని పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ మహిళా పోలీస్ వస్తారు. అలాగే వార్డు సెక్రటేరియట్లో వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి వస్తారు. టెక్నికల్ ఫంక్షనరీస్ విభాగంలోకి గ్రామ సచివాలయం పరిధిలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, ఎఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ సెక్రటరీ, వెటర్నరీ సెక్రటరీ, ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారు. టెక్నికల్ ఫంక్షనరీస్ విభాగంలో వార్డు సచివాలయంలో వార్డు రెవెన్యూ సెక్రటరీ, వార్డు హెల్త్ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ సెక్రటరీ, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, వార్డ్ శానిటేషన్ సెక్రటరీ, వార్డు ఎనర్జీ సెక్రటరీ వస్తారు. 2500 మంది లోపు జనాభాకు ఇద్దరు మల్టీ పర్పస్ ఫంక్షనరీస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీస్ కలిపి ఆరుగురు ఉంటారు. 2500 నుంచి 3500 మంది జనాభాకు ముగ్గురు మల్టీ పర్పస్ ఫంక్షనరీస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీస్ కలిపి ఏడుగురు ఉంటారు. 3501 నుంచి ఆపై జనాభాకు నలుగురు మల్టీ పర్పస్ ఫంక్షనరీస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీస్ కలిపి ఎనిమిది మంది ఉంటారు. ఈ విధంగా రేషనలైజేషన్ చేస్తే 2500లోపు జనాభా కలిగిన ప్రాంతంలో ఆరుగురు సిబ్బందితో 3,562 గ్రామ, వార్డు సచివాలయాలు ఉంటాయి. 2500 నుంచి 3500 మంది జనాభా కలిగిన ప్రాంతంలో ఏడుగురు సిబ్బందితో 5,388 గ్రామ, వార్డు సచివాలయాలు ఉంటాయి. 3500 పైగా జనాభా కలిగిన ప్రాంతంలో 8 మంది సిబ్బందితో 6054 గ్రామ, వార్డు సచివాలయాలు ఉంటాయి. మొత్తం 15,004 గ్రామ వార్డు సచివాలయాలు ఉంటాయి. ఈ అంశాలను సమీక్షలో అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ఒకరిని ఆస్పిరేషనల్ సెక్రటరీగా నియమించాలని సూచించారు. వీరి ద్వారా ఎఐ, డ్రోన్ వంటి కొత్త టెక్నాలజీని గ్రామాల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అదే విధంగా ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చెయ్యాలని సూచించారు. కనీసం 2500 జనాభాకు లేదా 5 కి.మీ పరిధిలో ఒక సెక్రటేరియట్ ఉండాలని సిఎం సూచించారు. ఏజెన్సీలలో అవసరం అయితే అదనంగా సచివాలయాలు పెంచాలని సూచించారు. గతంలో ప్రతిపాదించిన విధానం ప్రకారం మొత్తం 1,61,000 సచివాలయ ఉద్యోగులు ఉండాలి. కానీ ప్రస్తుతం 1,27,000 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అయితే ప్రస్తుతం కొత్తవిధానం వల్ల తక్కువ సంఖ్యతో ఎక్కువ సేవలు పొందే అవకాశం ఉంది. ఉన్నవారిని సమర్ధవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా మెరుగైన సేవలు అందించనున్నారు. కొత్త విధానం అమలు పరిస్తే 15 వేల మంది సెక్రటేరియట్ స్టాఫ్ అదనంగా ఉంటారు. వీళ్లలో సాంకేతికంగా అవగాహన ఉన్న వారిని శిక్షణ ఇచ్చి యాస్పిరేషనల్ సెక్రటరీగా నియమించాలని సీఎం సూచించారు. అదే విధంగా ప్రజల సమాచారం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.



శనివారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు

సమాచారం లేని ప్రజలకు సంబంధించి పూర్తి వివరాలు తీసుకునే పక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. జనవరి 20, 2025 నాటికి గృహాలన్నీ జియోట్యాగింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయాల ద్వారా జారీ చేసే సర్టిఫికెట్లపై ముఖ్యమంత్రి ఫోటోలు ముద్రించవద్దని సీఎం స్పషమైన ఆదేశాలు ఇచ్చారు. సర్టిఫికెట్లపై ప్రభుత్వ లోగో మాత్రమే ఉండాలని సీఎం ఆదేశించారు. పిల్లలందరికీ ఆధార్ జారీ ప్రక్రియ ఫిబ్ర వరి 15, 2025 నాటికి పూర్తి చెయ్యాలన్నారు. రాష్ట్రంలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న వ్యక్తుల గురించి సర్వే చేయాలని సూచించారు.

# అల్లు అర్జున్కు భారీ ఊరట

### సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

### ఆదివారం పోలీసుస్టేషన్కు హాజరుపై అర్జున్కు మినహాయింపు

### విదేశాలకు వెళ్లేందుకు అనుమతి

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన సంధ్య థియే టర్ తొక్కిసలాట ఘటనలో నిందితుడుగా వున్న టాలీవుడ్ హీరో అల్లు అర్జున్కు నా ంపల్లి కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ పొందిన అల్లు అర్జున్ ప్రతీ ఆదివారం చిక్కడపల్లి పోలీసు స్టేషన్కు హాజరు కావడంతో పాటు సంతక చేయాలని ఇంతకు ముందు నాంపల్లి కోర్టు ఆదేశించడం తెలిసిందే. కాగా ఈ ఆదేశాల నుంచి అల్లు అర్జున్కు శనివారం నాడు కోర్టు మినహాయింపునిచ్చింది. ప్ర తీ ఆదివారం చిక్కడపల్లి పోలీసు స్టేషన్కు హాజరు కావడం భద్రతా కారణాల రీత్యా కష్టంగా వుందని, ఇదే సమయంలో షూటింగ్ నిమిత్తం విదేశాకు వెళ్లాల్సి వుందని, ఇందుకు కూడా అనుమతించాలని అల్లు అర్జున్ దాఖలు చేసిన పిటిషన్పై శుక్రవారం నాడు నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. దీనిపై విచారించిన నాంపల్లి కోర్టు ఇకముందు ప్రతీ ఆదివారం చిక్కడపల్లి పోలీసు స్టేషన్కు వెళ్లాల్సిన అవసరం లేదని, కేవలం భద్రతా కారణాలతోనే అల్లు అర్జున్కు ఆదివారం నాడు పోలీసు స్టేషన్కు వెళ్లే విషయంలో మినహాయింపు ఇచ్చినట్లు కోర్టు పేర్కొంది. అయితే పోలీసుల విచారణకు సహ కరించాలని, ఆయ నను ఎప్పుడైనా విచారించాలని పోలీ సులు భావిస్తే ముందుగా నోటీ సులు ఇచ్చి విచారణ జరపవచ్చని పోలీ సులకు నాంపల్లి కోర్టు ఆదేశించింది. ఇదే సమయంలో అల్లు అర్జున్ విదేశాలకు వెళ్లేందుకు ఇప్పటి వరకు వున్న ఆంక్షలను రద్దు చేసిన నాంపల్లి కోర్టు ఆయన షూటింగ్ల కోసం విదేశాలకు వెళ్లేందుకు అనుమతిచ్చింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్ ఇప్పటి వరకు నాలుగుసార్లు పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో మొత్తం 18 మంది నిందితులను పోలీసులు ఎఫ్ఐఆర్లో చేర్చారు. ఇందులో అల్లు అర్జున్ ఎ11 గా వుండడం తెలిసిందే. నిందితుల్లో అల్లు అర్జున్ సహా పది మందిని పోలీసులు అరెస్టు చేయగా మిగతా వారు అజ్ఞాతంలో వుండి ముందస్తు బెయిల్ పొందారు. ఇక అరెస్టయిన వారు కూడా బెయిల్పై విడుదలయ్యారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షుల విచారణను పూర్తి చేసిన పోలీసులు కేసు దర్యాప్తును కూడా దాదాపు పూర్తి చేశారు. దీనిపై త్వరలో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయనున్నారు.



## తెలంగాణలో ఉజాల పథకం కింద 28.75లక్షల ఎల్ఇడి బల్బుల పంపిణీ కేంద్రమంత్రి కిషన్రెడ్డి

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** తెలంగాణలో ఉజాల పథకం కింద 28.75లక్షల ఎల్ఈడి బల్బులను పంపిణీ చేసినట్లు కేంద్ర మంత్రి కిషన్రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. ఉజాల పథకం కింద 28.75లక్షల పంపిణీతో 3.75 లక్షల మెగావాట్ల విద్యుత్ ఆదా అయిందన్నారు. అదేవిధంగా రూ.149కోట్లరూపాయలు ఆదాఅయిందని, అదేవిదంగా 3,02, 436టన్నుల కార్బన్డైయాక్సైడ్ తగ్గిందన్నారు. అదేవిధంగా తెలంగాణలో గ్రీనరీతో పాటు మరింత ఇంధన ఉత్పత్తి సామర్థ్యం మెరుగుపడనుందన్నారు. అదేవిధంగా హైదరాబాద్ నగరంలో 11.90లక్షల ఎల్ఈడి బల్బులను అందించినట్లు తెలిపారు.

## తెలంగాణలో త్వరలో ఐఎఎస్ల బదలీ!

### ముఖ్య శాఖల అధికారుల మార్పు

### రెండు రోజుల్లో ఉత్తర్వులు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భారీస్థాయిలో ఐఎఎస్, ఐపీఎస్లను బదిలీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నదని సచివాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు కసరత్తు తుది దశకు చేరినట్టు తెలిపాయి. ముఖ్యశాఖల ఉన్నతాధికారులను సైతం మార్చే యోచనలో ప్రభుత్వం ఉన్నదని, ఆశించిన స్థాయిలో పనితీరు లేకపోవడంతోనే పలువురుని బదిలీ చేయడం ద్వారా మార్పునకు సిద్ధమైట్టు సమాచారం. కొన్ని జిల్లాల కలెక్టర్లు సహా సీనియర్ అధికారులను బదిలీ చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. వాస్తవానికి గతంలోనే పలుమార్లు ఐఎఎస్ అధికారుల బదిలీ జరిగింది.



ఆదివాసి, గిరిజన ప్రజాప్రతినిధుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## హక్కులను స్వేచ్ఛగా ప్రశ్నించే చట్టాలను తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే

**ఆదివాసుల శిక్షణ తరగతుల ఆఖరిరోజు కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క**

**నాగార్జునసాగర్, ప్రభాతవార్త, జనవరి 11:** హక్కులను స్వేచ్ఛగా ప్రశ్నించే చట్టాలను తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వారంరోజులుగా నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని ప్రాజెక్టు హౌస్ లో ఏర్పాటుచేసిన ఆదివాసి, గిరిజన ప్రజాప్రతినిధుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భూమిలేని నిరుపేదలకు జనవరి 26 నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయబోతున్నాం. ఒక్కో దఫా 6000 చొప్పున సంవత్సరంలో రెండు దఫాలుగా 12,000 భూమిలేని పేదల ఖాతాల్లో జమ చేస్తాం కాంగ్రెస్ శ్రేణులు ధైర్యంగా గ్రామాల్లో సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలి. గిరిజనుల కోసం తెచ్చిన పీసా, అటవీ హక్కుల చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేస్తాం. అటవీ సంపదలో గిరిజనులకు హక్కులు అన్ని ఇందిరమ్మ రాజ్యంలో వస్తాయి. ఐటీడీఏలకు పునర్జీవం కల్పిస్తాం. కావలసిన బడ్జెట్ కేటాయిస్తాం, నిరుద్యోగులకు శిక్షణ ఇస్తాం, స్వయం ఉపాధిని కల్పిస్తాం. భారత రాజ్యాంగాన్ని బలహీనపరచాలని, సామాన్యుల హక్కులను కాల రాయాలని పెద్ద కుట్ర జరుగుతుందని,రాజ్యాంగాన్ని రక్షిస్తే అది మనందరినీ రక్షిస్తుంది రాహుల్ గాంధీ ఈ మార్గంలో వేగంగా నడుస్తున్నారన్నారని అంతే వేగంగా కాంగ్రెస్ శ్రేణులు నడవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం తూచా తప్పకుండా.. సంపూర్ణంగా అమలు బాధ్యత నేనే తీసుకుంటాను, వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని ఎస్సీ ,ఎస్టీ సబ్ ప్లాన్ కి సంబంధించి తాను చీఫ్ విప్‌గా ఉన్న సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సమావేశపరిచి అధిష్టానానికి ఒక నివేదిక ఇచ్చి తూచా తప్పకుండా అమలు చేయాలని కోరామని ఆ తర్వాత తాను డిప్యూటీ స్పీకర్ గా ఉన్న సమయంలోనే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ఆమోదం పొందిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద 10 శాతం నిధులు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే... రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఉండటంతోనే సబ్ ప్లాన్ చట్టం అమలు చేయగలుగుతున్నామని ప్రజల్లో గట్టిగా ప్రచారం చేయాలని ఆదివాసీ ప్రజాప్రతినిధులను డిప్యూటీ సీఎం కోరారు.

రాష్ట్రంలో పీసా చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని 100 సంపూర్ణంగా అమలు చేస్తాం అన్నారు.ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు తాను చేపట్టిన పాదయాత్రలో ఇందిరమ్మ ప్రభుత్వం వస్తుందని ఇల్లు లేని నిరుపేద ఎస్సీ, ఎస్టీలకు చెప్పాను. కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో హక్కులు కాదు మాట్లాడే స్వేచ్ఛను కోల్పోయాం అని రాష్ట్ర ప్రజలు ఇందిరమ్మ రాజ్యం తెచ్చారని అన్నారు. తెచ్చుకున్న ఇందిరమ్మ రాజ్యంలో ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యం ఇస్తున్నామన్నారు.

# సరస్వతి అంతర్వాహిని పుష్కరాలు ఘనంగా నిర్వహించాలి

**మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ముక్తీశ్వర ఆలయం, గోదావరి సంగమ తీరంలోని పుష్కర ఘాట్లను కాశీ, హరిద్వార్, ప్రయాగ పుణ్యక్షేత్రాల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మే 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న సరస్వతినది అంతర్వాహిని పుష్కరాల ఏర్పాట్లను సమీక్షించేందుకు శనివారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన అధికారులనుద్దేశించి మాట్లాడారు. పర్యటనల సందర్భంగా చేసే ఏర్పాట్లలాగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలన్నిటిని అత్యాధునిక వసతులతో కళాత్మకంగా రూపొందిచాలని శ్రీధర్ బాబు సూచించారు. సరస్వతి పుష్కరాలు దేశంలో మరెక్కడా జరగవని, కాళేశ్వరం సంగమ స్థలంలో మాత్రమే వందల ఏళ్లగా నిర్వహిస్తున్నారని ఆయన వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లు, స్నాన ఘట్టాల ఆధునీకరణ, శానిటేషన్ పనుల కోసం కేటాయించిన రూ.25 కోట్ల నిధులను సద్వినియోగం చేసి కాళేశ్వరం ప్రతిష్ట నలుదిశలా వ్యాపించేలా కృషి చేయాలని అన్నారు. తెలంగాణా, ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర కూడలిలో గోదావరి, ప్రాణహిత నదులు, అంతర్వాహినిగా సరస్వతి ప్రవంతి కలిసే చోటు అత్యంత పవిత్రమైన సంగమమని ఆయన గుర్తు చేశారు. స్నాన ఘట్టాలను ఆధునికంగా నిర్మించాలి, రోడ్లను పునర్నిర్మించి, విస్తరించడం, భూగర్భ డ్రైనేజి నిర్మాణం, సరస్వతి విగ్రహ ప్రతిష్టాపన పనులను వేగం పూర్తి చేయాలి. పుష్కరాల నిర్వహణ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి. హెలికాప్టర్ జాయ్ రైడ్ల కోసం హెలిపాడ్లకు మరమ్మతులు చేసి సిద్ధం చేయాలి. ఆలయ పర్యాటక ప్రదేశంగా కాళేశ్వరానికి చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి ఏడాది పొడవునా భక్తులు వచ్చేలా ఎక్కడ రాజీ పడకుండా మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టాలి. పేరున్న కన్సల్టెంట్ సంస్థలను నియమించుకునే స్వేచ్ఛ మీకుంది. దేవాదాయ, నీటి పారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, రెవెన్యూ, టూరిజం, ట్రాన్స్‌కో, ఆర్‌టిసి అధికారులంతా కలిసి ఎక్కడా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లలో పాలు పంచుకోవాలి. కాళేశ్వరంలోని ఆర్టీసి బస్ స్టేషన్ ఉన్న ప్రదేశంలో అత్యాధునిక, ఆకర్షణీయమైన నూతన బస్ స్టేషన్‌ను నిర్మించాలి. అత్యాధునిక వీధి దీపాలు, ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలి. వీటి కోసం రూ.62 లక్షల నిధులు ఇప్పటికే విడుదలయ్యాయి. కొత్త జనరేటర్ సెట్ లను కూడా కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచాలి. ఫిబ్రవరి 7 నుంచి 19 వరకు నిర్వహించనున్న కుంభాభిషేకం పనులను కూడా ఎక్కడా లోపం లేకుండా చేపట్టాలి. సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, దేవాదాయ కమిషనర్ ఇ.శ్రీధర్, జాయింట్ కమిషన్ రామకృష్ణారావు, ఎస్. ఈ, దుర్గాప్రసాద్, టూరిజం ఎండి ప్రకాశ్, ట్రాన్స్‌కో ఎస్ఈ మల్సూర్ నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ నిర్మల, డిపిఓ నారాయణరావు, ఇరిగేషన్ ఇఇ తిరుపతి, డిపిఆర్ఓ శీలం శ్రీనివాసరావు, కాళేశ్వరం ఇఓ మారుతి, భూపాలపల్లి ఆర్‌టిసి డివిజనల్ మేనేజర్, డిఎం ఇందు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ముక్తీశ్వరాలయం వార్షిక క్యాలండర్ ను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు. ఫోటోలో దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ రాహుల్ శర్మ, దేవాదాయ కమిషన్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.



# భువనగిరిలో బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి

**ఫర్నిచర్ ధ్వంసం.. నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు బైఠాయింపు**

**నిరసనకారులను అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలింపు**



**భువనగిరి రూరల్, జనవరి 11, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి నేపథ్యంలో భువనగిరిలో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహించిన కాంగ్రెస్ శ్రేణులు జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంపై దాడిచేసి కెసిఆర్, కేటీఆర్ ఫోటోలతోపాటు కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. కెసిఆర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని నిరసనకారులను అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాడికి నిరసనగా బిఆర్ఎస్ నాయకులు పట్టణ కేంద్రంలోని రైతు బజార్ ముందు ముఖ్యమంత్రి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. కార్యాలయంపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తీవ్ర ఉద్రిక్తమైన సంఘటనలు చోటుచేసుకోవడంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**బిఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి**

పట్టణ కేంద్రంలోని బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంపై దాడి చేసి కార్యా లయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన కాంగ్రెస్ శ్రేణులను కఠినంగా శిక్షించాలని పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం పట్టణ కేంద్రంలోని ప్రిన్స్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి భువనగిరి ఎమ్మెల్యే కొమ్మ అనిల్‌కుమార్‌రెడ్డి చిత్రపటాన్ని దగ్ధం చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది ముఖ్యమంత్రి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. డిసిపి స్థాయిలో రివ్యూ నిర్వహించుకుని శాంతిభద్రతలను కాపాడాలని పోలీసులను కోరారు. దాడులు ఇలానే కొనసాగితే చూస్తూ ఊరుకునేది లేదని, దాడికి ప్రతి దాడులు ఉంటాయని హెచ్చరించారు.

# కుంభమేళా వేళ సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసాలు

**వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో హోటళ్ల బుకింగ్‌పై జాగ్రత్తగా ఉండాలి: పోలీసుల హెచ్చరిక**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** యుపిలోని ప్రయోగరాజ్‌లో జరగనున్న మహా కుంభమేళ పురస్కరించుకుని ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు కొ త్త ఎత్తుగడలను ఎంచుకున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) గుర్తించింది. వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో హోటళ్లలో బుకింగ్‌లు చేస్తామని ప్రజలను నమ్మించే కొన్ని గోల్‌మాల్ సంస్థలను సైబర్ నేరగాళ్లు ఏర్పాటు చేసినట్లు గుర్తించిన టిజిసిఎస్‌బి ఈ విషయంలో కుంభమేళాకు వెళ్లే అందరు అప్రమత్తంగా వుండాలని హెచ్చరించింది. ఇందులో ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా క్షణాల వ్యవధిలో బ్యాంకులోని నగదు ఖాళీ అవడం ఖాయమని టిజిసిఎస్‌బి అధికారులు పేర్కొన్నారు. కుంభ మేళకు వెళ్లేవారు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, అధికారిక వెబ్‌సైట్లనే వాడాలని, సోషల్ మీడియాలో వచ్చే వెబ్‌సైట్లను పట్టించుకోవద్దని, ఆకర్షణీయమైన ప్రకటనలతో కనిపించే వాటిని నమ్మవద్దని అధికారులు కోరారు. సైబర్ నేరగాళ్ల బారినపడ్డ వారు వెంటనే 1930కు ఫిర్యాదు చేస్తే చాలావరకు మేలు జరుగుతుందని వారు తెలిపారు. సైబర్ నేరగాళ్ల మోసాలబారిన పడకుండా వుండాలంటే నిరంతరం అప్రమత్తంగా వుండడమే మేలని టిజిసిఎస్‌బి అధికారులు తెలిపారు.



తెలుగు బుక్ ఆఫ్ రికార్డులను అందించిన దృశ్యం

# షేక్ దస్తగిరిబాషాకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో సత్కారం

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా కావలి ప్రాంతానికి చెందిన షేక్ దస్తగిరి భాషాకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డుతో సత్కరించే కార్యక్రమం శనివారం నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగింది. 75 సంవత్సరాల వయస్సులో కూడా ఐదు భాషలలో మిర్రర్ ఇమేజ్‌లో ప్రతిభ కనబర్చినందుకుగాను ఈ పురస్కారంతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర ఏసీపీ(క్రైమ్స్) కెఎం.కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్ ఇ.వెంకటాచారి, ఈస్‌జోన్ అదనపు డీసీపీ రామ్‌దాస్ తేజావత్ హాజరై షేక్ దస్తగిరి భాషాను సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహక సంస్థ అధినేత డాక్టర్ చింతపట్ల వెంకటాచారి, జబర్దస్త్ ఫేమ్ రాకింగ్ రాకేష్, డాక్టర్ వి.శ్రీనాథాచారి, సంఘసేవకుడు దాసరి దయానంద్‌రెడ్డి, వరల్డ్ రికార్డు గ్రహీత డాక్టర్ పేరడీ గురుస్వామి,మెమోరీ ఛాంపియన్ డాక్టర కె.నరేందర్‌రెడ్డి, డాక్టర్ టి.వి.అశోక్‌కుమార్, డాక్టర్ సంఘిశెట్టి సత్యనారాయణ, డాక్టర్ చింతపట్ల సాయిబాబా, డాక్టర్ అక్షరం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# డీజిల్ ఖర్చుల నిర్వహణ కోసమే టికెట్ ధరల పెంపు

**స్పెషల్‌బస్‌ల రేట్లపై వివరణ ఇచ్చిన టిజిఎస్‌ఆర్‌టిసి**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** స్పెషల్ బస్సుల్లో రేట్ల పెంపుపై టీజీఎస్ఆర్టీసీ స్పష్టత ఇచ్చింది. ఎందుకోసం ఎక్కువ రేట్లను వసూలు చేయాలని ప్రయాణీకులకి ఆర్టీసీ యాజమాన్యం వివరణ ఇచ్చింది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిపే స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను సవరించినట్లు యాజమాన్యం స్పష్టం చేసింది. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు .. ఖాళీ బస్సులను త్వరత గతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుందని ప్రకటించింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తున్నట్టు తెలిపింది. పండుగుల, ఇతర స్పెషల్ అకేషన్స్ సందర్భంగా .. స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ఈ సంక్రాంతికి కేవలం 5 రోజులు పాటు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ సవరించినట్టు ప్రకటించింది. ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు ఆర్టీసీ యాజమాన్యం సూచిస్తోంది. తమ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సంక్రాం తికి సొంతూళ్లకు వెళ్లేవారు ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించింది.

# ఒక దేశం, ఒకే ఎన్నికతో దేశంలో నియంత పాలన

**సెప్టెంబరు 21 నుంచి 24 వరకు జాతీయ మహాసభలు**

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానాన్ని తీసుకురావడం ద్వారా దేశంలో నియంత పాలనను తీసుకువచ్చేందుకు కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సంసిద్ధం కావాలని సీపీఐ శ్రేణులకు పిలుపు నిచ్చారు. హైదరాబాద్ బండ్లగూడలోని గిరి ప్రసాద్ భవన్‌లో శుక్రవారం సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో సీపీఐ శతాబ్ది వేడుకలు, జాతీయ మహాసభలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రజా సమస్యలు, ఉద్యమాలు, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్టు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ప్రకటించారు.

ఇటీవల దేశంలో జరిగిన వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలిచేందుకు బీజేపీ ధనబలంతో పాటు, ఇండియా కూటమి అనైక్యత కూడ తోడైందని అజీజ్ పాష తెలిపారు. దీంతో బీజేపీ విజయం సులభమైందన్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతుల ఉద్యమం ఢిల్లీ వేదికగా నేటికి కొనసాగుతోంద.., ఈ ఉద్యమానికీ సంఘీభావంగా రాష్ట్రంలో సైతం పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వర్తించాలని సూచించారు.

# బ్రిటిష్ సామ్రాజ్యానికి వెన్నులో వణుకు వడ్డె ఓబన్న

**పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్**

**ఘనంగా తొలితరం స్వాతంత్ర్య సమరయోధుని 218వ జయంత్యుత్సవం**

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 11, ప్రభాతవార్త :** బ్రిటిష్ సామ్రాజ్యానికి వెన్నులో వణుకు పుట్టించిన వీరుడు వడ్డే ఓబన్న అన్న టీపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ బాల్యమిత్రుడు ఉయ్యాలవా నరసింహారెడ్డితో కలిసి వారిపై వీరోచిత పోరాటంచేసి చరిత్రపుటల్లో నిలిచిపోయిన తొలితరం భారత స్వాతంత్ర్య సమరయోధుడు, చిరస్మరణీయుడని కొని యాడారు.

తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తర గతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉద యం రవీంద్రభారతి ప్రధాన మందిరం వైభవంగా జరిగిన భారతదేశ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 218వ జయంతోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహేష్‌కుమార్‌గౌడ్ విశిష్ట అతిథులు సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితర నాయకులతో కలిసి ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించి మాట్లాడారు. తెల్లదొరపై సైన్యాధ్య క్షుడుగా అలుపెరగని పోరాటం చేసి 39 యేళ్ల యువప్రాయంలో వీరమరణం పొందారని జోహార్లు అర్పించారు.

బిసిలు కులాలను పక్కనపెట్టి ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని, బిసిలకు మరెవ్వరూ సాటికాదని గుర్తుంచుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే కేవలం రాహుల్‌గాంధీ చలవేనన్నారు. బిసిల పాత్ర ఎనలేనిది మరువలేదని స్పష్టం చేశారు. వడ్డెర కులస్తులు కార్పొరేషన్ ఛైర్మన్ల పదవులతోనే సరిపెట్టుకోవద్దని, ఎమ్మెల్యేలుగా పోటీచేసి ఎన్నికయ్యేస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

బిఆర్ఎస్ బిసిలపై కపటిప్రేమ చూపించిందని, వారు ఎదగకుండా గుదిబండగా నిలిచిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఎల్లవేళలా బిసిల అభున్నతికి కట్టుబడి ఉందని భరోసానిచ్చారు. భవిష్యత్తులోనూ వడ్డెర కులానికి



సభలో ప్రసంగిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్, వి.హనుమంతరావు, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

భారత్‌జోడో యాత్రాసమయంలో ప్రజల ఆక్రందనలు అర్థంచేసుకుని కులగణన చేపట్టాలని ఆయన నిర్ణయించడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో 95 శాతానికిపైగా కుల సర్వే పూర్తయిందని, ఆ రిపోర్టు ఆధారంగా బిసిలకు హక్కులు అడిగే ఆస్కారం ఉందని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. బిసిలంతా ఐక్యంగా ఉండి హక్కులను తమ హక్కులను కాపాడుకోవాలని సూచిస్తూ వడ్డె ఓబన్న దేశానికి చేసిన సేవలను మననం చేసుకొని ఘననివాళులర్పించారు. అనంతరం జాజుల శ్రీనివాస్‌గౌడ్, మిగతా అతిథులు ప్రసంగించారు.

# 24 నుంచి ఒయు పిహెచ్‌డి అడ్మిషన్లకు దరఖాస్తులు

**ఫిబ్రవరి 23 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరణ**

**షెడ్యూల్‌ను ప్రకటించిన ఒయు అడ్మిషన్స్ డైరెక్టర్ పాండురంగారెడ్డి**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వందేళ్లకిపైగా చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలో కేటగిరీ-2లో డాక్టర్ ఆఫ్ ఫిలాసపీ(పీహెచ్‌డీ)-2025 అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నెల 24 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు ఓయూ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫిబ్రవరి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. అపరాధ రుసుం రూ. 2000తో మార్చి 5 వరకు స్వీకరించడానికి అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. అర్హత గల అభ్యర్థులు వివిధ ఫ్యాకల్టీల, వివిధ సబ్జెక్టులలో కేటగిరీ-2 పీహెచ్‌డీ-2025 ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 24 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించనున్నారు.

# ఇక బయోమెట్రిక్‌తోనే ఎస్సీ స్కాలర్‌షిప్‌లు

**ఎస్సీ సంక్షేమ శాఖ కొత్త మార్గదర్శకాలు**

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఇకపై పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు పొందాలంటే బయోమెట్రిక్ తప్పనిసరి. బ్యాంక్ అకౌంట్ సైతం ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. 2024-25 విద్యాసంవత్సానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునే షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా తొలుత ఆధార్‌కార్డులో, ఎస్సెస్సీ మెమోలో పేరు ఒకేలా ఉండేలా చూసుకోవాలి. లేకుంటే సరి చేసుకోవాల్సి ఉంటుందని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. అలాగే ఈ పాస్‌లో నిర్ధారించుకున్న తదుపరి మీ సేవ కేంద్రాల్లో సదరు విద్యార్థులు బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పకుండా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ అథెంటికేషన్ పూర్తయ్యాక ఈ పాస్ వెబ్‌సైట్‌లో స్కాలర్‌షిప్ దరఖాస్తు రిజిస్ట్రేషన్‌ను పూర్తిచేసుకోవాలని తెలిపింది.

విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పకుండా డిజిటల్ కీని కొనుగోలు చేసుకుని, ఈపాస్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొంది. డిజిటల్ కీ ఆధారంగా కాలేజీ యాజమాన్యాలే ఆన్‌లైన్‌లో విద్యార్థుల అప్లికేషన్లను పరిశీలించి, స్కాలర్‌షిప్‌ల మంజూరుకు అధికారులకు పంపించాలని కొత్త మార్గదర్శకాల్లో వెల్లడించింది.

# ఆ కుటుంబాల్లో తీరని విషాదం

**కొండపోచమ్మ రిజర్వాయర్‌లో ఐదుగురు యువకుల గల్లంతుతో శోకసంద్రంగా మారిన హైదరాబాద్‌లోని ముషీరాబాద్, ఖైరతాబాద్**

**హైదరాబాద్ (ముషీరాబాద్), జనవరి 11, ప్రభాతవార్త:** సరదాగా స్నేహితులందరూ కలసి ఈత కోసం సిద్ధిపేట కొండపోచమ్మ రిజర్వాయర్‌కు వెళ్లటం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని భోలక్‌పూర్‌కు చెందిన నర్సింగ్‌రావు జయశ్రీ దంపతులకు ధనుష్(20), లోహిత్(19) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ధనుష్ తండ్రికి ఫొటోగ్రఫీలో సహాయపడుతూ పనిచేస్తుండగా, లోహిత్ మీర్‌పేటలోని తీగల కృష్ణారెడ్డి కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవలు కావటంతో ముషీరాబాద్‌లోని మార్టినేట్ హైస్కూల్‌లో కలసి చదువుకున్న స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లాలని ప్లాన్ చేసుకుని, అందులో భాగంగా కొండపోచమ్మ రిజర్వాయర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

శనివారం ఉదయం 9గంటల ప్రాంతంలో వారి ఇంటికి బాల్య స్నేహితులైన బన్సీలాల్ పేటకు చెందిన దినేశ్వర్(17), ఖైరతాబాద్‌కు చెందిన జతిన్(17), అత్తాపూర్‌కు చెందిన సాహిల్(19), రాంనగర్‌కు చెందిన మురుగన్(20), ముషీరాబాద్‌కు చెందిన ఇబ్రహీం(20)లు వచ్చారు.

అందరూ ద్విచక్ర వాహనాలపై ఇంట్లో వారికి చెప్పి ఎంతో ఆనందంగా బయల్దేరి వెళ్లారు. స్నేహితులందరూ సరదాగా నీటిలో ఆడుతూ ఫొటోలు దిగుతూ ఉండగా ఒక్కసారిగా ఐదుగురు నీటిలో గల్లంతయ్యారు. ఇది గమనించిన వెంటనే ఇబ్రహీం, మురుగన్‌లు సురక్షితంగా బయటకు వచ్చేశారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందటంతో నర్సింగ్‌రావు కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. సరదాగా స్నేహితులతో విహారయాత్రకు వెళ్లి మృత్యువాత పడటంతో ముషీరాబాద్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

**ఎమ్మెల్యే ముఠా గోపాల్ దిగ్భ్రాంతి**

యువకులు సరదాగా రిజర్వాయర్‌కు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతి చెందటం పట్ల ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చిన్న వయసులో యువకులు మృతి చెందటం చాలా విచారకరమని, వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు బెస్ట్ వాటర్ ఎఫిషియెంట్ అవార్డు

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి అవార్డు లభించింది. రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా జైపూర్ మండలానికి చెందిన సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ బెస్ట్ వాటర్ ఎఫిషియెంట్ అవార్డు అందుకుంది. 3వ జాతీయ పవర్ జనరేషన్ వాటర్ మేనేజ్మెంట్ అవార్డ్స్-2025లో భాగంగా న్యూఢిల్లీలో కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో అవార్డును ఎస్టీపీపీ డీజీఎం (ఈ అండ్ ఎం) డి. పంతులు అందుకున్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బెస్ట్ వాటర్ ఎఫిషియెంట్ అవార్డ్ రావడంపై సంస్థ సింఎడి ఎన్ బలరాం హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో సుమారు 150 ప్రభుత్వ, ప్రైవేటు విద్యుత్ కేంద్రాల కంటే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి అవార్డు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. సీఎండీ ఎన్. బలరాం, డైరెక్టర్(ఈ అండ్ ఎం) డి. సత్యనారాయణ రావు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

ఆట

# సెమీస్‌లోకి దూసుకెళ్లిన సాత్విక్, చిరాగ్ జోడీ



**ఢిల్లీ:** కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలనే లక్ష్యం దిశగా భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఒక అడుగు ముందుకు వేసింది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో సాత్విక్-చిరాగ్ ద్వయం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. కౌలాలంపూర్ జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జంట 26-24, 21-15తో మలేషియాకు చెందిన యెసిన్ ఓంగ్-ఈ యి టియో జోడీపై గెలిచింది. 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారా ష్ట్ర ప్లేయర్ చిరాగ్ తొలి గేమ్‌లో నాలుగు గేమ్ పాయింట్లు కాపాడు కోవడం విశేషం. రెండో గేమ్‌నూ భారత్ జోడీకి గట్టి పోటీ లభించింది. ఒకదశలో సాత్విక్-చిరాగ్ 8-11తో వెనుకబడ్డారు. కానీ భారత జంట ఇదే స్కోరు వద్ద వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి 12-11తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత స్కోరు 12-12తో సమమైంది. ఈ దశలో సాత్విక్-చిరాగ్ వరుసగా మూడు పాయింట్లు నెగ్గి 15-12తో ముందంజ వేశారు. అదే జోరులో గేమ్‌ను సొంతం చేసుకున్న సాత్విక్-చిరాగ్ వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నారు.



# ప్రపంచ ఉత్తమ జావెలిన్‌గా నీరజ్

ఢిల్లీ: భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా 2024 సంవత్సరానికి గానూ ప్రపంచ ఉత్తమ జావెలిన్ త్రోయర్‌గా ఎంపికయ్యాడు. అమెరికాకు చెందిన ప్రముఖ మేగజైన్ ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్ ప్రకటించిన ర్యాంకింగ్స్ జాబితాలో నీరజ్‌కు అగ్రస్థానం దక్కించుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన 27 ఏళ్ల నీరజ్ ఈ అత్యుతన్నత పురస్కారానికి ఎంపిక కావడం విశేషం. 78 ఏళ్ల చరిత్ర కలిగిన ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్ మేగజైన్ ప్రపంచ ఉత్తమ ప్లేయర్లకు పురష్కారానికి ఎంపిక చేస్తుంది. ఇక 2024లో డైమండ్ లీగ్‌లో ఒక్క విజయం కూడా సాధించని నీరజ్, దోహా, లుసానే, బ్రస్సెల్స్ ఈవెంట్లలో రెండోస్థానంలో నిలిచాడు. ఫిన్లాండ్‌లో జరిగిన పావో నుర్మీ గేమ్స్‌లో నీరజ్ టైటిల్ సాధించాడు. రెండు సార్లు గ్రెనెడాకు చెందిన ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్‌తో పోటీపడి నీరజ్ ఈ జాబితాలో అగ్రస్థానం దక్కించుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన పీటర్స్, గత ఏడాది డైమండ్ లీగ్ మూడు ఈవెంట్లలో విజేతగా నిలిచాడు. 2023లోనూ నీరజ్ ఈ జాబితాలో టాప్ ప్లేస్‌లో నిలిచాడు. అగ్రస్థానం కోసం నీరజ్ చోప్రా, పీటర్స్ మధ్య గట్టి పోటీ సాగింది. గత ఏడాది నీరజ్ డైమండ్ లీగ్ టైటిల్ నెగ్గకపోయినా 3-2తో పీటర్స్పైఆధిక్యంలో నిలిచాడు. ఒలింపిక్ చాంపియన్, పాకిస్తాన్ త్రోయర్ అర్షద్ నదీమ్ ఐదోస్థానం దక్కిం చుకున్నాడు.



## మూడో వన్డేలో న్యూజిలాండ్ చిత్తు
### వైట్ వాష్ నుండి బయటపడిన శ్రీలంక

**ఢిల్లీ:** న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో 140 పరుగుల తేడాతో శ్రీలంక ఘన విజయం సాధించింది. అక్లాండ్ వేదికగా 2-0తో సిరీస్‌ను కైవసం చేస్తున్న న్యూజిలాండ్‌పై శనివారం జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో శ్రీలంక పగ తీర్చుకుంది. దీంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ వైట్ వాష్ నుంచి లంక తప్పించు కుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 290 పరుగుల భారీ స్కోర్ సాధించింది. శ్రీలంక బ్యాటర్లలో నిస్సాంక (66) టాప్ స్కోరర్‌గా నిలవగా, కుశాల్ మెండిస్ (54), లియాంగే (53), కమిందు మెండిస్ (46) రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో మాట్ హెన్రీ 4 వికెట్లు పడగొట్టగా, కెప్టెన్ శాంట్నర్ రెండు, నాథన్ స్మిత్, బ్రెస్వెల్ తలా వికెట్ సాధించారు. అనంతరం 291 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను లంక బౌలర్లు ఆదిలోనే దెబ్బకొట్టారు. అసితా ఫెర్నాండో, తీక్షణ, మలింగ దాటికి న్యూజిలాండ్ కేవలం 22 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమయంలో మార్క్ చాప్మన్ న్యూజిలాండ్‌ను అదుకునే ప్రయత్నం చేశాడు. ఓ వైపు క్రమం తప్పకుండా వికెట్లు పడుతున్నప్పటికీ, చాప్మన్ మాత్రం బౌండరీలు బాదుతూ న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు. లంకేయులపై కౌంటర్ ఎటాక్ దిగిన చాప్మన్ ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో లక్ష్య చేధనలో బ్లాక్ క్యాప్స్ 150 పరుగులకే కుప్పకూలింది. న్యూజిలాండ్ బ్యాటర్లలో చాప్మన్ (81 బంతు ల్లో 81 పరుగులు, 10 ఫోర్లు, ఒక సిక్స్) మినహా మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫమయ్యారు. లంక బౌర్లలో అసితా ఫెర్నాండో, తీక్షణ, మలింగ తలా 3 వికెట్లు సాధించారు. కాగా తొలి రెండు వన్డేల్లో విజయం సాధించిన న్యూజిలాండ్ సిరీస్‌ను 2-1 తేడాతో సొంతం చేసుకుంది.

# స్టార్‌లకు టెస్ట్

## రోహిత్, కోహ్లీకి లాస్ట్ ఛాన్స్.. షమీపై కొనసాగుతున్న సస్పెన్స్
## రిషబ్, రాహుల్ మధ్య రసవత్తర పోరు
## ఛాంపియన్స్ ట్రోఫీపై టీమిండియా సెలెక్టర్ల దృష్టి



**ఢిల్లీ:** అనూహ్య పరిణామాల నడుమ తీవ్ర వేదనను మిగిల్చిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ పరాభవం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న భారత క్రికెట్ జట్టు ఎదుట మరో కఠిన పరీక్ష ఎదురవుతోంది. త్వరలో పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా జరగాల్సి ఉన్న ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 కోసం జట్టును ప్రకటించాల్సి ఉంది. అంతకంటే ముందే స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగబోయే మూడు వన్డేల సిరీస్‌తో పాటు, చాంపియన్స్ ట్రోఫీకీ నేడో రేపో సెలెక్టర్లు జట్టును ప్రకటించే అవకాశముంది. ఈ టోర్నీలో ఎవరిని ఆడించాలనేది సెలక్టర్లు ఇప్పుడు ప్లేయర్లకు కఠిన పరీక్ష పెడుతున్నారు. పేలవ ఫామ్‌తో తీవ్ర విమర్శల పాలవుతున్న సారథి రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిని కొనసాగించడం, వన్డే వరల్డ్ కప్ తర్వాత జట్టుకు దూరమైన షమీ ఫిట్‌నెస్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లో వికెట్ కీపర్‌గా ఎవరు, సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తుది జట్టులో ఉంటాడా వంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రెండేండ్ల క్రితం భారత్‌లో ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో అదిరిపోయే ఫామ్‌తో ఆకట్టుకుని, గతేడాది టీ20 ప్రపంచకప్‌లోనూ రాణించిన భారత స్టార్ బ్యాటర్లు రోహిత్, కోహ్లి ఆ తర్వాత దారుణంగా విఫలమవుతున్నారు. ఇటీవల ముగిసిన ఆసీస్ సిరీస్ వారి వైఫల్యానికి పరాకాష్ట. పేలవ ఫామ్‌తో తీవ్ర విమర్శల పాలవుతూ సిడ్నీ టెస్టులో తనంత తానుగా తుది జట్టు నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి రోహిత్‌కు వచ్చింది. ఇందుకు కోహ్లి కూడా మినహాయింపు కాదు. ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత ఈ ఇద్దరూ రిటైర్మెంట్ ప్రకటించాలని డిమాండ్లు వెల్లువెత్తినా, బీసీసీఐ మాత్రం ఈ ఇద్దరికీ ఆఖరి అవకాశం ఇచ్చేందుకు మొగ్గుచూపినట్లు సమాచారం. వన్డే ఫార్మాట్‌లో ఈ ద్వయానికి ఉన్న రికార్డులు, అనుభవం దృష్ట్యా వారిపై చర్యలేమీ ఉండబోవని, ఈ ఇద్దరూ చాంపియన్స్ ట్రోఫీలో కొనసాగనున్నట్లు బోర్డు వర్గాలు తెలిపాయి.

ఇక సీనియర్ ఆటగాళ్లైన రాహుల్, షమీ, జడేజా, రిషభ్, అక్షర్‌లో ఎవరిని తుది జట్టులో ఆడిస్తారనేది ఆసక్తికరంగా మారింది. వన్డే వరల్డ్ కప్‌లో రాహుల్, షమీ అంచనాలకు మించి రాణించారు. కానీ ఆ తర్వాత భారత్ ఆడిన ఆరు వన్డేలకూ షమీ దూరమయ్యాడు. ఆస్ట్రేలియా సిరీస్ మధ్యలో అయినా ఆడతాడనుకుంటే మోకాలి వాపు తిరగబెట్టడంతో అతడు మళ్లీ ఎన్‌సీఏకు వెళ్లాడు. అయితే ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న అతడి ఫిట్‌నెస్‌ను దగ్గర్నుంచి సమీక్షి స్తున్న బీసీసీఐ మెడికల్ టీమ్.. షమీకి క్లీన్‌చిట్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇంగ్లండ్‌తో జరుగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో షమీని ఆడించనున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లో అంచనాలను అందుకోలేకపోయినా రాహుల్ మరీ చెత్త ప్రదర్శనలైతే నమోదు చేయలేదు. అయితే వికెట్ కీపర్ కోటాలో రాహుల్‌కు పంత్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. మరోవైపు పంత్ కూడా గొప్పగా రాణించింది లేదు. బ్యాటర్ కోటాలో అయితే రాహుల్‌కు అవకాశం లేకపోయినప్పటికీ వికెట్ కీపర్ కోటాలో మాత్రం అతడు పోటీలో ఉన్నాడు. ఈ ఇద్దరిలో సెలెక్టర్ల మొగ్గు ఎవరి వైపు అన్నది త్వరలో తేలనుంది. ఇక సీనియర్ స్పిన్ ఆల్‌రౌండర్ జడేజా బ్యాటింగ్ వన్డేలలో అంత గొప్పగా ఏం లేదు. అతడి స్థానంలో అక్షర్ పటేల్‌ను జట్టులోకి తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. కుల్దీప్ యాదవ్ ఫిట్‌గా లేకుంటే వాషింగ్టన్ సుందర్‌కు తలుపులు తెరుచుకున్నట్టే. ఆసీస్ పర్యటనలో అదరగొట్టిన నితీశ్‌కుమార్ వైపు సెలెక్టర్లు మొగ్గు చూపుతున్నట్టు బోర్డు వర్గాల సమాచారం.



## దక్షిణాఫ్రికా టి20: ఉత్కంఠ పోరులో
# సూపర్ జెయింట్స్ హ్యాట్రిక్స్

**ఢిల్లీ:** సౌతాఫ్రికా టీ20 లీగ్-2025లో దర్బన్ సూపర్ జెయింట్స్ బోణీ కొట్టింది. కింగ్స్ మీడ్ వేదికగా ప్రిటోరియా క్యాపిటల్స్‌లో జరిగిన ఉత్కంఠ పోరులో రెండు పరుగుల తేడాతో దర్బన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన దర్బన్ సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోర్ సాధించింది. దర్బన్ బ్యాటర్లలో కేన్ విలియమ్సన్ (40 బంతుల్లో 60 పరుగులు, 3 ఫోర్లు , 2 సిక్సు) టాప్ స్కోరర్గా నిలవగా, ఓపెనర్ బ్రైస్ పార్సన్స్ (28 బంతుల్లో 47), ఫినిషర్ వియాన్ మల్డర్ (19 బంతుల్లో 45 నాటౌట్) అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడారు. విధ్వంసకర ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్ మాత్రం తీవ్ర నిరాశపరిచాడు. క్లాసెన్ ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. ప్రిటోరియా బౌలర్లలో ముత్తుసామి 3 వికెట్లు పడగొట్టగా, లివింగ్‌స్టోన్ ఒక్క వికెట్ సాధించాడు. అనంతరం 210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ప్రిటోరియా క్యాపిటల్స్‌కు ఓపెనర్లు రెహ్మానుల్లా గుర్బాజ్, విల్ జాక్స్ అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. వీరిద్దరూ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 12 ఓవర్లలోనే 154 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. గుర్బాజ్ (43 బంతుల్లో 89 పరుగులు, 4 ఫోర్లు, 7 సిక్సు) తొలి వికెట్గా వెనుదిరిగాడు. ఆ తర్వాత సెటిల్ అయిన విల్ జాక్స్ (35 బంతుల్లో 64 పరుగులు, 3 ఫోర్లు, 5 సిక్సు) కూడా పెవిలియన్ చేరాడు. దీంతో మ్యాచ్ దర్బన్ వైపు మలుపు తిరిగ పరుగులకు పరిమితమైంది. దర్బన్ బౌలర్లలో నూర్ అహ్మద్, క్రిస్ వోక్స్ తలా 2 వికెట్లు పడగొట్టగా, మహారాజ్, నవీన్ ఉల్‌హాక్ చెరో వికెట్ సాధించారు. కాగా ఈ మ్యాచ్‌తోనే న్యూజిలాండ్ స్టార్ కేన్ విలియమ్సన్ సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో అరంగేట్రం చేశాడు. కేన్ మామ దర్బన్ సూపర్ జెయింట్స్ తరఫున తన అరంగేట్ర మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీతో మెరిశాడు. అయితే ఈ కివీ స్టార్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 మెగా వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయిన సంగతి తెలిసిందే. రూ. 2 కోట్ల కనీస ధరతో వచ్చిన విలియమ్స్‌ను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసేందుకు ఆసక్తిచూపకపోవడం విశేషం.

# బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే ఇదే..

**న్యూఢిల్లీ, జనవరి 11:** కొత్త సంవత్సరం మొదటి నెల అంటే జనవరి నుండి రోజులు వేగంగా గడుస్తున్నాయి. దీంతో పాటు ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న దేశ బడ్జెట్‌పై కూడా ఉత్కంఠ పెరుగుతోంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి బడ్జెట్లో ఏం ప్రతి పాద నలు ఉంచారో అందరూ తెలుసుకోవాలనుకుంటున్నారు. అయితే ఈసారి ఆదాయపు పన్నులో మినహాయింపు ఉంటుందా, ద్రవ్యో ల్బణం తగ్గింపు దిశగా ఏమైనా చర్యలు తీసుకుంటారా? ఇవి ఎక్కువగా చర్చించబడుతున్న కొన్ని ప్రశ్నలు. ఇలా సంప్ర దాయంగా మారింది ప్రతి సంవత్సరం దేశ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ముందు ప్రభుత్వం ఆర్థిక సర్వేను పార్ల మెంట్‌లో ప్రవేశపెడుతుంది. దేశంలో ఆర్థిక సర్వే మొదటిసారిగా 1950-51లో ప్రవేశపెట్టారు, అప్పటి నుండి ఇప్పటి వరకు ఈ సంప్రదాయం కొనసాకుతూనే ఉంది. ఆర్థిక సర్వే అంటే ఏమిటి, అది ఎందుకు ముఖ్యం అంటే, మీరు ఈ



వాణిజ్యం

ఆర్థిక సర్వేను ప్రభుత్వ నివేదికగా పరిగణిం చవచ్చు. ఇందులో గత ఆర్థిక సంవత్సరం పనితీరును సమీక్షి ంచడంతో పాటు, భవిష్యత్తులో వృద్ధి అవకాశాలపై అధికారిక రివ్యూ ఇస్తుంది. దీని ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ తాజా స్థితి గురించి ప్రభుత్వం చెబు తుంది. ఆర్థికసర్వేలో ఏరంగం నుంచి ఎంత ఆదాయం వచ్చిందో, సవాళ్లు ఏంటో తెలుపుతుంది. ఆర్థిక పురోగతికి ఆటంకం కలిగించే అంశాలు ఏమిటి ఇంకా వాటిని ఎలా తొలగించవచ్చు, ఆర్థిక వ్యవస్థ పూర్తి వేగంతోనడవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా ఈసర్వే హైలైట్ చేస్తుంది. ఆర్థిక సర్వేను బడ్జెట్‌కు ప్రధాన ఆధారం అని కూడా అంటా రు. సామాన్యుల దృష్టినుంచి మాట్లా డితే, ఆర్థికసర్వే అనేది ద్రవ్యోల్బణం ఇంకా నిరుద్యోగం వంటి ముఖ్యమైన గణాంకాల గురించి సమాచారాన్ని అందిస్తుంది. పెట్టుబడి, పొదుపు, ఖర్చుల గురించి కూడా మీకు ఒక ఆలోచన వస్తుంది. పెట్టుబడిదారులకు ఆసక్తి కలిగించే విషయం పెట్టుబడిదారుల దృష్టిలో ఈ సర్వే చాలా ప్రయోజనకరంగా ఉంది. ఏయే ప్రాంతాల్లో మంచి పెట్టుబడి అవకాశాలు ఉన్నాయో అర్థం చేసుకోవడానికి ఇది వారికి సహాయపడుతుంది.

# 18% పెరుగుతున్న ఆపిల్ సిఇఓ వేతనం


**వాషింగ్టన్, జనవరి 11:** ప్రముఖ టెక్ కంపెనీ ఆపిల్ (టిమ్ కుక్) సీఈఓ టిమ్ కుక్ వార్షిక వేతనాన్ని 18 శాతం పెంచుతూ కంపెనీ నిర్ణయం తీసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆయనకు 74.6 మిలియన్ డాలర్ల వేతనం ప్రకటించింది బ్లూంబర్గ్ తన నివేదికలో ఈఏడాది ఫిబ్రవరి 25న జరగబోయే కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు యాపిల్ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ సమావేశంలో కుక్ జీతంతో సహా పలు ప్రతిపాదనలను వాటాదారుల ముందుంచనుంది. అక్కడ వాటాదారులకు ఓటింగ్ నిర్వహించి పెంపును అమలు చేయనున్నారు. 2024 సంవత్సరానికిగానూ టిమ్‌కుక్ వేతనం స్టాక్ అవార్డ్స్‌తో పాటు 74.6 మిలియన్ డాలర్లు (రూ.643 కోట్లు) అందించిన యాపిల్ నిర్ణయించింది. అంతకుముందు ఏడాదిలో 63.2 మిలియన్ డాలర్లు (రూ.544 కోట్లు)తో ఈ మొత్తం 18 శాతం ఎక్కువ. కుక్ మొత్తం జీతంలో 3 మిలియన్ డాలర్ల బేసిక్ పే, 58.1 మిలియన్ డాలర్ల స్టాక్ అవార్డులు, దాదాపు 13.5 మిలియన్ డాలర్ల అదనపు పరిహారం అందుకోనున్నారు. కుక్ వేతనం 2023 కంటే



పెరిగినప్పటికీ 202లో అందుకున్న మొత్తం పరిహారంతో ఈసారి చాలా తక్కువ ఉద్యోగులు, వాటాదారుల వేతనాలకు సంబంధించి సంస్థగత వాటాదారుల నుంచి 2023లో యాపిలక్కు తీవ్ర ఒత్తిడి ఎదురైంది. దీనితో తన వేతనాన్ని తగ్గించాలని టిమ్కుక్ స్వయంగా కోరడంతో ఆ ఏడాదిలో వేతనాన్ని తగ్గించిన విషయం తెలిసిందే.

# యుఎస్ కోర్టుకు ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్

**వాషింగ్టన్, జనవరి 11:** ప్రస్తుతం భారతదేశంలోని ఐటీ కంపెనీల వ్యాపారం తిరిగి గాడిన పడుతోంది. ఈ క్రమంలో టెక్ దిగ్గజాల మధ్య యుద్ధం కూడా జరుగుతోంది. టాప్ టెక్ కంపెనీలుగా ఉన్న ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్ మధ్య ప్రస్తుతం మ్యాటర్ సీరియస్ అయ్యింది. అవును దేశంలోని రెండవ అతిపెద్ద టెక్ కంపెనీగా ఉన్న ఇన్ఫోసిస్ కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ పై ఆరోపణలు చేస్తూ కౌంటర్ లా సూట్ దాఖలు చేసింది. ఈ క్రమంలో ఇన్ఫోసిస్ తన హెల్త్ కేర్ ఫ్లాట్ ఫారమ్ హెలిక్స్ లాంట్ ఆలస్యం కావటానికి రవికుమార్ కారణంగా పేర్కొంది. టెక్సాల్ లోని యూఎస్ ఫెడరల్ కోర్టులో ఈమేరకు జనవరి 9న కంపెనీ కేసు ఫైల్ చేసింది. ఇందులో రవి కుమార్ వ్యాపార రహస్యాలను కావాలనే దుర్వినియోగం చేశారని, సీనియర్ ఎగ్జిక్యూటివి స్థాయిలో ఉన్నప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా కీలక ప్రాజెక్టులను వాయిదా వేసినట్లు పేర్కొంది. ఇన్ఫోసిస్‌లో మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ రవి కుమార్.. ఇన్ఫోసిస్‌లో తన పదవీకాలంలో కాగ్నిజెంట్‌కు మారడానికి చర్చలు జరుపుతున్నప్పుడు హెల్త్ కేర్ ప్రాజెక్టుకు వనరులను నిలిపి వేయడం ద్వారా హెలిక్స్ అభివృద్ధిని అడ్డుకున్నాడంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. దీనివల్ల ప్రాజెక్టు దాదాపు 18 నెలలు ఆలస్యం అయిందని పేర్కొంది. ఇన్ఫోసిస్ హెలిక్స్ ప్రారంభాన్ని ఆపడానికి కాగ్నిజెంట్ పోటీ వ్యతిరేక పథకంలో ఇన్ఫోసిస్ హెలిక్స్‌కు బాధ్యత వహించే కీలక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల నియమించుకున్నట్లు టెక్ దిగ్గజం తన దావాలో పేర్కొంది. వాస్తవానికి తాజా కౌటర్ ఆగస్టు 2022లో కాగ్నిజెంట్ తన ట్రైజెట్టో హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్‌తో ముడిపడి ఉన్న వాణిజ్య



రహస్యాలను దొంగిలించిందని ఆరోపిస్తూ ఇన్ఫోసిస్‌పై దావా వేసిన తర్వాత వచ్చింది. అయితే ఈ ఆరోపణలను అప్పట్లో ఇన్ఫోసిస్ కంపెనీ ఖండించిన సంగతి తెలిసిందే. అలాగే కాగ్నిజెంట్ ప్రవర్తన హెల్త్‌కేర్ ఐటీ సేవల కొనుగోలుదారులకు ఎంపికలను పరిమితం చేయడం ద్వారా పోటీని అణచివేసిందని భారతీయ టెక్ దిగ్గజం వాదిస్తోంది. వాస్తవానికి కాగ్నిజెంట్ భారతీయ టెక్ కంపెనీల్లోని ఉన్నత స్థాయి ఎగ్జిక్యూటివ్ లను నియమించుకోవటం చాలా ఆరోపణలకు దారితీసిన సంగతి తెలిసిందే.

# బడ్జెట్‌లో మహిళలకు మరింత ప్రాధాన్యం !

**న్యూఢిల్లీ, జనవరి 11:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యం లోని ఎన్ డీఏ మూడోసారి కేంద్రంలో అధి కారం చేపట్టింది. ఇటీవల జరిగిన ఎన్నికలో ఆ కూటమి విజయం సాధించడానికి మహిళా ఓట్లు ఎంతో కీలకంగా మారాయి. మునుపటి బడ్జెట్లలో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖకు అత్యధికంగా నిధులు కేటాయించారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో మహి ళల ఓట్లు గణనీయంగా పెరిగి, 2024లో ఎన్‌డీఏ విజయానికి పునాదిగా నిలిచాయి. ఈ నేపథ్యంలో కొత్త బడ్జెట్‌లో కూడా మహిళలకు ప్రాధాన్యం ఇస్తారని భావిస్తున్నారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో మహిళా ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2019లో పోల్చితే 18 మిలి యన్ల మంది మహిళలు ఓటింగ్ లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆదాయ బదిలీ పథకాలు, అక్షరాస్యత కార్యక్రమాలు, ముద్ర యోజన రుణాలు, పారిశుధ్య కార్యక్రమాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఇంటి యాజమాన్యం వంటి మహిళా ప్రాధాన్య కార్యక్రమాల వల్ల ఎన్ డీఏ ప్రభుత్వంపై మహిళలకు నమ్మకం ఏర్పడింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14